హైదరాబాద్
శనివారం
24-3-2018
సంపుటి: 2, సంచిక: 112
పేజీలు: 12+16, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మండీల మండువా



- 'మైత్రి'లో



ఎయిర్ 'ఇండియా' టూ ఇజ్రాయెల్

- సౌదీ గగనతలం మీదుగా తొలి విమానం
- దశాబ్దాల నిషేధం ఎత్తేసిన సౌదీ సర్కార్
- ఈ మార్గంలో వెళ్లిన తొలి దేశంగా భారత్

7లో..



మూడూ గులాబికే

రాజ్యసభ ఎన్నికల్లో విజయ ఢంకా

- ప్రకాశ్.. లింగయ్య.. సంతోష్ గెలుపు
- ఓటేసిన 108 మంది ఎమ్మెల్యేలు
- చెల్లని దొంతి మాధవరెడ్డి ఓటు
- కాంగ్రెస్ ఏజెంట్‌కు చూపించి ఓటు
- చెల్లదని నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఫిరాయింపు ఎమ్మెల్యేల ఓటుకు ఓకే
- బండకు 33, బడుగులకు 32, జోగినపల్లికి 32 ఓట్లు
- బలరాంనాయక్‌కు వచ్చినవి 10 ఓట్లే
- ఎన్నికలకు బీజేపీ.. సీపీఎం.. టీడీపీ.. రేవంత్ దూరం



హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి):

ఊహించినట్లుగానే రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయఢంకా మోగించింది. తెలంగాణలో ఎన్నికలు జరిగిన మూడు స్థానాల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. టీఆర్ఎస్ అభ్యర్థులు బండ మిగతా 6లో..



అన్నా నిరవధిక దీక్ష ప్రారంభం

కేంద్రంలో లోక్‌పాల్ నియమించాల్సిందే

- రాష్ట్రాలలో లోకాయుక్త నియామక డిమాండ్
- రామ్‌లీలా మైదాన్ వేదికగానే మళ్లీ నిరశన

న్యూఢిల్లీ, మార్చి 23:

కేంద్రంలో లోక్‌పాల్‌ను నియమించాలన్న ప్రధాన డిమాండుతో ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దేశ రాజధానిలోని రామ్‌లీలా మైదాన్‌లో నిరవధిక నిరహార దీక్ష ప్రారంభించారు. ఇదే డిమాండుతో దాదాపు ఏడేళ్ల క్రితం కూడా మిగతా 6లో..





445 కోట్లు హాంఫట్!

ఐడీబీఐ బ్యాంకు కేంద్రంగా స్కాం

- లేని భూముల్లో చేపల చెరువులు
- నకిలీ పత్రాలతో బ్యాంకుకు టోపీ
- విధుల నుంచి జీఎం తొలగింపు
- రుణగ్రహీతలతో రామారావు కుమ్మక్కు
- ఏపీ.. తెలంగాణలలో భారీ కుంభకోణం
- ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన సీబీఐ

IDBI BANK

హైదరాబాద్, మార్చి 23:

ఐడీబీఐ బ్యాంకులో రూ.445 కోట్ల స్కాం బయటపడింది. హైదరాబాద్ కేంద్రంగా సాగిన ఈ స్కాంకు సంబంధించి బ్యాంకు జనరల్ మేనేజర్ భట్టు రామారావును విధుల నుంచి తొలగించారు. ఆయనపై ఈ మధ్య సీబీఐ మిగతా 6లో..



2లో..

'మనం' ఆధ్వర్యంలో ఉస్మానియా వర్సిటీ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్న 'టెక్నో ఉస్మానియా-2కే18' ఫెస్టివల్ రెండోరోజు శుక్రవారం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. 'ఫుడ్ సినర్జిసమ్', 'టెక్నో పార్మా' పేరుతో సదస్సులు నిర్వహించారు. ఆయా రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.10.06 తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర మ.3.40 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.11.36-1.06; దుర్ముహూర్తం: ఉ.6.21-7.57; రాహుకాలం: ఉ.9.22-10.52; అమృతఘడియలు: ఉ.7.22-8.53; శుభసమయం: ఉ.10.53-1.00.

సూర్యోదయం: 6.21

సూర్యాస్తమయం: 6.24

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శనివారం వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. రాత్రిపూట గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 38 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 22 డిగ్రీలు

గాలిలో తేమ: 60 శాతం

రైతు ఆత్మహత్యలు చాలా తగ్గాయ్

కోటి ఎకరాల మాగాణి మా లక్ష్యం

- మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం
- ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచుతున్నాం
- పనుల్లో పారదర్శకతకు పెద్దపీట
- 21 లక్షల ఎకరాల ఆయకట్టు
- హైదరాబాద్‌లో మినీ ట్యాంక్‌బండ్‌లు
- కేసులతో ప్రాజెక్టులపై కాంగ్రెస్ కుట్రలు
- ఆ పార్టీ బండారం బయటపెడ్తాం
- ప్రజల ముందు దోషిగా నిలబెడ్తాం
- అసెంబ్లీలో మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి):

రైతు సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ సర్కారు అవలంబిస్తున్న విధానాలతో రాష్ట్రంలో వారి ఆత్మహత్యలు తగ్గాయని భారీ నీటి పారుదల మంత్రి హరీశ్ మిగతా 6లో..



కీర్తిపతాక 'శంషాబాద్'

- ఎయిర్‌పోర్టు దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించిన సీఎం కేసీఆర్
- విస్తరణ పనులకు శంకుస్థాపన
- విమాన ఇంధనంపై వరాలు
- వ్యాట్ 1%కి తగ్గింపు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి):

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం(జీఎంఆర్ హైదరాబాద్) ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చి పదేళ్ల పూర్తయిన సందర్భంగా జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన దశాబ్ది వేడుకలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎయిర్ పోర్టు విస్తరణ పనులకు శంకుస్థాపనతోపాటు దేశంలో అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశంలోనే మొట్టమొదటి స్మార్ట్, గ్రీన్ ఫీల్డ్ సిటీని మిగతా 6లో..



ఉత్సాహంగా 'ఫుడ్ సినర్జిసమ్'

- ఆధునీకరణల 'టెక్నో ఫార్మా'
- 'మనం' ఆధ్వర్యంలో రెండోరోజు
- ఘనంగా'టెక్నో ఉస్మానియా-2కే18'

హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి): 'మనం' దిన పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నో ఉస్మానియా-2కే18 లో భాగంగా శుక్రవారం వర్సిటీ టెక్నాలజీ కాలేజీలో రెండోరోజు శుక్రవారం 'ఫుడ్ సినర్జిసమ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంలో పాల్గొని ఆహార రంగంలోని అవకాశాలను, సరికొత్త టెక్నాలజీల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టెక్నో ఉస్మానియా- 2కే18 కన్వీనర్ ప్రొఫెసర్ జి.ప్రభాకర్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ ఆహార పదార్థాలను నిల్వ ఉంచే ఆధునిక పద్ధతులను తెలుసుకునేందుకు తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు. కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్యాంసుందర్.. 'టెక్నో ఉస్మానియా- 2కే18లో' భాగంగా ఇప్పటి వరకు నిర్వహించిన అవయవదానానికై 3కే రన్, స్వచ్ఛ భారత్- స్వచ్ఛ టెక్నాలజీ తదితర కార్యక్రమాలు కాలేజీ ప్రతిష్ఠను పెంచాయని అభిప్రాయపడ్డారు. ఫుడ్ టెక్నాలజీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ కాలేజీలో 1994లో ఫుడ్ టెక్నాలజీ విభాగం ప్రారంభమైందని తెలిపారు. తయారీ, నిలవ పద్ధతులపై అనేక పరిశోధనలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు ప్రారంభించబోతున్నామని చెప్పారు. 'ఫుడ్ సినర్జిసమ్' కార్యక్రమానికి సమాంతరంగా 'టెక్నో ఫార్మా' కార్యక్రమం కూడా జరిగింది. ఇందులో సెంట్రల్ డ్రగ్ టెస్టింగ్ లాబొరేటరీకి చెందిన డాక్టర్ పి.ఎల్.కె.ఎమ్.రావు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు చెందిన డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దినేశ్‌కుమార్, అరబిందో ఫార్మా టెక్నికల్ అసోసియేషట్ వైస్ ప్రెసిడెంట్ పొన్నం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వారంతా ఫార్మసీలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై ప్రసంగించారు. మధ్యాహ్నం మెడికల్ ఇంజినీరింగ్, ఫుట్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ విభాగాల యందు వివిధ అంశాలపై విద్యార్థులు పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. తదుపరి మెడికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు



టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. సాయంత్రం అత్యంత ఉల్లాస భరితమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేతన్నలకు సర్కారు వరం

- ఒక్కో కార్మికుడికి లక్ష రుణ మాఫీ
- సర్కారు వరం.. జీవో జారీ.
- 2010, ఏప్రిల్ నుంచి వర్తింపు
- 8,500 కార్మికులకు లబ్ధి: మంత్రి కేటీఆర్



హైదరాబాద్, మార్చి 23, (మనం ప్రతినిధి) :చేనేత కార్మికులకు ప్రభుత్వం మరొక వరాన్ని ప్రసాదించింది. చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తూ గతంలో ఇచ్చిన జీవోను సవరిస్తూ శుక్రవారం మరొక జీవోను జారీ చేసినట్టు పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ జీవో ద్వారా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు 2010 నుంచి రుణాలు తీసుకున్న చేనేత కార్మికుల మూలధన రుణాలను లక్ష వరక మాఫీ చేస్తున్నట్టు తెలిపారు. తొలుత చేనేత కార్మికులు జాతీయ బ్యాంకుల నుంచి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి చేనేత ఉత్పత్తుల కోసం జనవరి 1, 2014 నుంచి మార్చి 31, 2017 వరకు తీసుకున్న వర్కింగ్ కాపిటల్ వ్యక్తిగత రుణాలను రూ. ఒక లక్ష వరకు (లక్ష పైబడిన రుణాలు తీసుకున్నా లక్ష వరకు మాఫీ లభిస్తుంది) మాఫీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించి జీవోను జారీ చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు కేవలం 2010 మార్చి 31 వరకే రుణ మాఫీ చేసి తర్వాత ఎలాంటి రుణ మాఫీ చేయలేదనే పలువురు నేతన్నలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు జూన్ 2, 2014ను ఒక కటాఫ్ డేట్‌గా పరిగణించి నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నామని, ఈ చేనేత రుణ మాఫీ విషయంలో నేతన్న సంక్షేమం కోసం ప్రత్యేక అంశంగా పరిగణించి సీఎం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు నేతన్నలు చేసిన విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి రుణ మాఫీ ప్రయోజనాన్ని ఏప్రిల్ 1, 2010 నుంచి మార్చి 31, 2017 వరకు కల్పించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జీవో ఎంఎస్ 46 ను విడుదల చేశామన్నారు. ఈ రుణ మాఫీ ద్వారా చేనేత కార్మికులకు సాధ్యమైనంత అధికంగా ప్రయోజనం కలిగించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సాధారణంగా రుణ మాఫీ చేసిన సందర్భాల్లో రుణాలు చెల్లించని వారికే రుణ మాఫీ వర్తింపచేస్తారు. కానీ సకాలంలో రుణాలు చెల్లించిన వారు నష్టపోకుండా ఉండేందుకు వారు చెల్లించిన రుణాలను సైతం ప్రభుత్వం తిరిగి భారీ ఖాతాల్లో వేస్తుందని తెలిపారు. రుణాలు చెల్లించని కార్మికుల ఖాతాల్లో లక్ష రూపాయల పరిమితితో వారి డబ్బులను తిరిగి చెల్లిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు మాఫీ అయిన రుణాలకు తక్కువ కాకుండా తిరిగి రుణ సౌకర్యం కల్పించుటకు హామీ పొందుతారన్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా బ్యాంకుల నుంచి తెప్పించిన వివరాల ప్రకారం ఈ పథకం ద్వారా సుమారు 8,500 మంది చేనేత కార్మికులు రుణ విముక్తులు అవుతారని, దీని కోసం ప్రభుత్వం దాదాపు రూ. 40 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు.



రెవెన్యూ డివిజన్‌గా పరకాల

- ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం

హైదరాబాద్, మార్చి 23: వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో కొత్తగా పరకాల రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఫైలుపై శుక్రవారం సీఎం సంతకం చేశారు. పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర, నడికుడ మండలాలతో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటవుతుంది. పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



'చలో అసెంబ్లీ'లో ఉద్రిక్తత

- సాక్షర భారత్ కాంట్రాక్టు ఉద్యోగుల అరెస్టు
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం
- ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 23: ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపు డిమాండ్‌తో సాక్షర భారత్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన చలో అసెంబ్లీ ఉద్రిక్తంగా మారింది. జిల్లాల నుంచి అసెంబ్లీ ముట్టడికి తరలివచ్చిన సుమారు 5 వేల మందిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆందోళనలో పాల్గొన్న వారిని గోషామహల్ స్టేడియంకు తరలించారు. 20 నెలలు గా జీతాలు అందటం లేదని, కనీస వేతనాలు అమలు చేసి తమని ఆదుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సాక్షార భారత్ లో పని చేసే వీసీఓ లకు రెండు వేలు, యంసీఓ లకు ఆరు వేలు జీతాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, కనీస వేతనంగా వీసీఓ లకు 10 వేలు, యంసీఓ లకు 30 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ఉద్యోగులకు జీతాలు పెంచారని, తమకు మాత్రం ప్రభుత్వం అన్యాయం చేసిందని ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి ఎన్ని సార్లు వినతి పత్రం సమర్పించిన స్పందన లేక పోవడంతో ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18వేల మంది ఉద్యోగులున్నారని, తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

రైతులకు భూపరిహారాన్ని పెంచాలి

- రెవెన్యూ అధికారులపై పనిభారం: సండ్ర


హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారాన్ని పెంచాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పరిహారంతో వారికి తగిన న్యాయం చేకూరడంలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో జరుగుతున్న 400 కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణంలో చాలామంది రైతులు భూములను కోల్పోతున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం పరిహారం చెల్లింపు విషయాన్ని కలెక్టర్‌కు అప్పగించినా వారు పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన 34 సాగు నీటి ప్రాజెక్టులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో చెప్పాలన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగంలో రూ.960 కోట్ల రెవెన్యూ లోటు ఉందని విద్యుత్ ఆర్థిక నియంత్రణ మండలి తెలిపిందని, 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం రూ.560 కోట్లు కేటాయించిందన్నారు. మరీ రెవెన్యూ లోటును ఎలా భర్తీస్తారని ప్రశ్నించారు. కొత్తగా మండలాలతో పాటు పాత మండల రెవెన్యూ ఖాళీల కొరత వేధిస్తోందని, ఫలితంగా ప్రభుత్వం నిర్వహించే సర్వేలతో రెవెన్యూ అధికారులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 150 ప్రభుత్వ పథకాల్లో 4500 మంది సిబ్బంది గ్రామీణ మంచినీటి సరఫరా విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథ పుణ్యమా అని వారికి పది నెలలుగా వేతనాలు అందడంలేదన్నారు. భద్రాచలం ఐటిసి బిపిఎల్ పేపర్ మిల్లు యాజమాన్యం రైతుల నుంచి నేరుగా సుబాబుల్ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. శుక్రవారం నాడు అసెంబ్లీ జీవో అవర్ లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు

19 వేల ఎకరాల్లో ఫార్మా క్లస్టర్

- ప్రపంచంలోనే అతి పెద్దది
- 46 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్
- 'స్టార్టప్-స్టాండ్అప్' ద్వారా 698.66 కోట్లు

హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో 19 వేల ఎకరాల్లో ఏర్పాటు చేసే ఫార్మాసిటీ ప్రపంచంలోనే అతిపెద్దదని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నూతన పారిశ్రామిక పార్కులు అంశంపై కర్నె ప్రభాకర్, ఎం.ఎస్ ప్రభాకర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... గత ప్రభుత్వాల హయాంలో 68 ఏండ్లలో 28 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తే టీఆర్ఎస్ మూడేండ్ల పాలనలో 46వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేశామన్నారు. 2005 నుంచి 2014 కాలంలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేదన్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో హైదరాబాద్ ఫార్మాసిటీ, వరంగల్‌లో మెగా జౌళి పార్కు, సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ జాతీయ పెట్టుబడి తయారీ జోన్, సంగారెడ్డి జిల్లా, సుల్తాన్ పూర్‌లో వైద్య పరికరాల పార్కు, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లు, ఖమ్మం జిల్లా బుగ్గపాడు వద్ద మెగా ఫుడ్ పార్కు, యాదాద్రి జిల్లా దండు మల్కాపూర్‌లో ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కు వంటి మెగా పారిశ్రామిక పార్కులు, నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో స్పైస్ పార్కు, సిద్ధిపేట జిల్లా బండమైలారంలో విత్తన పార్కు, నల్గొండ జిల్లా మిర్యాలగూడ, పెద్దపల్లి జిల్లా కుందనపల్లి రామగుండంలో ఆటోనగర్‌లు, రంగారెడ్డి జిల్లా తుమ్మలూరులో ప్లాస్టిక్ పార్కు వంటి ఇతర పారిశ్రామిక పార్కులు తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటి కోసం భూములను కూడా గుర్తించామన్నారు. పారిశ్రామిక పార్కుల్లో కొన్ని ఇదివరకే ప్రారంభమై, మౌలిక సదుపాయాల పనులు అమలు దశల్లో ఉన్నాయన్నారు. ఇతర నూతన పారిశ్రామిక పార్కుల్లో అవసరమైన ఆమోదాలను పొందినట్టు పేర్కొన్నారు. వీటిని 2018-19లో ప్రారంభించనున్నట్టు తెలిపారు.

'స్టార్టప్-స్టాండ్అప్' ద్వారా 698.66 కోట్లు మంజూరు



రాష్ట్రంలోనిఅనేక ఇంక్యూబేటర్లు ఏర్పాటు చేయడానికి స్టార్టప్- స్టాండ్అప్ ఇండియా విధానాన్ని అమలు చేస్తున్నట్టు ఐటీ శాఖమంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో 35 ఇంక్యూబేటర్లు, కోవర్కింగ్ స్పేసులు ఉన్నాయన్నారు. ఇంక్యుబేటర్ (కో వర్కింగ్) స్పేస్ స్టార్టప్ కార్యకలాపాలతో ప్రమేయమున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలందరినీ నిధుల మద్దతు నిమిత్తం వీసీ ఫర్మ్స్ అండ్ ఏంజెల్ ఇన్వెస్టర్స్‌కు సిఫారసు చేశామన్నారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమంలో బ్యాంకుల ప్రమేయం లేదన్నారు. స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమం కింద ఏడాది కనీసం రెండు ఎస్సీ లేదా ఎస్టీ లేదా మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కేసులకు ప్రతి బ్యాంకు బ్రాంచి ఆర్థిక సహాయం చేయాలన్నారు. తెలంగాణ లోని 4804 బ్యాంకు బ్రాంచ్‌లకుగానూ 778 బ్రాంచ్‌లు స్టాండ్అప్ ఇండియా కార్యక్రమం కింద ఇప్పటి వరకు రూ. 698.66 కోట్ల రుణాలను మంజూరు చేశాయన్నారు.

43 పట్టణాలకు వెయ్యికోట్లు: కేటీఆర్

రాష్ట్రంలోని అన్ని పట్టణాలను అన్ని విధాల అభివృద్ధి చేయటమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆర్థిక పద్దుల చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీఎస్ పథకం ద్వారా రాష్ట్రంలోని 43 పట్టణాల అభివృద్ధికి గానూ రూ. వెయ్యి కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో పార్కులు, రోడ్లు, కూడళ్లతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కోసం జపాన్ సహకారంతో హైదరాబాద్, వరంగల్‌లలో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలకు స్వచ్ఛ టిప్పర్లను ప్రభుత్వమే అందజేస్తుందని చెప్పారు. దేశంలో అత్యంత నివాసయోగ్యమైన పట్టణంగా నాలుగేండ్లుగా వరుసగా హైదరాబాద్ ఎంపిక కావటం హర్షణీయమన్నారు. మున్సిపాల్టీలపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మున్సిపాల్టీలు ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా చర్యలు చేపడ్తున్నామన్నారు. కొత్త పద్ధతుల ద్వారా నిధుల సేకరణకు శ్రీకారం చుట్టామని తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా నగరంలో దశలవారీగా ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో 826 ఆధునిక బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. డీపీఎంఎస్ ద్వారా ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తామని స్పష్టం చేశారు. చార్మినార్‌ను అత్యంత ఆధునికంగా పర్యాటక ప్రాంతంగా రూపొందించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. గండిపేట అభివృద్ధికి రూ. వంద కోట్లు కేటాయించామని తెలిపారు. హైదరాబాద్‌లోని స్లమ్ ఏరియాల్లో బస్తీ దవాఖానాలను 18 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో మొదటి దశలో 20 సరస్సులను రూ. 288కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. మూసీనది ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లో నీటి కొరత లేకుండా కేశవాపురంతో పాటు మరోచోట 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. అన్ని మునిసిపాలిటీలకు మాస్టర్‌ప్లాన్ తయారు చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో 69 పట్టణాల్లో భూగర్భ డ్రైనేజీ విధానాన్ని అమలు చేసేందుకు ప్రతిపాధనలను రూపొందిస్తున్నామని తెలిపారు. హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కొత్తగా 3,150 కి.మి. రహదారులు

- కేంద్రంపై ఒత్తిడి చేసి తెచ్చుకున్నాం: తుమ్మల
- భూ ప్రక్షాళన విజయవంతమైంది: మహమూద్ అలీ



హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి) : కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రానికి కొత్తగా 3,150 కిలోమీటర్ల మేర రహదారులను తెచ్చుకున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శాసనసభలో శుక్రవారం రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పురపాలక, పట్టణాభివృద్ధి, రెవెన్యూ, వాణిజ్యపన్నుల శాఖ, ఆబ్కారీ, మద్యనిషేదశాఖ, ఇంధనశాఖ, నీటి పారుదల శాఖ, రవాణా శాఖల పద్దులపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఆయా శాఖల పద్దుల ఆమోదం సమయంలో సంబంధిత శాఖల మంత్రులు మాట్లాడారు. పద్దులు ఆమోదం పొందినట్టు డీప్యూటి స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాద ప్రాభల్యం నిధుల కింద ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలకు రూ. వెయ్యి కోట్లు మంజూరైనట్టు మంత్రి తుమ్మల తెలిపారు. ఎమ్మెల్యేలకు 120 ఇండ్ల నిర్మాణం పూర్తి అయిందని, ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 104 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్మాణాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50 పూర్తయినట్టు చెప్పారు. భూప్రక్షాళన రాష్ట్రంలో విజయవంతంగా సాగిందని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. భూ ప్రక్షాళన విషయంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని పలు రాష్ట్రాలు ప్రశంసిస్తున్నాయని అన్నారు. వీఆర్ఏల పర్మినెంటు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. రాష్ట్రంలోని తహసీల్దార్ల కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు చేయించేందుకు చర్యలు చేపడ్తున్నామన్నారు. కాగా, గిరిజన ప్రాంతాల్లో విప్పపువ్వుతో తయారు చేసే సారాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే సున్నం రాజయ్య కోరారు. మంత్రి పద్మారావు స్పందిస్తూ గుడుంబా అరికట్టటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విప్పపువ్వుసారా తయారికి అనుమతి లేదన్నారు. తెల్లబెల్లాన్ని సారా తయారీకి ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాన్నారు. కొత్తగూడెంలో ఎక్సైజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీలో కరెంటు సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడ్తుందని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. పాల్వంచలోని కేటీపీఎస్‌లో పాత ప్లాంట్ స్థానంలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న 23,627 మంది పర్మినెంట్ విషయం కోర్టు పరిధిలో ఉందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 60 ఏండ్లలో గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి రూ.3,666 కోట్లు కేటాయిస్తే నాలుగేండ్ల కాలంలో టీఆర్ఎస్ ప్రభుత్వం 8,901కోట్లు కేటాయించిందన్నారు. రెండేండ్లలో రూ. 1700 కోట్లతో సీసీ రోడ్లకు నిధులను మంజూరు చేశామని తెలిపారు. గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం తగ్గించేలా నీటి సరఫరా, వీధిలైట్లకు సంబంధించి ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. 4,500 పంచాయతీల్లో వైకుంఠదామాల నిర్మాణానికి రూ. 10లక్షల50వేల చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. స్వచ్ భారత్‌లో భాగంగా రాష్ట్రంలో ఏడు వేల డంప్‌యార్డులు నిర్మించాల్సి ఉందన్నారు. మొదటి దశలో 4,400 పంచాయతీలకు గానూ 1700చోట్ల వైకుంట దామాలు పూర్తి అయ్యాయని తెలిపారు. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. బజార్లోకి మురుగు నీరు, చెత్త వేయకుండా ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. తండాలను పంచాయతీలుగా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200 కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి తెలిపారు. సిరిసిల్లలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగూడానికి ఆర్టీవో కార్యాలయం మంజూరు చేసినట్టుగా తెలిపారు. జీఎస్టీతో మొదట కొంత ఇబ్బంది పడ్డా తర్వాత పుంజుకున్నామని మంత్రి కడియం శ్రీహరి తెలిపారు.


సిద్ధిపేట.. స్వచ్ఛ ఎక్సలెన్స్


- పురపాలక సంస్థకు జాతీయస్థాయి పురస్కారం
- తడి, పొడి చెత్త నిర్వహణలో దేశంలోనే అగ్రస్థానం
- మంత్రి హరీశ్ హర్షం



ఢిల్లీలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ చేతులమీదుగా సిద్ధిపేట మున్సిపల్ కమిషనర్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23: రాష్ట్రంలోని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్ధిపేటకు మరో అరుదైన గౌరవం దక్కింది. తడి,పొడి చెత్త నిర్వహణలో జాతీయ స్థానంలో అగ్రస్థానంలో నిలవడంతో సిద్ధిపేట పురపాలక సంఘానికి స్వచ్ఛ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) తరపున అన్ని ఎస్ఎల్ఎఫ్‌లతో కలిసి సిద్ధిపేట మున్సిపాలిటీ సహకారంతో స్లమ్ లెవల్ ఫెడరేషన్-ఎస్ఎల్ఎఫ్ శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య సిద్ధిపేటను బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా నిలిపింది. కేంద్ర మంత్రిత్వశాఖ దేశంలోని అన్ని పట్టణాల నుంచి నామినేషన్లను కోరగా, మొత్తం196 నామినేషన్లు వచ్చాయి. తెలంగాణ నుంచి






ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, సిద్ధిపేట పట్టణాలు నామినేషన్లు దాఖలు చేశాయి. ఇందులో 26 స్లమ్ సమాఖ్యలు ఎస్ఎల్ఎఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికవ్వగా, వీటిలో సిద్ధిపేట ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి బహుమతి కింద సాయితేజ స్లమ్ సమాఖ్యకు ఎక్సలెన్స్ అవార్డు ప్రశంస పత్రం, షీల్డ్ తో పాటు రూ.1.50 లక్షల నగదు బహుమతి లభించాయి. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ చేతులమీదుగా సిద్ధిపేట మున్సిపల్ కమిషనర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు నవ్య, కార్యదర్శి విజయ, మెప్మా బృందం ఈ అవార్డును అందుకున్నారు. కాగా, సిద్ధిపేట మున్సిపాలిటీకి జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, శ్రీసాయి తేజ స్లమ్ సమాఖ్య సభ్యులు అభినందనలు తెలిపారు.



364 కిలోల గంజాయి స్వాధీనం

- లారీ కేబిన్‌లో ప్రత్యేక బాక్స్‌ల్లో తరలింపు
- అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద తనిఖీల్లో గుర్తింపు



ఎల్బీ నగర్, మార్చి 23(మనం న్యూస్): హైదరాబాద్ శివారులో భారీ స్థాయిలో గంజాయిని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. శివారు లోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఓ లారీలో 364 కిలోల గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. లారీ ముందభాగం కేబిన్‌లో ప్రత్యేకంగా రెండు గదులను ఏర్పాటు చేసి అందులో గంజాయిన తరలిస్తుండటం గమనార్హం. ఈ గంజాయిని చంటి అనే వ్యక్తి వద్ద కొరటి బిచ్చప్ప, సంతోష్ జాదవ్‌లు కొనుగోలు చేసి జహీరాబాద్‌కు చెందిన హరిమాన్ రాథోడ్‌కు సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి గోవా, మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నారని, కిలో గంజాయిని రూ.2,400 చొప్పున విక్రయిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

సంచార జాతులను ఆదుకుంటాం

- మంత్రి జోగు రామన్న



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఉన్న సంచార జాతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీసీ సంచార జాతుల సమాఖ్య అంశంపై ఎన్ రామచందర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ.. సంచార జాతుల్లో 36 వెనుకబడిన కులా లను గుర్తించామన్నారు. రాష్ట్రంలో 6.50 మంది సంచారజాతుల జనాభా అని పేర్కొన్నారు. వీరిని ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

గుడుంబా విక్రయదారులకు పునరావాసం



- మంత్రి పద్మారావు

హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): గుడుంబా తయారు చేస్తూ పట్టుబడి బైండోవర్ చేసిన వారికి పునరావాసం కల్పిస్తున్నట్లు అబ్కారీ శాఖ మంత్రి పద్మారావు గౌడ్ తెలిపారు. టీఆర్ఎస్ సభ్యుడు సోలిపేట రామలింగారెడ్డి శుక్రవారం నాడు శాసనసభలో అడిగిన ప్రశ్నకు బదులుగా చెప్పారు. గుడుంబా తయారు చేస్తున్న ఒంటరి మహిళలు, వితంతువులు, హెచ్ఐవి సోకిన వారికి పునరావాసంలో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెపారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 6180 మందికి పునరావాసం కల్పించినట్లు తెలియజేశారు. అయితే మంత్రి సమాధానం పట్ల స్పీకర్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 10 వేల గ్రామాల వరకు గుడుంబా సమస్య ఉందని, కనీసం 50 వేల మందికి పునరావాసం కల్పిస్తేనే గుడుంబా రహిత గ్రామాల రూపకల్పన సాధ్యమని స్పీకర్ మధుసూధానాచారి అభిప్రాయపడ్డారు.

అమ్మ ఒడి వాహనాల సంఖ్య పెంచుతాం

- మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రస్తుతం 241 అమ్మ ఒడి వాహనాలు నడుస్తున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. అమ్మ ఒడి వాహనాల సంఖ్య పెంపు, ఈ పథకంపై టీఆర్ఎస్ సభ్యులు అజ్మీరా రేఖ, బొడిగ శోభ శుక్రవారం శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. అవసరాన్ని బట్టి ఈ వాహనాల సంఖ్య పెంచుతామన్నారు. మండలానికి ఒక వాహనం ఇవ్వలేమని స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం: కృష్ణయ్య

- 20వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌కు డిమాండ్




హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి): బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, గొర్రెలు, మేకలు, పందులు పంచిపెట్టారు తప్ప ఉద్యోగాలు ఇవ్వలేదని ఆర్ కృష్ణయ్య విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మట్లాడారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తానని కేసీఆర్ మాట ఇచ్చారని, అయితే అమలుకు నోచుకోలేదన్నారు. బీసీల అభివృద్ధికి 2000లకు పైగా సిఫార్సులు చేస్తే, ఒక్క సిఫార్సుకు కూడా నిధులు కేటాయించలేదన్నారు. ఎంబీసీలో ఏయే కులాలో ఉన్నాయో కూడా గుర్తించలేదని, ఆ వర్గానికి వెయ్యి కోట్లు కేటాయించి, తెలంగాణలో 52 శాతం ఉన్న బీసీలకు 100 కోట్లు కేటాయించడం న్యాయమా అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల ఊసేలేదన్నారు. ఇతర మతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులిస్తున్నా ప్రభుత్వం, హిందువులకు మాత్రం ఇవ్వడం లేదన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లు పూర్తిగా విఫలమయ్యాయని, వాటిలో చదివిన విద్యార్థుల్లో గత 15 ఏళ్లలో కనీసం ఒక్కరూ కూడా ప్రిలిమినరీ పరీక్ష పాసవ్వలేదన్నారు. కాగా, శాసనసభ నియమ నిబంధనల ప్రకారం సభ నడవడం లేదని, ప్రతిపక్షాలు మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీ నడిచే తీరు ఏమాత్రం బాగోలేదని వాపోయారు.

సర్పంచ్‌లకు విస్తృత అధికారాలు ఇవ్వాలి

సర్పంచ్‌లకు విస్తృత అధికారాలు కల్పించాలని, అందుకు తగినట్లుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆర్.క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి పాలనను పటిష్టం చేయాలని, గ్రామపంచాయతీ అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామజ్యోతిని పూర్తిస్థాయిలో అమలుచేయాలని కోరారు. అయితే, హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలకు నీళ్ల పోసే దిక్కులేదని చెప్పారు. ఏండ్ల తరబడి చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు.


కార్యదర్శులను నియమించండి: జలగం



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు నియామకం చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అన్నారు. శాసనసభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరత సమస్యగా మారిందని, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం నెలకొంటుందన్నారు. పట్టణాల తరహాలో మేజర్ గ్రామపంచాయతీల్లోనూ మార్కెట్లను నిర్మించాలన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతంలో ఏటా 30 టీఎంసీల నీరు వృథాగా పోతుందని, ఏదైనా ప్రాజెక్టు నిర్మించి ఆ నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు.

మిషన్ భగీరథతో ప్రజారోగ్యం మెరుగు


- 50 శాతం తగ్గిన మందుల అమ్మకాలు: సోమారపు



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం వల్ల ప్రజారోగ్యం మెరుగు పడిం దని ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నా రు. శాసనసభలో శుక్రవారం ఆర్థిక పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రభుత్వం ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేయడంతో వ్యాధులు తగ్గు తున్నాయని అన్నారు. ఈ ప్రభావం మెడికల్ దుకాణాల్లో 50 శాతం అమ్మకాలు తగ్గాయన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందన్నారు. వచ్చే ఏడాది నాటికి 250 కిలోమీటర్ల మేర గోదావరి నదిలో నీళ్లు నిలవనున్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వల్ల చదువుకున్న యువత కూడా ఇటువైపు మొగ్గు చూపుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 50 శాతం ఎగుమతులు కేవలం ఐటీ రంగం నుంచే ఉండనున్నట్టు చెప్పారు.

జెట్ స్పీడులో 'ఉదయ సముద్రం'

- చురుగ్గా పంపుహౌస్, లైనింగ్ పనులు
- మూడు నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు
- 40 చెరువులను నీళ్లతో నింపుతాం
- కాంగ్రెస్ హయాంలో పని చేయకున్నా బిల్లులు
- కోయిల్‌సాగర్ ఎడమ కాల్వకు 33 కోట్లు
- నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): నల్లగొండ జిల్లాలోని ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులు జెట్ స్పీడు లో జరుగుతున్నాయని నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులపై శాసనసభలో శుక్రవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఉదయం సముద్రం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ప్రారంభించిందన్నారు. అప్పట్లో కమీషన్ల కోసం పంపులు, పైపులు తెచ్చి పెట్టారని, పనులు మాత్రం జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 2014 వరకు పనులు ముందుకు పోలేదన్నారు. పంప్ హౌస్, టన్నెల్ పనులు జరగకపోయినా బిల్లులు మాత్రం తీసుకున్నారని ఆరోపించారు. కరువు పీడిత ప్రాంతాలకు వెళ్లే ప్రాజెక్టు ఉదయసముద్రం అని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.125 కోట్లతో పనులు నిర్వర్తించామన్నారు. నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీరు అందిస్తామన్నారు. పంప్‌హౌస్, లైనింగ్ పనులు వేగంగా జరుగుతు న్నాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద రానున్న వానాకాలంలో పంటకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 40కి పైగా చెరువులు నింపుతామని మంత్రి వెల్లడించారు.

గుడి చెరువు కళకళ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ దేవాలయం సమీపంలో ఉన్న గుడి చెరువుకు మిడ్ మానేరు నుంచి పుష్కలంగా నీటిని సరఫరా చేస్తామని సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శుక్రవారం నాడు శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యుడు చెన్నమనేని రమేష్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ గుడి చెరువు అభివృద్ధికి ముఖ్యమంత్రి 74 కోట్లు కేటాయించారని చెప్పారు. గోదావరి నీటిని పంపింగ్ చేసేందుకు మరో 17 కోట్లు కేటాయించామని హరీశ్ తెలిపారు. ఈ చెరువు కింద 538 ఎకరాల ఆయకట్టు ఉందని మంత్రి వివరించారు.

కోయిల్‌సాగర్ కాల్వల ఆధునికీకరణ

మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వలను ఆధునీకరిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కోయిల్‌సాగర్ కాల్వల ఆధునికీకరణపై దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఎడమ కాల్వ అభివృద్ధికి రూ. 33 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కుడి కాల్వ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు చేపడుతామన్నారు. కోయిల్‌సాగర్ కింద 58 వేల ఎకరాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. వరద నీటి కాలువ ద్వారా 11 చెరువులను నింపే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువలను రీఇంజినీరింగ్ చేసి 630 క్యూసెక్కులు ప్రవహించే విధంగా చర్యలు తీసుకుంటామని హరీశ్‌రావు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు వైద్య పరీక్షలు: మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైవర్ల ఆరోగ్య పర్యవేక్షణకు ఒక క్షుణ్ణమైన వైద్య పరీక్ష కార్యాచరణను అమలు చేస్తున్నట్టు రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లకు వైద్య పరీక్షలు అంశంపై కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి సంస్థ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సంస్థలో పనిచేస్తున్న 56 వేల మంది ఉద్యోగుల వైద్య పరీక్షల కోసం ప్రతీ ఏటా రూ. 48 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అసాధరణ పరిస్థితి సంభవిస్తే తార్నాకాలోని 210 పడకల ఆస్పత్రిలో పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. బస్సులను నడుపుతూ డ్రైవర్లు మరణించిన ఘటనలు మూడు మాత్రమే జరిగాయన్నారు. ఆకస్మిక గుండెపోటే ఇందుకు కారణమని తేలిందన్నారు. 45 ఏండ్ల వయస్సు వచ్చే వరకు నియామక తేదీ నుంచి లెక్కించిన ప్రతి మూడేండ్ల చివరన ఏ1 కేటగిరి కింద నియతికాలిక వైద్య పరీక్ష కోసం డ్రైవర్లను పంపిస్తున్నట్టు పేర్కొన్నారు. కరీంనగర్ లోని 12 పడకల ఆస్పత్రితోపాటు రాష్ట్రంలోని మరో 15 డిస్పెన్సరీలలో ఆర్టీసీ కార్మికులు సిబ్బందికి నిరంతరం వైద్య పరీక్షలు, సేవలు అందిస్తున్నామన్నారు.

విద్యుత్ టారిఫ్ స్లాబులు, రేట్ల సవరణ లేదు: జగదీశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో విద్యుత్ టారిఫ్, స్లాబులు, రేట్లలలో సవరణలేమీ లేవని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి స్పష్టంచేశారు. విద్యుత్ చార్జీల సవరణ అంశంపై సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ వివరణ కోరగా మంత్రి సమాధాన మిస్తూ... అన్ని చార్జీలు సవరణ చేస్తే డిస్కమ్స్‌కు ఏమీ మిగలదన్నారు. ఇప్పటికే రూ.4900 కోట్లకు పైగా డిస్కౌంట్ అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిస్కంల రూ. 8923 కోట్ల రుణ భారాన్ని తీసుకున్నట్టు పేర్కొన్నారు.

భూరికార్డుల ప్రక్షాళన విజయవంతం

- 20నుంచి పాస్ బుక్‌ల పంపిణీ: మహమూద్ అలీ

హైదరాబాద్, మార్చి 23(హైదరాబాద్): రాష్ట్రంలో చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం విజయవంతమైందని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహమూద్ అలీ చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శుక్రవారం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 93 శాతం భూముల రికార్డులు పరిశీలన పూర్తి చేశామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో వందశాతం భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిందన్నారు. ఏప్రిల్ 20 నుంచి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తామని చెప్పారు. వీటిని 17 భద్రతా ప్రమాణాలతో ముద్రిస్తున్నట్లు చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా 72,12,111 మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. సదా బైలామ కింద క్రమబద్ధీకరణకు 2,45,974 ఎకరాల భూముల వివరాలు అందాయన్నారు. ఇవి కాక గిరిజన ప్రాంతాల్లో 25,214 ఎకరాల భూమిలున్నాయన్నారు. వక్ఫ్, ఎండోమెంట్ భూముల రక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు.




మరో 3 వేల ఆలయాలకు సాయం

- దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): ధూప, దీప నైవేద్యం పథకాన్ని ప్రస్తుతం రాష్ట్రంలోని 1805 ఆలయాల్లో అమలు చేస్తున్నామనాని, కొత్తగా మరో 3వేల దేవాలయాలను పథకంలో చేర్చామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. టీఆర్ఎస్ సభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఒడితెల సతీష్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ పథకం కింద ప్రతి గుడికి నెలకు ఆరువేలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు పీఆర్సీ వర్తింపచేసి వేతనాలు ఇస్తున్నామని చెప్పారు.

గురుకులాల ప్రారంభం ఓ రికార్డు

- మూడేండ్లలో 577 గురుకులాలు
- తుది దశలో ఖాళీల భర్తీ ప్రక్రియ
- జూనియర్ కాలేజీలుగా 33 గురుకులాలు
- సీఆర్టీల వేతనాల పెంపుకు సీఎం ఆదేశాలు
- విద్యాశాఖ పరిధిలోకి 'సొసైటీ' గురుకులాలు
- ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1 లక్ష ఖర్చు
- తొలిసారిగా బాలికలకు సానిటరీ న్యాప్కిన్స్
- మండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): తెలంగాణలో కేవలం మూడేళ్లలో 577 గురుకులాలను ప్రారంభించి సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. దేశంలోనే ఈ స్థాయిలో గురుకులాలను ఎక్కడా ఏర్పాటు చేయలేదని చెప్పారు. శుక్రవారం మండలిలో ఆశ్రమ పాఠశాలలపై లఘు చర్చ నిర్వహించగా ఎమ్మెల్సీలు ఉల్లోళ్ల గోవర్ధన్‌గౌడ్, ఫరీదుద్దీన్, నారదాసు లక్ష్మణరావు, శ్రీనివాస్‌రెడ్డి, హసన్ జాఫ్రీ, భానుప్రసాద్, పురాణం సతీష్, పూల రవీందర్, రాములు నాయక్, ఫారుఖ్ హుస్సేన్‌లు అడిగిన ప్రశ్నలకు, తెలిపిన సూచనలకు అనుగుణంగా కడియం వివరణ ఇచ్చారు. టీఆర్ఎస్ మేనిఫెస్టోలోనే కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అమలు చేస్తామని హామీ ఇచ్చామని, ఇందులో భాగంగా అత్యధిక సంఖ్యలో గురుకులాలు ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 67 ఏండ్లలో తెలంగాణలో 296 గురుకులాలు ఏర్పాటుచేస్తే తెలంగాణ ఏర్పడిన మూడేండ్లలోనే 577 గురుకులాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపర్చిన ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని, గ్రంథాలయాన్ని, స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 125 గురుకులాలను ఏర్పాటు చేయాలని కేసీఆర్‌ను కోరితే ఏకంగా 577 గురుకులాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఎస్సీలకు 134, ఎస్టీలకు 75, బీసీలకు 143, మైనార్టీలకు 192 గురుకులాలు ఏర్పాటు కాగా ఇందులో 33 గురుకులాలను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. వీటిల్లో 2,60,137 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఈ గురుకులాలకు ఈ సారి బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.1221 కోట్లు, ఎస్టీలకు రూ. 401 కోట్లు, బీసీలకు రూ. 296 కోట్లు, మైనార్టీలకు రూ. 735 కోట్లు, విద్యాశాఖ గురుకులాలకు రూ. 170 కోట్లు కలిపి మొత్తంగా రూ.2823 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఎస్సీ గురుకులాల్లో 2809, ఎస్టీ గురుకులాల్లో 1027, బీసీ గురుకులాల్లో 2003, మైనార్టీ గురుకులాల్లో 327, విద్యాశాఖ గురుకులాల్లో 2268 పోస్టులను మంజూరు చేశామన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షలు, ఎంపిక పూర్తయిందని, రానున్న విద్యా సంవత్సరం 2018-19లో 8434 మంది అధ్యాపకులు గురుకులాల్లో చేరనున్నారని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన గురుకులాల్లో ఇప్పటికే 240 గురుకులాలకు నూతన భవనాల కోసం స్థలాన్ని కేటాయించామని, ఒక్కో గురుకుల భవనానికి కోటిన్నర రూపాయలు ఖర్చుతో భవన నిర్మాణం చేయనున్నామని తెలిపారు. అదేవిధంగా 4 క్రికెట్ అకాడమీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలను కూడా పెంచాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

గ్రంథాలయాలకు కొత్త భవనాలు

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన 21 జిల్లాల్లో నూతనంగా గ్రంథాలయ భవనాలను నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. రాష్ట్రంలో పౌర గ్రంథాలయాలు అంశంపై గురువారం మండలిలో పాతూరి సుధాకర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, పట్నం నరేందర్‌రెడ్డి వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... రాష్ట్రంలోని 31 జిల్లా గ్రంథాలయ సంస్థల కింద 31 జిల్లా కేంద్ర గ్రంథాలయాలు, 537 బ్రాంచ్ గ్రంథాలయాలు, 831 పుస్తక డిపాజిట్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

విదేశాలకు ప్రతినిధి బృందం


ఇతర దేశాల్లో అమలు చేస్తున్న విద్యావిధానాన్ని అధ్యయనం చేయడానికి త్వరలోనే విదేశాలకు ఒక బృందాన్ని పంపుతామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక సైనిక్ స్కూల్‌ను, ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరొక సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేశామని, వీటి సక్సెస్ రేటును బట్టి ఉమ్మడి ఆదిలాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటును పరిశీలిస్తామన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల పరిధిలో నడుస్తున్న స్టడీ సర్కిళ్లన్నింటినీ ఒకే స్టడీ సర్కిల్ పరిధిలోకి తీసుకొచ్చి దేశంలోనే అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్ ఇప్పించే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. వీటితోపాటు ఐదు సొసైటీల కింద పనిచేస్తున్న గురుకులాలను కూడా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని కేసీఆర్ గతంలోనే చెప్పారని తెలిపారు.

గురుకులాల్లో కామన్ మెనూ

గురుకులాలు వివిధ సొసైటీల కింద పనిచేస్తున్నప్పటికీ ఈ గురుకులాల్లో కామన్ మెనూ అమలు చేస్తున్నామన్నారు. నెలకు నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్, వారానికి ఐదుసార్లు గుడ్లు, ప్రతిరోజు 50 గ్రాముల నెయ్యి, ఉదయం టిఫిన్, పాలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం పోషక విలువలు అందేలా పెడుతున్నామన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లు, డ్యూయల్ డెస్కులు, కంప్యూటర్లు, డిజిటల్ క్లాసులు, హీట్ వాటర్, చలికాలంలో దుప్పట్లు, ట్రంక్ బాక్స్‌లు, గ్లాసులు, ప్లేట్లు, బెడ్స్ అందిస్తున్నామన్నారు. అన్ని గురుకులాల్లో సీసీ కెమెరాలు, బయో మెట్రిక్ మెషిన్లు పెట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బాలికలకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ అందిస్తున్నామని తెలిపారు. ఈ కిట్‌లో బాలికలకు కావల్సిన న్యాప్కిన్స్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. సభ్యులు, ప్రజాప్రతినిధులు కూడా వారి నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు గురుకులాలను సందర్శించి వీలైతే అక్కడే భోజనంచేసి విద్యార్థులను ఉత్సాహ పర్చాలని కోరారు.

రైతాంగానికి తీరని అన్యాయం

- న్యాయం జరిగే వరకు పోరాడతాం
- నిజాం రాజ్యాంగం అమలవుతోంది
- ఎమర్జెన్సీ పాలనను మరిపిస్తోంది
- చలో అసెంబ్లీలో బీజేపీ నేతలు
- అడ్డుకున్న పోలీసులు.. నేతల అరెస్టు
- ఎక్కడికక్కడే గృహనిర్బంధాలు



హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి): ఎన్నికల హామీలను మాటలకే పరిమితంచేసిన కేసీఆర్ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. టీఆర్ఎస్ సర్కారు రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపట్లేదని విమర్శించారు. రైతు సమస్యల పరిష్కారంకోసం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అసెంబ్లీ వరకు కొనసాగింది. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, ప్రభాకర్‌లతో పాటు, కిసాన్ మోర్చ నేతలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీకి బయలుదేరిన నేతలను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేశారు. నాయకులను పోలీసులు వ్యానులో బల వంతం గా ఎక్కించి తీసుకెళ్లారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బీజేపీ నేతలను గృహనిర్బంధం చేశారు. అరెస్టులను నిరసిస్తూ బీజేపీ నేతలు రోడ్డుపై బైఠాయించారు.

పౌరహక్కులను కాలరాస్తోంది: కిషన్‌రెడ్డి

శాంతియుతంగా చేపట్టిన నిరసనపై ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించిదని, పౌరహక్కులను కాలరాసే విధంగా పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కిషన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం పౌరులకు నినదించే అధికారం ఉందని, ప్రభుత్వం తప్పులపై నిరసన తెలియజేసే హక్కు ప్రజలకు ఉందన్నారు. ప్రభుత్వాన్ని రాజ్యాంగ ప్రకారం నడిపిస్తున్నాడా? లేక నిజాం పాలనను అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. పలు జిల్లాల్లోని రైతులను, బీజేపీ కార్యకర్తలను 'చలో అసెంబ్లీ'కి రాకుండా అడ్డుకున్నారని, గృహనిర్బంధం చేశారని ఆయన తెలిపారు. ఎమర్జెన్సీని తలపించేలా పాలన సాగుతోందని, ప్రజల హక్కుల భంగం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నియంతృత్వంతో సాగే పాలన ఎక్కువ రోజులు ఉండదని, ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. తమ పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులతో నిర్బంధం చేశారని కిషన్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ నియంతృత్వ పాలనపై ప్రజలతో పాటు మీడియాకూడా ఆలోచన చేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని స్పష్టం చేశారు.

పెట్టుబడి పథకం ఎన్నికల డ్రామా: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): రుణమాఫీ మినహా రైతులకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక కూడా రైతులు దీనస్థితిలోనే ఉన్నారని, సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని చెప్పారు. దశలవారీగా రుణమాఫీ చేస్తుండడంతో రైతులు తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోయి రుణమాఫీతో లాభం లేకుండా పోయిందన్నారు. దుబ్బాకలో ఆరొందల మంది రైతులకు బ్యాంకులు నోటీసులు జారీచేసిన విషయాన్ని లక్ష్మణ్ ఉదహరించారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శనివారం, మార్చి 24

చట్టసభల ప్రతిష్టంభన


అధికార పక్షం మొండితనానికో, ప్రతిపక్ష సభ్యుల పట్టుదలకో దేశంలోని చట్టసభలు సుదీర్ఘకాలం పాటు ప్రతిష్టంభనకు గురై ప్రజా సమస్యలపై సవ్యమైన చర్చలు జరగకుండానే వివిధ రకాల బిల్లులు నేరుగా చట్టాలుగా మారి అమలులోకి వస్తున్నాయి. అత్యంత కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు సైతం ఎలాంటి చర్చకు నోచుకోకుండా చట్టంగా అమలులోకి రావడం ప్రజాస్వామిక సంప్రదాయానికే సిగ్గుచేటు. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు రాజకీయ లబ్ధి కోసం పోటీపడుతూ చట్టసభల విలువైన సమయాన్ని, ప్రజాధనాన్ని వృథా చేస్తుండడంపై ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మీడియా కథనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజా సమస్యలపై సూత్రబద్ధమైన చర్చ జరిగేందుకు, సభలు నిరసనలతో ప్రతిష్టంభనకు గురికాకుండా ఉండేందుకు, అదేసమయంలో అధికారపక్ష విధానాలపై నిరసనలు తెలియజేసేందుకు ఒక వ్యవహార నియమావళి కావాల్సిన అవసరంపై పలువురు అభిప్రాయపడ్డారు. అయితే ఈ సాకు చూపి బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రతిపక్షం, మీడియా నోరు మూయించే ప్రయత్నాలు ప్రారంభమైనాయి. మొన్నటికి మొన్న రాజస్థాన్‌లో వసుంధర రాజె సింధియా ప్రభుత్వం అవినీతి అధికారులు, ప్రభుత్వోద్యోగుల అవినీతి గురించి ప్రచురించే ముందు ప్రభుత్వ అనుమతి తప్పనిసరంటూ 1973 నేర శిక్షాస్మృతికి సవరణలతో ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. ఇందుకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనకడుగు వేసింది. ఇప్పుడు శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సున్నితమైన అంశాలపై ప్రశ్నలు వేయకూడదని శాసన సభ్యులను శివరాజ్‌సింగ్ ప్రభుత్వం ఆదేశిస్తూ శాసనసభా నిబంధనావళిని సవరించింది. దీంతో రాష్ట్రంలో జరిగే దాడులు తదితర సున్నిత అంశాలపై ప్రశ్నించే హక్కు శాసనసభ్యులు కోల్పోతారు. పాలకపక్ష సభ్యుడైనప్పటికీ స్పీకర్‌ను తటస్థుడిగా ఆయనకు విశేషాధికారాలు కట్టబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినపుడు మంత్రివర్గ విశ్వాస తీర్మానానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు స్పీకర్‌కు అధికారం కట్టబెట్టింది.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. రాజస్థాన్‌లోనూ ఆ పార్టీయే అధికారంలో ఉంది. దేశ పార్లమెంట్ పనితీరుపై కూడా దేశవ్యాప్తంగా తీవ్ర నిరాశానిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఏవో కుంటిసాకులతో చేపట్టకుండానే సెకన్లలో స్పీకర్ లోక్‌సభను వాయిదాలు వేస్తుండడం, అవసరమైన బిల్లుల ఆమోదానికి గందరగోళం అడ్డురాదని భావిస్తున్న ప్రభుత్వ తీరును మేధావులు, విద్యావంతులతో పాటు సామాన్యులు కూడా ప్రశ్నిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి చట్టసభల పట్ల ఉన్న అగౌరవాన్ని చాటి చెబుతున్నాయి. 2014లో విజయం సాధించిన తరువాత పార్లమెంట్‌లోకి తొలి అడుగుపెడుతూ మోదీ గడపకు నమస్కారం పెట్టారు. ఇది చూసి దేశప్రజలు ఆయన చట్టసభల పట్ల చూపుతున్న గౌరవానికి అప్పట్లో మురిసిపోయారు. భవిష్యత్తులో కూడా ఆయన అంతే గౌరవం, సభ్యుల పట్ల అభిమానం చూపుతారన్న విశ్వాసం వమ్ముకావడానికి ఎంతోకాలం పట్టలేదు. గత ఆరు రోజులుగా పార్లమెంట్‌లో జరుగుతున్న నాటకీయ పరిణామాలు చూస్తుంటే ప్రజల సమస్యలపై మన ప్రజాప్రతినిధులకెంత శ్రద్ధ ఉన్నదో అర్థమవుతోంది. మోదీ ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి బీజేపీయేతర పార్టీలన్నీ మద్దతు పలికిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు నిత్యం వాయిదా పడుతూనే ఉన్నాయి. సభలో గందరగోళ దృశ్యాల మధ్య అవిశ్వాస తీర్మానానికి ఎంతమంది సభ్యులు మద్దతు ఇస్తున్నారో లెక్కించడం సాధ్యం కావడం లేదని స్పీకర్ సుమిత్రా మహాజన్ నిత్యం సభ ప్రారంభమైన కొద్ది సెకన్లకే వాయిదాలు వేస్తున్నారు. వెల్‌లోకి వచ్చి తమ సమస్యలపై నినదిస్తున్న సభ్యులతో సభా సమయంలో కాకుండా ప్రభుత్వం చర్చించి న్యాయమైనవాటికి తగిన హామీ ఇస్తే సభ మొత్తం సర్దుకుంటుంది. ఈ చొరవ ప్రభుత్వం నుంచి కనిపించడం లేదు. సభను ఆర్డర్‌లో పెట్టే బాధ్యత ప్రభుత్వ వైఖరిపైనే ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ భాగస్వామ్య పక్షాలు, ప్రతిపక్షాలతో వ్యూహాత్మకంగా వ్యవహరించడంలో విఫలమవుతున్నారన్నది వాస్తవం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత లోక్‌సభలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఇది 27వ సారి. సభలో సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ, ప్రభుత్వానికి ఎటువంటి ఢోకా లేకపోయినప్పటికీ చర్చకు ఎందుకు వెనకాడుతోందో అర్థంకాని విషయం. అదే ప్రతిపక్ష సభ్యులపై సభాహక్కుల తీర్మానాన్ని స్వీకరించేందుకు క్షణం కూడా ఆలోచించడం లేదని మధ్యప్రదేశ్ ప్రభుత్వం రుజువుచేస్తోంది. బీజేపీ ప్రభుత్వాన్ని, మీడియాను 'దొంగలు'గా అభివర్ణించినందుకు కాంగ్రెస్ సభ్యుడు జీతూ పట్వారీపై స్పీకర్ సీతాశరణ్ శర్మ సభాహక్కుల ఉల్లంఘన కింద సభాహక్కుల కమిటీకి నివేదించారు. ఇంతే వేగంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టడంలో తటాపటాయించడంలో ఆంతర్యం అందరికీ ఎరుకే!

ప్రజలిచ్చిన అధికారాన్ని వారి సమస్యల పరిష్కారాన్ని ఉపయోగించాల్సింది పోయి ఇలా చట్టసభల పట్ల అగౌరవంగా ప్రవర్తించడం ప్రజాప్రతినిధులకు అందునా ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న వారికి తగదు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం విషయంలో విలువైన సభా సమయం, ప్రజాధనం వృథా అవుతున్నా ప్రధాని నరేంద్ర మోదీ మౌనం పాటించడం సరికాదు. స్పీకర్ కూడా సభ ప్రారంభమైన క్షణాల్లోనే వాయిదాలు వేయడం, అదీ రోజుల తరబడి పునరావృతం కావడం అనేక అనుమానాలకు, సందేహాలకు తావిస్తోంది. సామాజికార్థిక విధానాలపై చర్చలు జరగకుండా ప్రతిష్టంభనకు గురికావడం ప్రజాస్వామిక సంప్రదాయం కాదు. ఈ సాకుతో ప్రజల, ప్రజాప్రతినిధుల రాజ్యాంగ హక్కులను కాలరాసే కొత్త సంప్రదాయాలు తలెత్తే ప్రమాదం ఉంది.



మంచిమాట



చేయకుండానే చేశానని చెప్పేవాడు అధముడు. కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

- ఆది శంకరాచార్యులు

మరో 'ప్రత్యేక' ఉద్యమం

> తెలంగాణ సమాజంలో కుల వివక్షను ధిక్కరిస్తూ కుల సమానత్వాన్ని బోధించే రామానుజుని వైష్ణవ మతం సహా, శైవంతో పాటు స్థానిక ఆదివాసీ విశిష్ఠ మత సంప్రదాయాలన్నిటినీ వివిధ ప్రత్యేక మైనారిటీ మతాలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడమన్నది రాజకీయంగా ఒక ఎత్తుగడగానూ, సామాజికంగా న్యాయమైన డిమాండ్‌గానూ ఉంటుందని కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య రాజకీయాలు కుల, మత, జాతి, ప్రాంత, జెండర్ తదితర అస్తిత్వాలన్నిటికీ ప్రాతినిధ్యం వహిస్తూ లౌకికంగా, పక్షపాత రహితంగా ఉండాలనే భావన ఆచరణలో పూర్వపక్షమవుతోంది. రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సుల మేరకు లింగాయత్, వీరశైవ (లింగాయత్)లను ప్రత్యేక మైనారిటీ మతంగా గుర్తిస్తూ కర్ణాటక మంత్రివర్గం తీర్మానించింది. దీన్ని వీలైనంత త్వరగా కేంద్రం ఆమోదం కోసం పంపుతామని ప్రకటించింది. తమను ఎస్సీ, ఎస్టీ లేదా బీసీలుగా గుర్తించాలని, ఫలానా వారిని ఎస్టీల జాబితా నుంచి తొలగించాలని, ఆ కులాన్ని బీసీల్లో చేర్చుకుంటే ఉద్యమిస్తామని దేశవ్యాప్తంగా వివిధ కులాలు వివిధ రకాల డిమాండ్లతో ప్రదర్శనలు జరుపుతున్న తరుణంలో కర్ణాటక మంత్రివర్గం లింగాయత్ సామాజిక సమూహాన్ని ప్రత్యేకమతంగా గుర్తించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తూ లింగాయత్‌లు కేరింతలు కొడుతుంటే, దాన్ని వ్యతిరేకిస్తూ వీరశైవులు నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కల్బుర్గీ, దావణగెరె, బిజాపూర్ ప్రాంతాల్లో లింగాయత్‌లు, వీరశైవులు అనేక చోట్ల పరస్పరం దొమ్మీకి దిగారు.

బీజేపీ దూకుడుకు కళ్లెం వేసేందుకే...


రాబోయే ఎన్నికల్లో 'ఏకీకృత హిందూ అస్తిత్వం'అనే రహస్య ఎజెండా కింద అభివృద్ధి నినాదంతో దూకుడుగా ముందుకొస్తున్న బీజేపీని నిలువరించా లంటే, దాని మెజారిటీ హిందూ ఓటు బ్యాంకులను పగులగొట్టాలనే లక్ష్యంతో దశాబ్దాల నాటి లింగాయత్ ప్రత్యేక మతంగా గుర్తించాలనే సమస్య ను కర్ణాటకలో కాంగ్రెస్ ముందుకు తెచ్చింది. భారతీయ బహుళత్వ సమాజాన్ని నిట్టనిలువునా హిందుత్వం పేరుతో ఒక వైపు చీలుస్తూ, ఓట్లకోసం కాంగ్రెస్ సామాజిక విభజనకు పాల్పడుతున్నదని బీజేపీ విమర్శించడం విడ్డూరం. మతం, ప్రాంతం, భాష, జాతి, కులం తదితర అస్తిత్వాల పేరుతో సామాజిక సమూహాల మధ్య వైరుధ్యాలను వైషమ్యాల స్థాయికి తీసుకెళ్ళడం ద్వారా ఈ దేశప్రజల శ్రమశక్తిని కాజేస్తున్న ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా అన్ని అస్తిత్వాల్లోని సామాన్య ప్రజానీకం ఏకమయ్యే అవకాశాలను కాలరాయడమే ఈ రాజకీయపార్టీల కార్యాచరణ ప్రణాళికగా మారింది. ఎన్నో అక్రమాలు, ఎన్నో అకృత్యాలు, ఎన్నో వంచనలు, కుంభకోణాలు, ఆర్థిక కుట్రలు అన్నీ ఈ అస్తిత్వ వైషమ్యాల పెనుమాయలో సౌకర్యవంతంగా మరుగునపడుతుంటాయి. ఓట్ల కోసం విద్వేష విషాన్ని వెళ్లగక్కడం, ఉద్వేగాల్ని రెచ్చగొట్టడం అనే కార్యాచరణను గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కొనసాగిస్తూ అధికారాన్ని హస్తగతం చేసుకోవడం తెలిసిందే. హిందూ మతతత్వసంస్థ ఆరెస్సెస్ వెన్నుదన్నుతో దేశ రాజకీయ యవనికపై క్రియాశీల మత రాజకీయాలను బీజేపీ చేపట్టింది.

కాంగ్రెస్, బీజేపీల మత రాజకీయాలు

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి నుంచి మహాత్మా గాంధీ నేతృత్వంలో 'హే రామ్' నినాదం వెనుక సౌమ్యరూపంలో మత రాజకీయాలను కాంగ్రెస్ చేపట్టింది. ఆ క్రమంలోనే బీజేపీకి చెక్ పెట్టేందుకు కర్ణాటక సిద్ధరామయ్య ప్రభుత్వం లింగాయత్‌లను మత మైనారిటీలుగా గుర్తించింది. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించనిదే లింగాయత్‌లను ప్రత్యేక మైనారిటీ మతంగా గుర్తించడం సాధ్యంకాదని, కర్ణాటక మంత్రివర్గ నిర్ణయం మూలనపడుతుందని తెలిసినా, రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఈ అంశంపై దెబ్బతీసేందుకు ఉపకరిస్తుందని కాంగ్రెస్ ఎత్తు వేసింది.

నీవు నేర్పిన విద్యయే...

ఈశాన్య రాష్ట్రంలో పాగా వేసేందుకు స్థానిక జాతుల ఉద్యమాల్ని లోపాయికారీగా సమర్థించి అధికారంలోకి వచ్చిన బీజేపీ చేసిన తీరులోనే కర్ణాటకలో కాంగ్రెస్ మతపరమైన ఉద్వేగాన్ని వాడుకుంది. అయిదేళ్ళ క్రితం బీజేపీ నుంచి తప్పుకొని సొంత పార్టీపెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా వీరశైవ లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించాలని ప్రతిపాదిస్తూ రాసిన లేఖను అప్పటి యూపీఏ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం యడ్యూరప్పను, బీజేపీని ఇరకాటంలోకి నెట్టింది. అయితే కుల వ్యవస్థ పాటిస్తూ, వైదిక సంప్రదాయాలను అనుసరించే వీరశైవులను హిందూ మతంలోనే కొనసాగుతామని డిమాండ్ చేస్తూ ఉద్యమించేలా బీజేపీ రెచ్చగొట్టడంతో కర్ణాటక రాష్ట్రమంతా తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కర్ణాటక జనాభాలో దాదాపు 17 శాతంగా ఉన్న లింగాయత్‌లు, వందకు పైగా నియోజకవర్గాల్లో ప్రధాన ఓటు బ్యాంకుగా ఉంటూ రాష్ట్ర రాజకీయాలలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికార పోటీలో లింగాయత్‌లోని విభాగాలు అంతర్యుద్ధంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీదర్, బెళగావి, లాతూర్, కల్బుర్గి తదితర ప్రాంతాల్లో లింగాయత్‌లు భారీ ర్యాలీలు నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్‌లో బెంగళూరులో



జాతీయ సదస్సు జరిగిన నేపథ్యంలో రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ లింగాయత్‌ల డిమాండ్‌ని పరిశీలించి రూపొందించిన నివేదిక ఆధారంగా ఈ కేబినెట్ నిర్ణయం జరిగింది.

కల్బుర్గీ, గౌరీ లంకేష్‌ల మూల్యం

లింగాయత్‌లను తొలుత ప్రత్యేక మతంగా గుర్తించినప్పటికీ, 1881లో జరిగిన జనగణనలో వారిని హిందూ మతంలో అంతర్భాగమైన కుల సమూహంగా వర్గీకరించారు. ప్రముఖ సాహితీవేత్త, హంపీ విశ్వ విద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ కల్బుర్గీ, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్‌ఎం జాందార్‌లు లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించాలని ప్రచారం చేశారు. ఆ విషయాన్ని లింగాయత్ మతాలు సరిగా పట్టించుకోలేదని వారు విమర్శించేవారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం, సంఘ పరివార్ శక్తులు గణనీయంగా పెరిగి అనేక విద్వేష ఘటనలు జరుగుతున్న క్రమంలోనే, లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్న కల్బుర్గీని దుండగులు కాల్చి చంపారు. అదే విధంగా 'కోము సౌహార్ద్ర వేదిక' అనే హక్కుల సంస్థకు నాయకత్వం వహిస్తున్న గౌరీ లంకేష్ లింగాయత్ మైనారిటీ మత డిమాండ్‌కు మద్దతునిచ్చే అనేక ప్రదర్శనల్లో కీలక భూమిక పోషించిన కారణంగా దుండగులు కాల్చిచంపారు. 2000లో అఖిల భారత వీరశైవ మహాసభ ఏర్పడిన తర్వాత 2003 నుంచి ప్రత్యేక మత గుర్తింపు కోసం ఆందోళన ప్రారంభించింది. వేదాలను తిరస్కరిస్తూ మతగురువుల పరంపరపై ఆధారపడి నడుస్తున్న బౌద్ధ, జైన, సిక్కు మతాల్లాగా తమను గుర్తించాలన్న లింగాయత్‌ల ఉద్యమం 2013 ఆగస్టు నాటికి పరాకాష్ఠకు చేరి, రెండు లక్షల మందితో నిరసన ప్రదర్శన జరిగింది. ఇప్పటికే వారు పొందుతున్న 15 శాతం రిజర్వేషన్లలో మార్పేమీ లేకపోయినా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 28, 29, 30ల ప్రకారం మత ప్రచారానికి, మతపరమైన అధికారిక కార్యక్రమాల్లో ప్రత్యేక స్థానం సహా ప్రత్యేక రక్షణలు ఉంటాయి. మత మైనారిటీ గుర్తింపుతో సొంతంగా విద్యాసంస్థలు, ఇతర ధార్మిక సంస్థలకు ప్రత్యేక రక్షణలు, సదుపాయాలు, గ్రాంట్లు అందుతాయి.

బౌద్ధం మార్గంలోనే లింగాయతిజం

బౌద్ధం తర్వాత వైదికమతంపై తిరుగుబాటు చేసి, వేదాల ఆధిపత్యాన్నీ, దొంతర్ల కులవ్యవస్థను, కర్మసిద్ధాంతాన్ని వ్యతిరేకించిన ప్రజాస్వామ్య మత సంస్కరణోద్యమంగా లింగాయత్ మతం చరిత్రలో నిలిచింది. 12వ శతాబ్దంలో తత్వ వేత్త, రాజనీతిజ్ఞుడు అయిన దక్షిణాది లోని మరో తత్వవేత్త రామానుజుడి దార్శ నికతను పోలిన ఏకేశ్వర వాదాన్ని ఇష్టలింగ రూపంలో పూజించే లింగాయత్ మతశాఖను ఏర్పాటు చేశారు. 'పనే దైవం' అని నినదించి ప్రజల్లో కర్మ సిద్ధాంతపు భ్రమల నుంచి ఆశావాదం వైపు నడిపించిన గొప్ప ఉద్యమకారుడు బసవన్న. అయితే 14వ శతాబ్దం నాటికి హిందూమతంపై ధిక్కారంగా ఉనికిలోకి వచ్చిన లింగాయతిజం మత శాఖ నుంచి ఒక ఉపశాఖలా వేద తాత్విక ధోరణి పునాదితో వీరశైవ మతం ఆవిర్భవించింది. 'లింగా యత్‌లు బసవన్న బో ధనలు అనుసరిస్తే, వీరశైవులు వైదిక సంప్రదాయా లను పాటిస్తారని, కుల, జెండర్ వివక్షను అమలు చేస్తారని, ఆంధ్రప్రదేశ్‌లోని శైవ బ్రా హ్మణులు బసవన్న బోధనలకు ఆకర్షితులై లింగాయ త్‌లుగా మారారు. అయి తే శతాబ్దం అనంతరం వారి శైవమతంలోని సంప్రదాయాలను, ధోరణులను లింగా యతిజంలోకి తీసుకొచ్చార'ని గౌరీలంకేష్ రాశారు. అఖిల భారత వీరశైవ మహాసభ 1904లో లింగాయ త్‌లు, వీరశైవులు ఒకటేనని ప్రకటించినా, 1940లో లింగాయత్‌లు హిందువులు కాదని ఆ మహాసభ స్పష్టం చేసింది. అప్పటి నుంచి లింగాయత్‌లను హిం దూమతంలో భాగంగా పరిగ ణించరాదన్న డిమాండ్ నివురుగప్పిన నిప్పులా రాజు కుంటూనే ఉంది. వివిధ సందర్భాల్లో రాజకీయ పక్షాలు తమ అవసరార్థం ముందుకుతెచ్చి, ఆ తర్వాత ఇరుపక్షాలను బుజ్జగిం చేందుకు ప్రయత్నాలు సాగినా ఆ వైరుధ్యం దశాబ్దా లుగా కొనసాగుతూనే ఉంది. వైదిక ధర్మం పునాదిగా 'ఏకీకృత హిందూ అస్తిత్వం' రహస్య ఎజెండాతో దూసుకొస్తున్న బీజేపీని నిలువరించేందు కు ప్రత్యర్థులకు లింగాయత్‌ల డిమాండ్ ఉపకరించింది. అంతే గానీ లేని వైరుధ్యాన్ని కాంగ్రెస్ కొత్తగా సృష్టించలేదన్న విషయం తెలిసిందే. రాజకీయార్థిక విధానాలు కాక, కుల, మత, జాతి, ప్రాంత తదితర అస్తిత్వాలు రాజకీయ పక్షాల ప్రధాన ఎజెండాలుగా మారి న నేపథ్యంలో లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్ మరింత బలంగా ముందుకు రావడానికి అవకాశం దొరికినట్లయింది. అయితే మెజారిటీ మత స్థలను మతతత్వం పేరుతో ఏకం చేసేం దుకు బీజేపీ ప్రత్యక్షంగా, స్వయంగా ప్రయత్నించవలసిన అవసరంలేదు. తాను అభివృద్ధి కేంద్రిత రాజకీ యాలను ప్రచారం చేస్తుంది. అయితే మిగతా సంఘ పరివార్ శక్తులు సమాజాన్ని మైజారిటీవాదానికి అనుగుణంగా చీల్చే కార్యాచరణ ఫలితంగా పరోక్షంగా హిం దుత్వ ఓటు బ్యాంకులు తయారై బీజేపీ విజయానికి దోహదం చేయడమనేది గుజరాత్, మహారాష్ట్రల నుంచి ఈశాన్య రాష్ట్రాల దాకా నడచిన చరిత్ర. ప్రధాన జాతీయ ప్రత్యామ్నాయం కొడిగట్టిపోవడంతో పాటు, దాదాపు మూడు దశాబ్దాలుగా సాగిన సంకీర్ణ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ప్రాంతీయ పార్టీలను సైతం బీజేపీ పథకం ప్రకారం మింగేస్తోంది లేదా నామమాత్రావసిష్టంగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ రాజకీయ సునామీ నుంచి తప్పించుకోవాలంటే, దాని మెజారిటీ ఓటు బ్యాంకుకు గండిపెట్టడం తప్ప వేరే దారి లేదు.

తెలుగు పాలకులకు కర్నాటకే బాసట

వివిధ తాత్విక సంప్రదాయాల సమ్మే ళనంగా ఒక 'ఏకీకృత హిందూ అస్తిత్వ' పునాదిగా ఏర్పడిన ఈ మిథ్యా మత వ్యవస్థను ఢీకొట్టడం అంత తేలికైన విషయం కాదు. వైష్ణవం, లింగాయతిజం వంటి కుల వ్యవస్థను ధిక్కరించే అనేక మతతాత్విక శాఖలు వైదిక సంప్రదాయాల చట్రంలో అంతర్భాగమై (అధ్యారోపితాలుగా మారి) తమ చారిత్రక, సామాజిక అస్తిత్వాన్ని నిలుపుకోలేక కొట్టుమిట్టాడు తున్నాయి. బీజేపీ వ్యూహాన్ని నిలువరించడమే కాక, వైష్ణవం, లింగాయతిజం వంటి ప్రజాస్వామిక మత ధోరణులను పరిరక్షించుకోవాలంటే తెలుగు రాష్ట్రాల్లోని పాలక పార్టీలు కూడా కర్ణాటక మార్గాన్ని అనుసరించక తప్పదేమో!

తెలంగాణ సమాజంలో కుల వివక్షను ధిక్కరిస్తూ కుల సమానత్వాన్ని బోధించే రామానుజుని వైష్ణవ మతం సహా, శైవంతో పాటు స్థానిక ఆదివాసీ విశిష్ఠ మత సంప్రదాయాలన్నిటినీ వివిధ ప్రత్యేక మైనారిటీ మతాలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడమన్నది రాజకీయంగా ఒక ఎత్తుగడగానూ, సామాజికంగా న్యాయమైన డిమాండ్‌గానూ ఉంటుందని కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ డిమాండ్లను పాతకాలం నాటి శైవ, వైష్ణవ ఘర్షణల వంటి వైషమ్యాలుగా మార్చే అవకాశం లేకపోలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 'ఏకీకృత హిందూ అస్తిత్వానికి' వ్యతిరేకంగా వివిధ మత శాఖలు తమ ప్రత్యేక అస్తిత్వం కోసం చేస్తున్న పోరాటంగా దీన్ని స్థిరీకరించకపోతే సామాజిక వైపరీత్యాలు సంభవించే అవకాశమూ లేకపోలేదు. కర్ణాటక కేబినెట్ తీర్మానంలో కాంగ్రెస్ రాజకీయ మున్నప్పటికీ, సామాజికంగా పెద్ద ఉద్యమంగా ముందుకు రావడంలోని హేతుబద్ధతను గుర్తించవలసి ఉంటుంది. మితవాదాన్ని ఎదుర్కొనగల హేతవాద సిద్ధాంత భావజాలం బలమైన సామాజికాంశంగా లేని సందర్భంలో అంతకంటే తక్కువస్థాయి మితవాద ధోరణులు, ఒక సంస్కరణ వాద ఉద్యమ రూపంలో చారిత్రక పాత్ర నిర్వర్తించడం కద్దు.

◆ మాదిరాజు రాంబాబు

మార్పు కోసం మరో పోరు

'ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్తున్నా తిరిగి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే అడుగుపెడతా' పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టకముందు టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్న మాటలు ఇవి. ఈ దేశ సమకాలీన రాజకీయ చరిత్రలో ఇలాంటి సవాల్ విసిరి నెగ్గిన రాజకీయ నాయకుడు ఎవరూ లేరు ఒక్క కేసీఆర్ తప్ప. కేవలం రెండు లోక్‌సభ సీట్లున్న టీఆర్‌ఎస్ తెలంగాణ సాధిస్తుందా? అసలు కేసీఆర్‌తో తెలంగాణ రాష్ట్రం సాధ్యమవుతుందా? అన్న వాళ్లే కేసీఆర్ ఆత్మస్థయిర్యాన్ని చూసి ఆశ్చర్యపోయే పరిస్థితిని కేసీఆర్ కల్పించారు. తెలంగాణ రాష్ట్రం ఎలా వచ్చిందా అని కేసీఆర్ ప్రత్యర్థులు తేరుకోక ముందే కేసీఆర్ ఎన్నికలకు వెళ్లి ఒంటరిపోరులో విజయం సాధించి తెలంగాణ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

అరవైఏళ్ల అధికారం అనుభవించిన శక్తులు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా జీర్ణించుకోలేని పరిస్థితులలో కుట్రలు పన్ని కూల్చే ప్రయత్నాలలో ఉండగానే నాలుగేండ్ల ప్రజారంజక పాలనతో కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలబడ్డారు. తనను ఎదిరించే శక్తులు తనను చేరుకోలేని దుర్భేధ్యమైన దుర్గం మీదకు కేసీఆర్ చేరుకున్నారు. గత నాలుగేండ్ల పాలన లో కేసీఆర్ చేపట్టిన పథకాలు ఏవీ తాత్కాలికమైనవి కావు. కేవలం ఏదో వర్గానికో, ప్రాంతానికో సంబంధించినవి అసలే కావు. తెలంగాణలోని సకల జీవరాశికి తరాలపాటు అండగా నిలిచే పథకాలు కేసీఆర్ చేపట్టారు. ఈ ప్రయత్నంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆయన వెనకడుగు వేయడం లేదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం అనుకున్న శక్తులు కేసీఆర్ పథకాలను నిలువరిస్తేనే ప్రజలకు చేరువ కాగలుగుతాం, లేకుంటే దూరమవుతామని ఏకంగా ప్రాజెక్టులనే అడ్డుకునే అథమ స్థాయికి విపక్షాలు దిగజారాయంటే ప్రజల శ్రేయస్సు పట్ల, ప్రాంత అభివృద్ధి పట్ల వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే గత 14 ఏండ్లుగా ఉద్యమంలో నాలుగేండ్లుగా పాలనలో సమాజంలోని సకలజనుల సమస్యల పట్ల సమగ్ర అవగాహన ఉన్న కేసీఆర్ ఇప్పుడు దేశంలో ఉన్న ప్రజల సమస్యల పట్ల, గత 70 ఏండ్ల పాలకుల నిర్లక్ష్యం పట్ల, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్న తీరుపట్ల నిరసన ప్రకటించి శంఖారావం పూరించారు. సంకీర్ణ రాజకీయాలతో సతమతమవుతున్న మన దేశ రాజకీయాలలో 14 ఏండ్లు ఓ ప్రాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడి విజయం సాధించడం సాధారణ అంశం కాదు. ఇక ఆ పరిస్థితిని ఎదుర్కొని విజయవంతంగా నిలిచిన కేసీఆర్ దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు ప్రస్తుత తరహా రాజకీయాలు పరిష్కారం కావని ప్రకటించారు. కేసీఆర్ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు దేశ రాజకీయాలలో విస్తృత చర్చకు దారితీశాయి. 70 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇంకా ప్రజలకు తాగు, సాగునీళ్లకు తండ్లాడితే మరి ఇన్నాళ్లూ పాలకులు ఏం చేసినట్లు? వారి నుంచి ప్రజలకు ఏం మేలు జరిగినట్లు అని కేసీఆర్ ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన చట్టాలు రూపొందించి అమలు చేద్దామా? అవసరం లేని చట్టాలు జనం నెత్తిమీద రుద్దుదామా? అని కేసీఆర్ అడుగుతున్నారు.

'14 ఏండ్లు తెలంగాణ కోసం పోరాడాను. ఈ దేశ పౌరుడిగా ఈ దేశానికి సేవచేసే హక్కు నాకుంది. అవకాశం వస్తే దానిని కూడా సద్వినియోగం చేసుకుంటా' అని కేసీఆర్ ప్రకటించడం వెనక పెద్ద విశేషమే ఉంది. ఈ దేశంలో ఉన్న 29 రాష్ట్రాల మీద గత నాలుగేళ్లుగా కేంద్ర పెత్తనం మరింత పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ దేశంలోని ప్రజల అవసరాలు, అభ్యున్నతి కోసం పనిచేయడం మానేసి రాష్ట్రాల అధికారాలను లాక్కుని తమ ఆధిపత్యం ప్రదర్శించడానికి, దేశం అభివృద్ధి కోసం పథకాలు రచించడం మానేసి తాము తిరిగి అధికారంలోకి రావడానికి ఎలాంటి వ్యూహాలు అవలంభించాలి అన్న దిశగా ఆలోచించడం కేసీఆర్ లాంటి నేతకు రుచించి ఉండదు. ఎన్నికలప్పుడే రాజకీయాలు తిరిగి మళ్లీ ఎన్నికల వరకు ప్రజలు, అభివృద్ధి అని అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ ప్రకటించారు. ఎవ్వరూ వెయ్యేండ్లు బతకరు .. బతికినన్నాళ్లు మనం ప్రజల కోసం ఏం చేశామా? అన్నదే తరువాత తరంలో మన కీర్తిని బతికిస్తుందని కేసీఆర్ చెబుతుంటారు. ఆయన ఆలోచనలకు తగ్గట్లే తెలంగాణలో ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టుల నిర్మాణం, హరితహారం, భారీ ఎత్తున గురుకులాలు ఏర్పాటుచేసి సామాన్య ప్రజలకు విద్యను అందుబాటులోకి తీసుకోవాలనే పథకాలకు బీజం వేసి ఉంటాయి. అందుకే ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని విమర్శలు ఎదురైనా ఈ పథకాల అమలు విషయంలో ఎక్కడా వెనకడుగు వేయలేదు.

ఇక కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి మోదీ మీద దేశంలోని ప్రజలందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ సగటు మనుషుల విశ్వాసాన్ని మోదీ చూరగొనలేకపోయారు. కాంగ్రెస్ పాలనలో జరిగినట్లు తమ నాలుగేండ్ల పాలనలో ఎక్కడా ఎలాంటి అవినీతి జరగలేదని మోదీ చెబుతుంటారు. అయితే విజయ్ మాల్యా, లలిత్ మోదీ, నీరవ్ మోదీ వంటి పారిశ్రామికవేత్తలు దర్జాగా దేశం దాటిపోవడంతో మోదీ ప్రభుత్వం మీద నీలినీడలు కమ్ముకున్నాయి. నోట్లరద్దు, జీఎస్టీతో మోదీ మీద సామాన్యులకు ఉన్న విశ్వాసం పూర్తిగా పోయింది. కాంగ్రెస్ తప్పితే బీజేపీ, బీజేపీ తప్పితే కాంగ్రెస్‌గా ప్రజలకు ప్రత్యామ్నాయం లేకపోవడం, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తిరిగి తమ అధికారం కాపాడుకోవడానికి అధికారాన్ని ఉపయోగించుకోవడం తప్ప ప్రజలను, దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రకటించకపోవడం సర్వత్రా అసంతృప్తి కలిగించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి దిశగా అడుగులు వేసి దేశ ప్రజల్లో కొత్త విశ్వాసం రేకెత్తించేందుకు శ్రీకారం చుట్టి ఉంటారని భావిస్తున్నారు. పొరుగు దేశాల అభివృద్ధిని చూసి పొగిడి సంతృప్తి పడడం తప్ప ఈ దేశం ఇంకెప్పుడు అభివృద్ధి చెందుతుందన్న ఆలోచన ప్రతి భారత పౌరుడి మదిలో ఉంది. కానీ ఆ దిశగా నడిపిస్తారన్న నాయకులు తరచూ విఫలం అవుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ తన ఆలోచనను ప్రజల ముందు పెట్టి భారత రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అన్నీ కలిసివస్తే తెలంగాణ రాష్ట్రం సాధించిన మాదిరిగానే కేసీఆర్ దేశ రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకుంటారనడంలో ఎలాంటి సందేహం లేదు.

◆ సందీప్ రెడ్డి కొత్తపల్లి

'మార్క్సిజంలోకి వాట్సప్ తరం'




అంకాళ్ల పృథ్వీరాజ్ రాసిన 'మార్క్సిజం అజేయం' అనే వ్యాస సంపుటిని అర్థం చేసు కుంటే మనకు ఆశ్చర్య గొలిపే ఆనందం కలుగుతుంది. ముప్పై ఏళ్ళలోపు ఉండి మార్క్సిజం గురించి మాట్లాడే వాళ్ళ విరసం బయట రెండు తెలుగు రాష్ట్రాలలో ఎవరూ లేరని చెప్పవచ్చు. విరసంలో పృథ్వీ లాంటి కొందరున్నారు. అయతే మార్క్సిజం గురించి చదివే వాళ్ళు ఉన్నప్పటికీ దాని గురించి రాసే సాహసం చేయరు. కానీ పృథ్వీ చేసాడు. ఆయన మన ముందుకు తెస్తున్న ఈ పుస్తకం పదిహేడు వ్యాసాలు ఉన్నాయి. వాటిలో ఐదు వ్యాసాలు మార్క్సిజం మీద మరో నాలుగు తెలంగాణ మీద, ఇంకో నాలుగు వ్యక్తులతో ఉండిన జ్ఞాపకాల మీద రాసాడు. ఇంకా మతం, గోవధ, ఎఫ్‌డీఐ, వర్గ పరిశీలన మీద వ్యాసాలు ఉన్నాయి. ఒకే విషయం మీద ఎక్కువ వ్యాసాలున్నవి మార్క్సిజంపైనే. తన ప్రాపంచిక దృక్పథాన్ని వ్యక్తం చేసే వ్యాసాలతో ప్రారంభించాడు. వాటి పునాది మీదే ఇతర సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను విశ్లేషించారు. ఆయన పాటించిన ఈ క్రమం వలన పాఠకుడి చదవడం సులభమవుతంది. రచయిత పరిణామం కూడా తెలుస్తుంది. ఈ ఔచిత్యాన్ని పృథ్వీ పాటించాడు.

- డాక్టర్ సి. కాసిం
విరసం

ఐశ్వర్య నెలవులు నాటి హైదరాబాద్ బజార్లు

రంగుల్ని రాశి పోసినట్టుండే హైదరాబాద్ బజార్లు సాదాసీదా మనుషుల్నే కాదు, నాటి స్వాతంత్ర్య సమర యోధురాలు, కవి సరోజినీ నాయుడిని కూడా సమ్మోహపరిచాయి. ఆమె తన ప్రసిద్ధ కవిత 'ఇన్ ద బజార్స్ ఆఫ్ హైదరాబాద్' అనే కవితలో అలనాటి హైదరాబాద్ బజార్లలో కొలువు తీరిన కళ్ళు మిరుమిట్లు గొలిపే జరీ అంచుల వస్త్రాల్ని, నోరూరించే పండ్లని, స్వర్ణకారుల సృజనాత్మకతతో మెరిసే పోయే ఆభరణాల్ని తనదైన శైలిలో మన కళ్ళకు కట్టారు. హైదరాబాద్ బజార్లు కేవలం వస్తుసముదాయాల్ని అమ్మే కూడళ్ళు మాత్రమే కాదు, అవి తరతరాల దక్కను సంస్కృతీ వైభవానికి పెట్టని కోటలు. సరోజినీ నాయుడు తన కవితలో ఈ వైభవాన్నే అక్షరబద్ధం చేశారు.



హైదరాబాద్ బజార్లు

బేహారులారా, మీరేం అమ్ముతున్నారు,
రాశిపోసిన రంగుల్లాంటి మీ అంగట్లో సరుకుల్నా..,
కెంపుల తాపడంతో మెరుస్తున్న వెండి తలపాగాల్నా,
ఊదారంగు జరీ అంచుల దుస్తుల్నా,
బంగారు వన్నెల నగిషీలు చెక్కిన అద్దాల్నా,
పచ్చల పిడిబాకుల్నా...?
　మీరేం తూస్తున్నారు,
　కుంకుమపువ్వుల్నా, పప్పుధాన్యాల్నా, బియ్యాన్నా?
　నెచ్చెలులారా, మీరు ఏం నూరుతున్నారు,
　మంచిగంధాన్నా, గోరింటాకునా, అధరవుల్నా?
పాదచారులారా, మీకేం కావాలి,
చదరంగపు ఆటగాళ్ళా, లేక కేవలం పావులా?
　కంసాలులారా, మీరేం చేస్తున్నారు,
　కడియాలా, అందెలా, ఉంగరాలా,
　నీలిపావురాలకు కాలిగజ్జలా,
　నర్తకీమణులకు కాసెపోసిన బంగారు చీరెలా,
　రాజుల కోసం రత్నఖచిత కరవాలాలా?
పండ్ల వ్యాపారీ, కేకలు పెడుతూ ఏం అమ్ముతున్నావు,
నారింజలా, దానిమ్మలా, రేగుపళ్ళా?
వాద్యకారులారా, మీరేం వాయిస్తున్నారు,
సితారా, సారంగా, మృదంగమా?
ఇంద్రజాలికులారా, మీరేం పఠిస్తున్నారు,
కొత్త యుగాల్ని ఆహ్వానిస్తూ మంత్రాల్ని జపిస్తున్నారా?
　పుష్పలావికలారా, మీరేం అల్లుతున్నారు,
　నీలం, ఎరుపు రంగులతో కుచ్చులు కడుతున్నారా,
　పెళ్ళికుమారుల కోసం బాసికాల్ని పేనుతున్నారా,
　వారి పానుపుల కోసం పూలమాలికల్ని అల్లుతున్నారా,
　మృతుల శాశ్వత నిద్రకు గుబాళింపుల అత్తరును చల్లి
　తెల్లని వస్త్రాల్ని నేస్తున్నారా?

- భారత కోకిల సరోజినీ నాయుడు

కవిత




నడివీధి లోగిలి



మనుషులు గుంపులుగా కూడే చోటు, వాళ్ళు తమ మనసైన వస్తువుల్ని మనసైన వారికోసం కొనిపెట్టే చోటు, వాళ్ళు తమకు ఏం కావాలో దాన్ని కొనడానికి బేరాలు ఆడే చోటు, సరసమైన ధరలు గొంతెత్తి పాడే చోటు, అనుకోకుండా ఆత్మీయులు కలిసే చోటు, పిల్లలకు నేల మీదే చందమామను పీచు మిఠాయిగా చేసి నోటికందించే చోటు, గాజులు గలగలాడే చోటు, పండ్లు గుబాళించే చోటు, పువ్వులు సుగంధాల సెలయేళ్ళయ్యే చోటు, వారాంతంలో నెలకంతా అవసరమైన వెచ్చాల్ని, తాజా కాయగూరల్ని పంటపొలాల నుంచి నట్టింటికి వాయనమిచ్చే చోటు... సంత, బజారు, రైతుబజారు, మార్కెట్టు, అంతిమంగా షాపింగ్‌మాల్ ... పేరేదైనా కానివ్వండి..., మనం గుమ్మం దాటిన తరువాత ఆకాశం కింద అది మన అవసరాలన్నింటినీ తీర్చే మరో ఇల్లు. డబ్బుకే కాదు డబ్బు చుట్టూ తిరిగే బతుకు బండికీ అదే ఇరుసు. అది ఒక్క వ్యాపారానికి మాత్రమే కాదు, మానవ ఉద్వేగాలన్నింటికీ ఆటపట్టయిన నడివీధి లోగిలి. ఇవాళ 'మైత్రి' ఆ లోగిలిని మీ ముందుకు తెచ్చింది.

– మీ 'మైత్రి'

మండీల మండువా



విలక్షణమైన హైదరాబాద్ బజార్లు

స్థానికం

మొఘలులు, కాకతీయులు, అసఫ్‌జాహీలు, నిజాముల పరిపాలనలో నిండుగా వెలిగిన హైదరాబాద్ ఎన్నో విశేషాలకు, మరెన్నో విశిష్టతలకు నిలయం. వీధికో చరిత్ర, బజారుకో ప్రయోజనం... కట్టడం వెనుకో కారణం... ఇట్లా ప్రతి దానికీ ఒక ప్రత్యేకత, ఒక ప్రయోజనం కలిగి ఉన్న నగరం ప్రపంచంలో ఇదొక్కటే అంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ మహమ్మద్ కులీ కుతుబ్ షా 'భగవాన్... సముద్రంలో చేపల వలె నా నగరాన్ని జనంతో నింపు...' అని ప్రార్థించాడట. దేవుడు తన మొర ఆలకిస్తాడనే ఆయనకు మెండైన నమ్మకమున్నందునే.../ అందుకని ఆ ప్రజలకు కావలసిన సరుకుల కోసం ప్రత్యేక బజార్లను కూడా ఏర్పాటు చేశారు. కూరగాయల కోసం మీరాలం మండి, మోండా మార్కెట్, కిరాణా వస్తువుల కోసం బేగంబజార్, పూలు, పండ్ల కోసం మోజాం జాహి మార్కెట్... ఇట్లా నిత్యావసరాల బజార్లే కాకుండా, కాగితం కోసం ఛత్తా బజార్, కోవా కోసం బేలా, ముత్యాలు, పగడాల కోసం మచిలీ కమాన్ బజార్... వంటి వివిధావసరాలను తీర్చే మరెన్నో మండీలు ఏర్పాటు చేశాడు. ఇట్లాంటివే జుమ్మేరాత్ బజార్, కబుత్తర్ ఖానా, చుడీబజార్‌లు.



సామాన్యుడి సూపర్ మార్కెట్ జుమ్మేరాత్ బజార్

దమ్మూ ధైర్యముంటేనే ఇక్కడ కొనాలి...

హైదరాబాద్ రాష్ట్రంలో 'కామన్ మ్యాన్'కు ఏ వస్తువు అవసరమొచ్చినా జుమ్మేరాత్ బజార్‌కు ఉరికేవాడు. అక్కడ దొరకని వస్తువంటూ ఉండదు. పిన్నీసు నుంచీ పగడాల దాకా, చాయ్‌కప్పు నుంచి చార్మినార్ దాకా, అక్కడ అన్నీ అగ్గువగా దొరుకుతాయి. సైకిళ్ల, స్కూటర్లు, సెల్ ఫోన్లు, టీవీలు, చెప్పులు, చెవి రింగులు, దుస్తులు... ఏవైనా..., ఎక్కడివైనా..., పాతవైనా..., కొత్తవైనా... ఇక్కడ కొనుక్కోవచ్చు. మనకున్న బడ్జెట్‌లోనే అవసరమైన వస్తువు దొరుకుతూండడంతో దీనికున్న ఆదరణ అంతాఇంతా కాదు. ప్రతీ గురువారం (జుమెరాత్)నాడు ఏర్పాటవుతున్నందున దీనికి 'జుమ్మేరాత్ బజార్' అని పేరు. ఆరోజు తెల్లవారుఝాము 4 గంటల నుంచీ ఉదయం 8 గంటల వరకు మాత్రమే ఇది ఉంటుంది. అంటే దొంగిలించినవి తెచ్చి ఇక్కడమ్ముతారని ఒక ప్రచారమున్నందున కొందరు దీన్ని 'చోర్‌బజార్' అని కూడా అంటారు.

నిజాము, వారి కుటుంబీకులు వాడేసిన వస్తువులను బేగంబజార్ సమీపంలోని ముస్లింజంగ్ పూల్ వద్ద ప్రతీ గురువారం అమ్మకానికి పెట్టేవారు. అది క్రమంగా ఇతర కులీన కుటుంబాలు వినియోగించిన వాటిని అమ్మే చోటుగా పరిణమించింది. అక్కడాఇక్కడా దొరికినవీ, దొంగిలించినవీ కూడా అమ్ముతూండవచ్చు. ప్రస్తుతం ఇక్కడ ఆరోజు దాదాపు 500 మంది అమ్మకందార్లు తమ వస్తువులను రోడ్డుపైనే ప్రదర్శనగా ఏర్పాటు చేస్తారు. నచ్చింది మెచ్చిన ధరకు కోషిశ్ చేసి తీసుకోవచ్చు. కంటితో చూసి కరెక్టు అనుకుంటేనే తీసుకోవాలి. రసీదులు, గిసీదులు, గ్యారంటీలు, వారంటీలు ఏమీ ఉండవు. ఎవరు కొన్నదానికి వారే అమానత్, జమానత్. సరుకు పనిచేసినా, పని చేయక పోయినా కోయీ జిమ్మెదార్ భీ నహీ. దమ్మూ... ధైర్యం... ఉంటే... కొను... లేకపోతే లేదు... నో ఒన్ ఈజ్ రెస్పాన్స్... దటీజ్ ద స్పెషాలిటీ ఆఫ్ జుమ్మేరాత్ బజార్!

పక్షుల అంగడి... కబూతర్ ఖానా...

హైదరాబాదీలు ప్రకతి ప్రేమికులే కాదు, పక్షి ప్రేమికులు కూడా! విశ్వాసాలకు, వినోదాలకు కూడా వీరు ప్రాధాన్యతనిస్తారు. అలవాట్లను పాటిస్తారు. అభిరుచులకు విలువనిస్తారు. ఇలాంటి వీరి జీవన శైలికి నిదర్శనంగా ఎన్నో సజీవ విషయాలు చూడొచ్చు. చార్మినార్‌కు సమీపంలోని హుస్సేనీఆలంలో ఉండే కబూతర్ ఖానా ఇటువంటిదే. సుమారు 200 ఏండ్ల నుంచీ ఇది పక్షి కేంద్రంగా విలసిల్లుతోంది. కులీకుతుబ్ షా కుటుంబానికి చెందిన సిద్దీ ఇబ్రహీం అను 'జంతు ప్రేమికుడు' 135 పక్షి గూళ్లను ఏర్పాటు చేసే ఒక నిర్మాణం చేయించాడు. వీటిలో 800 వందలకు పైగా పక్షలు ఇక్కడ ఉండొచ్చు. వీటికి ఆహారం కూడా సమకూర్చే వారాయన. ఇప్పుడు కూడా వీరి కుటుంబీకులే వాటి తిండీతిప్పలు చూస్తున్నారు. దానితో ఎక్కడెక్కడి నుంచో రకరకాల పక్షలు ఇక్కడికొచ్చి ఉండిపోయేవి. ఆ విధంగా ఇది ఒక పక్షుల కేంద్రంగా వృద్ధి చెందింది. దీన్ని చూడటానికి వివిధ ప్రాంతాల ప్రజలు వస్తూపోతూంటారు. అంతేకాదు పక్షలకు పెడితే ఆత్మశుద్ధికి ఉపకరిస్తుందనీ, భగవంతుడికి ఇష్టమనీ ప్రజలు నమ్ముతారు. ఇటువంటి వారు తమకు తోచింది ఇచ్చిపోతారు. ఆ విధంగా ఇదొక సందర్శనాస్థలంగానూ మారింది. వచ్చిన వారు తాము ఒకటో రెండో పక్షులను ఇంటికి తీసుకు పోవాలనుకుంటారు. ఇలాంటి వారి కోసమే ఇక్కడ పక్షులకు సంబంధించి ఒక బజార్ కూడా ఏర్పాటైంది. కబూతర్ ఖానా సమీపంలోని మెహబూబ్ చౌక్ అంతర్రాష్ట్రీయ పక్షుల మండీగా విస్తరించింది. ప్రస్తుతం ఇక్కడ 50కి పైగా పక్షి దుకాణాలున్నాయి. రకరకాల పక్షులు 50 రూపాయిలు మొదలుకొని 20 వేల రూపాయిల దాకా





విలువ పలికేవి ఇక్కడ లభిస్తాయి. దేశవ్యాప్తంగా ఎందరో వచ్చి ఇక్కడ బేరం చేస్తూంటారు. కబూతర్ ఖానా పక్షుల అమ్మకం కేంద్రంగానే కాదు, పక్షుల ఆట కేంద్రంగానూ మారింది. పావురాల రేస్ టుగుడి, టుంబ్లర్ రేస్‌లు వంటి క్రీడోత్సవాల స్థలంగానూ మారింది. ఇటీవల నగరంలో టుగుడి క్లబ్బులు విస్తరిస్తూ సరికొత్త క్రీడావినోదాలను పంచుతున్నాయి. ఈ విధంగా పక్షుల రక్షణ కోసం ఏర్పాటైన కబూతర్ ఖానా ప్రస్తుతం వినోదాలను కూడా పంచుతోంది. వేలాది మందికి ఉపాధినీ కల్పిస్తోంది.

కూరగాయలకు కేరాఫ్ మోండా మార్కెట్...





తెలంగాణలోనే దాదాపు అతిపెద్ద కూరగాయల మార్కెట్ సికిందరాబాద్‌లో ఉంది. రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ బజార్‌లో కూరగాయలతో పాటు కిరాణా, ప్రొవిజనల్ సరుకుల షాపులూ ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న బ్రిటిషు అధికారుల సౌకర్యార్థం ప్రస్తుత రాణిగంజ్ ప్రాంతంలో విక్టోరియా రాణి పేరిట 1888 జనవరిలో 'విక్టోరియా గ్రెయిన్ మార్కెట్'ను నిజాం రాజు ఏర్పాటు చేశారు. క్రమంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మార్కెట్ విస్తరణకు అవకాశం లేకపోవడంతో 1936లో ఏడో నిజాం కాలంలో నాలుగు ఎకరాల స్థలంలో దీన్ని నిర్మించారు. దీన్నే హిస్సాంగంజ్ మోండా మార్కెట్ అనీ, హిస్సాంగంజ్ అనీ స్థానికులు వ్యవహరిస్తారు. అల్వాల్, కంటోన్మెంట్, సికింద్రాబాద్, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల వారు దశాబ్దం క్రితం వరకూ కూరగాయల కోసం మోండాకే వెళ్లేవారు. రైతు బజార్లు, ఇటీవలి కాలంలో వీధి బజార్లు ఏర్పడినా కూడా మోండా మార్కెట్ గిరాకీ మాత్రం తగ్గలేదని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. అంటే ఈ కూరగాయల బజార్ జంటనగర వాసుల జీవనాన్ని ఎంతగా అల్లుకుపోయిందో తెలుసుకోవచ్చు.

- నేలంటి మదనయ్య

మొట్టమొదటి షాపింగ్‌మాల్

తొలి అడుగు

బిగ్ బజార్, ఇన్‌ఆర్బిట్‌మాల్, షాపర్స్‌స్టాప్... అబ్బో, ఒకటేమిటి ఇలాంటి ఎన్నెన్నో జాతీయ, అంతర్జాతీయ షాపింగ్‌మాల్స్ గురించి మనకందరికీ తెలిసిందే. వీటన్నింటికీ మాతృక సాధారణ బజార్లే అంటే అతిశయోక్తి కాదు. బహుళ అంతస్తుల భవంతుల్లో, ధగధగాయమానమైన కాంతులతో, వినియోగదారుడి బలహీనతల్ని రెచ్చగొట్టి మరీ డబ్బును కొల్లగొట్టే షాపింగ్ మాల్స్ ఇవాల్టి ఆధునిక నగర జీవి పాలిట వరంలా కనిపించే శాపాలు. ఏ సెలవురోజునో నలుగురు కలిసి, అతిథుల్ని ఇళ్ళకు ఆహ్వానించి, మంచీ చెడూ మాట్లాడుకుని, నవ్వుల్ని పంచుకుని, బాధల్ని మరచిపోయే రోజులు పోయాయి. బిజీ బిజీ జీవితంలో షాపింగ్‌మాల్సే నగర జీవుల పాలిట స్వర్గాలుగా మారాయి. కాసింత సేద తీరడానికి జేబు చిల్లుపడక తప్పని అసహజ వినోదకేంద్రాలు ఈ షాపింగ్ మాల్స్. చిన్న దుకాణదారుల నోట్లో మట్టికొట్టి, మధ్యతరగతి మనిషి ఆశలతో, ఆకాంక్షలతో చెలగాటమాడుతున్న షాపింగ్‌మాల్స్ ఎలా ప్రారంభమయ్యాయి? ప్రపంచంలో మొదటి షాపింగ్‌మాల్ ఎక్కడ మొదలైంది? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకుందాం.


ప్రపంచంలో పూర్తిస్థాయి హంగులతో ప్రారంభమైన మొట్టమొదటి షాపింగ్ మాల్ పేరు 'సౌత్‌డేల్ సెంటర్'. ఇది అమెరికాలో మొట్టమొదటి అత్యాధునిక షాపింగ్ మాల్. అంటే ఇది ఇప్పటి మన ఇనార్బిట్ మాల్, బిగ్‌బజార్లకు అమ్మమ్మ వంటిదన్న మాట. అమెరికాలోని ఎడినా, మిన్నెసోటా శివార్లలో దాదాపు 1,300,00 చదరపు అడుగుల విస్తీర్ణంలో పూర్తిస్థాయి ఎయిర్ కండీషన్డ్ షాపింగ్ మాల్ ఈ సౌత్‌డేల్ సెంటర్. ఇందులో 123 దుకాణాలు ఉన్నాయి. సైమన్ ప్రాపర్టీ గ్రూప్ అనే సంస్థ ఈ షాపింగ్‌మాల్‌కు పాక్షిక యాజమాన్య బాధ్యతల్ని నిర్వహిస్తోంటది. దీనిని 1956లో నెలకొల్పారు. అమెరికాలో కార్ల హవా ఊపందుకున్న తొలిరోజులవి. అందుకే వినియోగదారులు తమ కార్లని సౌకర్యవంతంగా పార్క్ చేసుకునే విధంగా ఈ షాపింగ్‌మాల్ భవనాన్ని విక్టర్ గ్రూయెన్ అనే ఆర్కిటెక్ట్ రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు నిరాఘాటంగా ఈ మాల్ అమెరికా ప్రజలకు సేవలందివ్వడమే కాకుండా, ఎప్పటికప్పుడు తన రూపురేఖల్లో కూడా అధునాతన మార్పుల్ని చేసుకుంటూ వారి మన్ననల్ని పొందుతూ, మిన్నెసోటా అంతటా తన బ్రాంచ్‌లను నడుపుతూ వచ్చింది. కానీ ఇటీవలి కాలంలో ఈ షాపింగ్‌మాల్ యాజమాన్యం వీటిలో కొన్నింటిని మూసి వేయడానికి నిర్ణయించుకుంది. అలా మూసి వేయాలని నిర్ణయించుకున్న మాల్స్‌లో సౌత్‌డేల్ షాపింగ్‌మాల్ కూడా ఉంది. దీంతో దీనిని 31, జులై, 2017న మూసివేశారు. దీని స్థానే 'లైఫ్ టైమ్ ఫిట్‌నెస్' అనే హెల్త్‌క్లబ్‌తోపాటు, మరికొన్ని ప్రైవేటు వాణిజ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి.





రాజులు నడిచిన దారి

చరిత్ర



తుంగభద్ర నదీతీరాన విజయనగర సామ్రాజ్య వైభవానికి ప్రతీకగా నేటికీ జనబాహుళ్యానికి కన్నుల పండుగ చేస్తున్న హంపి గురించి మనకందరికీ తెలిసిందే. ప్రపంచ వారసత్వ సంపదగా ఐక్యరాజ్య సమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ గుర్తించిన హంపికి తలమానికం హంపి బజారు. పద్నాలుగవ శతాబ్దానికి చెందిన హంపి కర్ణాటకలోని బళ్ళారి దగ్గర ఉంది. విజయనగర రాజుల రాజధానిగా విలసిల్లిన హంపి వర్తక, వాణిజ్యాలకు పెట్టింది పేరు. మధ్యయుగాలకు చెందిన అతిపెద్ద నగరాల్లో హంపి రెండవది. మొదటిది బీజింగ్. ఇక్కడి విరూపాక్ష దేవాలయం ప్రశస్తమైంది. 'హంపి బజారు' ఆసక్తికరమైన చరిత్ర కలిగిన ప్రాంతం. ఇది విరూపాక్ష దేవాలయానికి ఎదురుగా ఉంటుంది. ఒక కిలోమీటరు దూరం విస్తరించి ఉంటుంది. అలనాడు రాజులు, రాజబంధువులు ఈ వీధిలో తిరిగి, తమకు నచ్చిన ఆభరణాల్ని, ఆయుధాల్ని కొనుగోలు చేసేవారట. రాజులు నడిచిన బాటలోనే ఇప్పుడు సాధారణ ప్రజలు అలనాటి బజారు జ్ఞాపకాల్ని స్పృశిస్తూ, నేటి ఆధునిక బజారులో తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేస్తూ, గతాన్ని, వర్తమానాన్ని ముడివేస్తుంటారు. దీన్ని 'విరూపాక్ష బజారు' అని కూడా అంటూ ఉంటారు. వీధికి ఇరువైపుల అలనాటి మంటపాలు ఇంకా నిటారుగా నిలబడే ఉన్నాయి. ఒకనాడు పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, రత్నాలకు ఆలవాలమైన హంపి బజారు ఇవాళ సాధారణ వస్తువుల్ని అమ్మే కూడలిగా మారింది. బట్టలు, మట్టితో చేసిన కళాకృతులు, బొమ్మలు, రంగురంగుల బ్యాగులు ఈ బజారులో లభిస్తున్నాయి. ఏటా నవంబరులో జరిగే హంపి ఉత్సవాలకు ఈ హంపి బజారే కేంద్రంగా మారుతుంది.

అన్నా నిరవధిక దీక్ష ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన దీక్ష చేసిన విషయం తెలిసిందే. సరిగ్గా 2011 నాటి దీక్షా వేదిక వద్దే ఇప్పుడు కూడా ఆయన నిరాహార దీక్ష మొదలుపెట్టారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటుచేయాలంటూ హజారే ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. దాంతోపాటు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయాలని కోరుతున్నారు. అన్నా దీక్ష కారణంగా రామ్‌లీలా మైదాన్ వైపు లక్షలాది మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున అటువైపు వెళ్లద్దని ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు. ముఖ్యంగా అరుణా అసఫ్ అలీ రోడ్డు, ఢిల్లీ గేటు, దర్యాగంజ్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, అజ్మీరీగేట్, పహర్‌గంజ్, ఐటీఓ, రాజ్‌ఘాట్, మింటో రోడ్, వివేకానంద మార్గ్, జేఎల్ఎన్ మార్గ్ వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు.

445 కోట్లు హాంఫట్!

(మొదటిపేజీ తరువాయి)

కేసు నమోదుచేసింది. కిసాన్ క్రెడిట్ కార్డుల సాయంతోను, చేపల చెరువులకు సంబంధించి నకిలీ పత్రాలు, అధిక విలువ చూపించిన కొల్లేటరల్ సెక్యూరిటీలతో రుణాలు తీసుకుని మోసం చేసినట్లు సీబీఐ తన అభియోగాలలో పేర్కొంది. 21 గ్రూపులకు చెందిన మొత్తం 220 మంది రుణ గ్రహీతలు ఐడీబీఐ బ్యాంకు బషీర్‌బాగ్ బ్రాంచిలో పనిచేసి రామారావుతో పాటు ఇటీవలే పదవీ విరమణ చేసిన చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.దామోదరన్, బ్యాంకు ప్యానల్ వాల్యూయర్స్‌తో కుమ్మక్కై ఈ స్కాంకు పాల్పడినట్లు తెలిసింది. 2009-10, 2010-11, 2011-12 ఆర్థిక సంవత్సరాలలో మొత్తం 220 లోన్ అకౌంట్ల ద్వారా ఈ మొత్తాన్ని తీసుకున్నారు. నకిలీ పత్రాలతో వాళ్లు మొత్తం రూ.192.98 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ ఖాతాలన్నింటినీ వివిధ తేదీలతో నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు)గా ప్రకటించారు. 2017 సెప్టెంబరు 30 నాటికి మొత్తం 220 మంది రుణగ్రహీతల అప్పులు వడ్డీలతో కలిపి రూ.445.32 కోట్లకు చేరుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారు ఈ రుణాలు తీసుకున్నవారిలో ఉన్నారు. ఈ రుణాలను వారు వేరే ఉపయోగాలకు వాడుకోవడం లేదా తమ సొంత సేవింగ్స్ ఖాతాలకు మళ్లించడం చేసినట్లు విచారణలో తేలింది. కొన్ని జిల్లాల్లో రుణ దరఖాస్తు ఫారాల్లో చూపించిన సర్వే నంబర్లలో ఉన్న భూమిలో వారు పేర్కొన్నట్లుగా చేపల చెరువులు లేవు. సీబీఐ ఎఫ్ఐఆర్‌లో రామారావుతో పాటు.. ముప్పిడి లక్ష్మణరావు (ఆదిలక్ష్మి ఎగ్రిగేటర్ గ్రూపు), సమయమంతుల సుధాకర్ (ఎస్ సుధాకర్ గ్రూపు), నడింపల్లి వెంకట సుబ్బరాజు (ఎన్వీ సుబ్బరాజు గ్రూపు), నడింపల్లి రామరాజు, కేఎస్వీ ప్రసాదరాజు, తోరం చిన్న వెంకటేశ్వరరావు, పాతూరి సునీల్ చౌదరి, బెల్లాల చంద్రశేఖర్ రెడ్డి తదితరులతో పాటు బ్యాంకు ప్యానల్ వాల్యూయర్లు ఏడుగురిపై కూడా నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, నేరపూరిత దుష్ప్రవర్తన కింద కేసులు నమోదు చేశారు.

మా అమ్మను ఇంటికి రప్పించరూ..

సుష్మాస్వరాజ్‌కు హైదరాబాద్ అమ్మాయి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, మార్చి23:

తన తల్లిని సురక్షితంగా ఇంటికి రప్పించేందుకు సాయం చేయాలంటూ ఓ అమ్మాయి విదేశాంగ మంత్రి సుష్మ స్వరాజ్‌కు విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌కు చెందిన సింధు చెబుతున్న వివరాల ప్రకారం.. తన తల్లి పనిచేస్తున్న సంస్థ యజమాని ఆమెను దుబయ్ నుంచి మస్కట్‌కు అక్రమంగా తరలించాడు. సుష్మకు చేసిన విజ్ఞప్తిలో తన తల్లిని మస్కట్‌లోని యజమాని వేధించేవాడని సింధు పేర్కొంది. సుష్మ స్వరాజ్, భారతీయ రాయబార కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం తన తల్లిని కాపాడేందుకు చొరవ చూపి సురక్షితంగా ఇంటికి చేర్చాలని సింధు వేడుకుంటోంది.

పాస్‌పోర్ట్ లేదు

''యజమాని పెట్టే హింసను తట్టుకోలేక హోటల్ నుంచి తప్పించుకుని మా అమ్మ మస్కట్‌లోని ఓ చర్చ్‌కు పారిపోయింది.. జనవరి 4వ తేదీన అక్కడి భారతీయ రాయబార కార్యాలయానికి ఎలాగోలా చేరుకుంది.. కానీ పాస్‌పోర్ట్ యజమాని వద్దే ఉండడంతో ఆమె అక్కడినుంచి తిరిగి ఇంటికి రాలేక పోతోంది'' అంటూ సింధూ మీడియాకు వివరించింది. గత సంవత్సరం తన తల్లి వద్దకు వచ్చిన ఓ ఏజెంట్ దుబాయ్‌లో సేల్స్ గర్ల్ ఉద్యోగం ఆఫర్ చేయగా.. ఆమె అక్టోబర్ 11న దుబయ్‌కు వెళ్లి నెల రోజుల పాటు అక్కడే ఉన్నట్టు సింధు వెల్లడించింది. కాగా విదేశాంగ శాఖా మంత్రిగా పదవి చేపట్టిననాటి నుంచి సుష్మ స్వరాజ్ విదేశాల్లో చిక్కుకున్న భారతీయులకు ఆపన్నహస్తం అందిస్తూ, వారిని తక్షణం కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు. జనవరిలో కూడా హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ సౌదీలో చిక్కుకుపోగా సుష్మ చొరవతో ఆమె సురక్షితంగా ఇంటికి చేరుకుంది.

ఎన్నికల హామీలపై పీసీసీ కమిటీ




హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి):

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇవ్వాల్సిన రెండు ముఖ్యమైన హామీలపై సూచనలు ఇచ్చేందుకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక కమిటీ నియమించారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో 42 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పలు జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు సభ్యులుగా ఉన్నారు. ప్రధానంగా పెన్షన్లు, గృహ నిర్మాణం విషయంలో ప్రస్తుతం ఉన్న పథకాలను అధ్యయనం చేసి, వచ్చే ఎన్నికల్లో ఈ పథకాల విషయంలో ఎలాంటి హామీ ఇవ్వాలన్న దానిపై ఈ కమిటీ ఏప్రిల్ మొదటి వారంలో ఉత్తమ్ కుమార్ రెడ్డికి నివేదిక ఇవ్వనుంది. ఈ కమిటీ మొదటి సమావేశం శుక్రవారం గాంధీభవన్‌లో జరిగింది.

చాదర్‌ను సమర్పించిన లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి):

ఖాజా మొయినుద్దీన్ చిస్తీ ఉర్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాజా మొయినుద్దీన్ చిస్తీ ఉర్సును ముస్లిం సోదరులు ఎంతో ముఖ్యమైందిగా భావించి ప్రతి ఏటా చాదర్‌ను సమర్పిస్తుంటారని, తన చేతుల మీదుగా ముస్లిం సోదరులకు ఈ చాదర్‌ను సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందని లక్ష్మణ్ అన్నారు. మైనారిటీ మోర్చా అధ్యక్షుడు హనీఫ్ అలీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.



అసెంబ్లీ కమిటీ హాల్ నంబర్1 లో రాజ్యసభ ఎన్నికల ఓటింగ్

మూడూ గులాబికే

(మొదటిపేజీ తరువాయి)

ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్ కుమార్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ ఓటమి చవి చూశారు. శాసన సభలో మొత్తం 119 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులపై అనర్హత వేటు పడటంతో ఈ సంఖ్య 117కు చేరింది. వీరిలో 108 మంది ఎమ్మెల్యేలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ(5), సీపీఎం (1), టీడీపీ (2) ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని పేర్కొన్న రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో పాల్గొనలేదు. మొత్తంగా 9 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. టీఆర్ఎస్ తరపున 90 మంది, ఎంఐఎం తరపున ఏడుగురు, కాంగ్రెస్ తరపున 11 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే కాంగ్రెస్‌కు పరోక్షంగా మద్దతునిస్తున్న దొంతి మాధవరెడ్డి ఓటు చెల్లలేదు. ఆయన కాంగ్రెస్ ఏజెంట్‌కు చూపించి ఓటు వేశారని రిటర్నింగ్ అధికారి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో మాధవరెడ్డి ఓటును పరిగణనలోకి తీసుకోకూడదని ఈసీ నిర్ణయిం చింది. అయితే ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరి ఓటు వేసిన ఏడుగురు ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. టీఆర్ఎస్ అభ్యర్థులు బండ ప్రకాశ్‌కు 33, బడుగుల లింగయ్య యాదవ్‌కు 32, జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు 32 ఓట్లు వచ్చాయి. బలరాంనాయక్‌కు 10 ఓట్లు వచ్చాయి. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కమిటీ హాల్ నంబర్ 1లో ఓటింగ్ ప్రారంభమవగా.. తొలి ఓటు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ వినియోగించుకున్నారు. అనంతరం మహేందర్‌రెడ్డి, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మధ్యలో సీఎం కేసీఆర్ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. చివరగా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఓటు వేశారు. సాయంత్రం 5గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కాగా, రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించడంతో రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు నిర్వహించుకున్నాయి.

ఎవరికి ఎన్నెన్ని ఓట్లు..

బండ ప్రకాశ్	33
బడుగుల లింగయ్య యాదవ్	32
జోగినపల్లి సంతోష్ కుమార్	32
బలరాం నాయక్	10

ఆ ఎమ్మెల్యేలు విప్ ధిక్కరించారు

వారంతా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు

టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఫిర్యాదు

సీఎం కేసీఆర్‌వి నీచ రాజకీయాలు: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 23 (మనం ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికైన ఏడుగురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులకు ఓటేశారని, వారు విప్ ఉల్లంఘనకు పాల్పడి క్రాస్ ఓటింగ్ వేశారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన కాలే యాదయ్య, ఎన్ భాస్కరరావు, రెడ్యానాయక్, కోరం కనకయ్య, పువ్వాడ అజయ్ కుమార్, విఠల్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని అన్నారు. కానీ సాంకేతికంగా వారు కాంగ్రెస్ సభ్యులేనని, విప్ దిక్కరించినందున వారి ఓట్లను పరిగణనలోకి తీసుకోవద్దంటూ రిటర్నింగ్ అధికారికి, ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. ఎలక్షన్ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. పార్టీ ఫిరాయింపుదారుల ఓట్లతో రాజ్యసభ అభ్యర్థి గెలుపొందితే, సదరు అభ్యర్థి విజయాన్ని పరిగణనలోకి తీసుకోరని, ఈ విషయంపై గతంలో సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఇచ్చాయన్నారు. రాజ్యసభ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న నర్సింహచార్యులకు ఫిర్యాదు అందజేశామన్నారు. ఫిర్యాదుకు సంబంధించి అక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలని అడిగితే, ఇవ్వకుండా రాజ్యసభ అభ్యర్థి బలరాం నాయక్‌ను అగౌరవపరిచారన్నారు. తెలంగాణలో రాజకీయాలను అతినీచమైన స్థాయికి దిగజార్చిన ఖ్యాతి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

పేదవర్గాలన్నీ రుణపడి ఉంటయ్

ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు

గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళి

ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఆశీస్సులు

సహకరించిన ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు

ఎంపీలు బడుగుల, బండా, జోగినపల్లి





హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి):

రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించిన టీఆర్ఎస్ అభ్యర్థులు సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాష్‌లు గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ప్రగతిభవన్‌కు చేరుకుని సీఎం కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. అంతకుముందు టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడంతో గన్‌పార్క్ వద్ద టీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు బతుకమ్మ ఆడి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా.. 'నా 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ బడుగు బలహీన వర్గాలకు టికెట్ ఇచ్చిన పార్టీ లేదు' అని బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. రాజ్యసభ ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు బండా ప్రకాశ్, జోగినపల్లి సంతోష్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పేద వర్గాలన్నీ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాయన్నారు. బండా ప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని దేశం మొత్తం చూస్తోందన్నారు. గొర్రెలు, చేపలు పంపిణీ చేయడమే కాకుండా రాజకీయ జీవితాన్ని సీఎం కేసీఆర్ కల్పించారని చెప్పారు. జోగినపల్లి సంతోష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటానని, తన పనిని పూర్తి బాధ్యతతో నిర్వహిస్తానన్నారు. తన గెలుపునకు సహకరించిన ఎమ్మెల్యేలందరికీ కృతజ్ఞతలని తెలిపారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన అభ్యర్థులకు అభినం దనలు తెలుపుతూ స్వీట్లు పంచుకున్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి కేసీఆర్: ఈటల

రాజ్యసభ ఎన్నికల ఫలితాల అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఈటల రాజేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఎన్నడూ ఏది ఆశించకుండా ముదిరాజ్‌లకు రాజ్యసభ అవకాశం కల్పించారన్నారు. ఉద్యమంలో తెర వెనుక ఉండి పోరాడిన సంతోష్‌కుమార్‌ను రాజ్యసభకు పంపడం హర్షణీయమని తెలిపారు.


కాంగ్రెస్‌ది దివాళాకోరుతనం: మంత్రి జగదీశ్‌రెడ్డి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఓడిపోతామని తెలిసి కూడా తెలివితక్కువగా కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టిందన్నారు. కాంగ్రెస్ దివాళాకోరుతనం ఈ ఎన్నికలతో బయటపడిందని, కాంగ్రెస్ నాయకత్వలేమి స్పష్టంగా తెలుస్తోందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ ఇదే రిపీట్ అవుతుందని, ఇకనైనా మంచి నాయకుడిని ఎన్నుకుని క్రమశిక్షణగా ఉంటే పదేండ్ల తర్వాతైనా ఒకట్రెండు సీట్లొస్తాయని ఎద్దేవా చేశారు.

గిరిజనుడిని అవమానించేందుకే: నాయిని

రాష్ట్ర హోంమంత్రి నాయిని మాట్లాడుతూ ఏలాగూ ఓడిపోతామని తెలిసి ఓ గిరిజనుడిని అవమానించేందుకు రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు పోటీకి నిలబెట్టారన్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి అడ్డుపడాలన్న ఉద్దేశం తప్ప మరొకటి లేదని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ అబాసుపాలైందని, వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌తోనే కాంగ్రెస్ చరిత్ర ముగుస్తుందని చెప్పారు. నిర్మాణాత్మక ప్రతిపక్షం ఉండాలని, ప్రజలు అమాయకులు కాదని, చైతన్యం వచ్చిందన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని హితవు పలికారు.

రైతు ఆత్మహత్యలు చాలా తగ్గాయ్



(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్థిక పద్దుల ఆమోదం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాలైన కర్నాటక, మహారాష్ట్రలలో రైతుల ఆత్మహత్యల సంఖ్య పెరిగిందని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గిన విషయాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్‌లో పేర్కొన్నారని తెలిపారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు 53శాతం తగ్గగా.. కర్నాటకలో 32 శాతం, మహారాష్ట్రలో 145 శాతం మేర పెరిగాయని మంత్రి చెప్పారు. తెలంగాణలో కోటి ఎకరాల మాగాణి ఏర్పాటు చేయడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అరవై ఏండ్లలో కాంగ్రెస్ పాలకులు 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరందించారని చెప్పారు. ఈ లెక్కలలోనూ కొంత అవకతవకలు ఉన్నాయని తెలిపారు. అయితే, కేవలం నాలుగేండ్ల పాలనలో టీఆర్ఎస్ సర్కారు 21 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిం చిందని మంత్రి హరీశ్‌రావు వివరించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నేతలు కావాలనే కుట్రపూరితంగా ప్రాజెక్టులపై కోర్టుల్లో కేసులో వేస్తూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలి పారు. నాలుగు దశల్లో 27,713 చెరువులకు గానూ రూ.8,625కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే 16,606 చెరువులలో పనులు పూర్తయ్యాయని చెప్పారు. సీతారామ, డిండి, పాలమూరు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల పనులను వేగంగా చేపడుతున్నామని తెలిపారు. ఇందుకుగానూ అవసరమైన ఇంజనీర్లను నియమిస్తు న్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయం లో సాగునీటి శాఖ అంటే అవినీతిశాఖ అనే పేరొందిం దన్నారు. తమ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తుందని వివరిం చారు. దుమ్ముగూడెం నుంచి ఎస్సారెస్పీ వరకు 274 కిలో మీటర్ల మేర గోదావరి నది సజీవంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల ముందు కాంగ్రెస్‌ను ముద్దాయిగా నిలబెడతామన్నారు. ప్రాజెక్టుల విషయంలో అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ బండారాన్ని బయటపెడ్తా మన్నారు. ప్రతి నియోజకవర్గంలో మిని ట్యాంక్‌బండ్‌ల ఏర్పాటుకు రూ.500కోట్లు కేటాయిం చామని తెలిపారు. హైదరాబాద్‌లో 19 ప్రాంతాల్లో మినీ ట్యాంక్‌బండ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రాజెక్టులకోసం 3.78 లక్షల ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 3 లక్షల 10వేల410ఎకరాలు సేకరించామన్నారు. ప్రయివేటు వ్యక్తులు ముందుకు వస్తే హైడల్ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం సహకరి స్తుందన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్‌తో కేటాయింపులు పెరుగు తాయని తెలిపారు. కాంగ్రెస్ టీఆర్ఎస్ ప్రభుత్వంపై బుర దజల్లి రాజకీయ లబ్ది పొందేందుకు యత్నిస్తుందన్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని త్వరలో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ ప్రాణహిత పథకం అదిలాబాద్ వరకు ఉంటుందని తెలిపారు.

వీహెచ్‌పీ రథయాత్రపై 27న విచారణ

హైదరాబాద్, మార్చి 23(మనం లీగల్ ప్రతినిధి): ఈ నెల 18 నుంచి 31వ తేదీ హనుమాన్ జయంతి వరకూ బాసర నుంచి హైదరాబాద్ తాడ్‌బడ్ హనుమాన్ మందిర్ వరకు శ్రీరామ రథయాత్ర నిర్వహించేందుకు అనుమతి ఇచ్చేలా తెలంగాణ సర్కార్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హైకోర్టులో అప్పీల్ చేసింది. వీహెచ్‌పీ రిట్‌ను నిన్న సింగిల్ జడ్జి కొట్టేయడంతో డివిజన్ బెంచ్ ముందుకు అప్పీల్ చేసింది. దీనిని అత్యవసరంగా విచారించలేమని, 27న విచారిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితో కూడిన బెంచ్ శుక్రవారం ప్రకటించింది.

ఏసీబీ కేసులో.. యాదవ్‌రెడ్డి

బెయిల్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, మార్చి 23(మనం లీగల్ ప్రతినిధి): రాబడి కంటే భారీగా ఆస్తులు, ఆదాయం ఉన్నట్లుగా ఏసీబీ నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ యాదవ్‌రెడ్డి చేసుకున్న పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టేసింది. హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్‌గా పురుషోత్తమ్‌రెడ్డి అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే కేసులో యాదవ్‌రెడ్డి రెండో నిందితుడు. పురుషోత్తమ్‌రెడ్డి ధనంతోనే యాదవ్‌రెడ్డి నిర్మాణ పనుల్లో పెట్టుబడులు పెట్టారని, దర్యాప్తు దశలో బెయిల్ ఇవ్వరాదని ఏసీబీ చేసిన వాదన అనంతరం పిటిషన్‌ను న్యాయమూర్తి సత్యనారాయణమూర్తి పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

గీత కార్మికులకు

వనంపై హక్కులివ్వాలి

హైదరాబాద్, మార్చి 23(మనం ప్రతినిధి): గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని రాష్ట్ర గీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయాలతో ఎన్నో ఏండ్లుగా తాము చేస్తున్న పోరాటానికి పాక్షిక విజయం దక్కిందని బొమ్మగాని పేర్కొన్నారు. వనంపై గీత వృత్తిదారులకు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కీర్తిపతాక 'శంషాబాద్'



(మొదటిపేజీ తరువాయి)

కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..ఎయిర్ పోర్టులో ప్రయాణీకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టు నిర్మాణంలో చాలా మంది అంచనాలను జీఎంఆర్ తలకిందులు చేసి సగర్వంగా నిలబడిందని అన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు హైదరాబాద్‌కు బ్రాండ్‌గా నిలిచిందన్నారు. ఎయిర్ ట్రాఫిక్ ఫ్యూయల్ పై వ్యాట్ ను 16 శాతం నుంచి ఒక్క శాతానికి తగ్గిస్తున్నట్లు ఈ సందర్భంగా కేటీఆర్ ప్రకటించారు. అనంతరం.. జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు మాట్లాగడుతూ.. ఏడాదికి కోటి ఇరవై లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో విమానాశ్రయం ప్రారంభమైందని అన్నారు. భవిష్యత్తులో ఏడాదికి నాలుగు కోట్ల మందిని తట్టుకునేలా విస్తరణ చేపడతామని అన్నారు. వేడుకల్లో జీఎంఆర్ చైర్మన్ గ్రంథి మలికార్జునరావు, మంత్రి మహేందర్ రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, సినీ నటుడు రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ దశాబ్ది వేడుకల్లో 'డికేడ్ ఆఫ్ ఎక్సలెన్స్' స్టాంపును, పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ నిర్వహించే శిక్షణ కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మూడు ఎంవోయూలు కుదిరాయి.

పెళ్లి'కూతురిని' చంపేసిన తండ్రి

- **దళితుడిని పెళ్లి చేసుకోబోవడమే కారణం**
- **పెళ్లికి అంగీకరించిన ఇరుపక్షాలు**
- **తండ్రి ఒక్కరికే అభ్యంతరం.. చివరకు ఘోరం**



మళప్పురం, మార్చి 23: కేరళలో ఘోరం జరిగింది. దళిత యువకుడిని పెళ్లి చేసుకుంటోం దన్న కోపంతో.. కన్న కూతురిని ఆమె పెళ్లిరోజే పొడిచి చంపేశాడో తండ్రి. 22 ఏళ్ల అతిరను ఆమె తండ్రి రాజన్ (44) పొట్టలో కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటన కేరళలోని మళప్పురం జిల్లాలో జరిగింది. ఆర్మీలో పనిచేసే దళిత యువకుడిని అతిర ప్రేమించింది. కానీ వారి ప్రేమను ఆమె తండ్రి ఆమోదించలేదు. రెండు కుటుంబాల పెద్దల మధ్య పోలీసుల సమక్షంలో చర్చలు జరిగినప్పుడు ఒక్క అతిర తండ్రి రాజన్ తప్ప అందరూ పెళ్లికి ఆమోదించారు. దాంతో అరీకోడ్‌లోని ఓ ఆలయంలో పెళ్లి చేయాలని అనుకున్నారు. సరిగ్గా పెళ్లికి ముందు తండ్రీ కూతుళ్ల మధ్య గొడవ జరిగింది. ఆ గొడవతో.. రాజన్ తన కూతురిని కత్తితో పొడిచి అక్కడినుంచి పారిపోయాడు. విషయం పోలీసులకు తెలియడంతో వారు ఆ తర్వాత రాజన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గొంతుకోసి.. 54సార్లు కత్తితో పొడిచి.. హేళన చేశాడని మిత్రుడినే చంపేశాడు!

- **ముంబయిలో దారుణం.. వారం తర్వాత వెలుగులోకి**



ముంబయి, మార్చి23: చదువు రాని మొద్దువంటూ పదేపదే హేళన చేయడం తట్టుకోలేక ఓ యువకుడు తన స్నేహితుడినే దారుణంగా చంపేశాడు. గొంతు కోసి, కత్తితో పొడిచి ప్రాణం తీశాడు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 54 సార్లు కత్తితో పొడిచాడు. వారంపాటు తప్పించుకు తిరిగినా.. తాజాగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ముంబయిలో వారం క్రితం చోటుచేసుకున్న ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. షాహు నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే మహ్మద్ అమిర్ అబ్దుల్ వహీద్ రహీన్ (21), మహ్మద్ అఫ్రాజ్ అలాం షేక్ (18) ఇద్దరు స్నేహితులు. పెద్దగా చదువుకోని రహీన్‌ను అఫ్రాజ్ ఎగతాళి చేసేవాడు. స్నేహితుడితో ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ విసిగించేవాడు. పదే పదే ఎగతాళి చేస్తుండడంతో అఫ్రాజ్‌ను అంతంచేయాలని రహీన్ నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం వారం పాటు ఆలోచించి ప్లాన్ వేసుకున్నాడు. ఇందులో భాగంగా.. గత బుధవారం రాత్రి పార్టీ ఇస్తానంటూ అఫ్రాజ్‌ను బయటికి తీసుకెళ్లాడు. బాంద్రాలో ఇద్దరూ చెరో బీర్ తాగి సమీపంలోని పబ్లిక్ టాయిలెట్‌కు వెళ్లారు. లోపలికి వెళ్లగానే రహీన్ తన మిత్రుడిపై దాడిచేసి కత్తితో గొంతుకోశాడు. ఆపై శరీరంపై విచక్షణారహితంగా పొడిచాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వారం తర్వాత బుధవారం అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో షాహూ నగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

కన్నకూతుర్ని కడతేర్చిన తల్లి

- **తండ్రితో లైంగిక సంబంధం అనుమానంతోనే...**
- **ముంబైలో ఈ నెల 4న ఘటన.. తాజాగా వెలుగులోకి**

ముంబై, మార్చి 23:తండ్రీకూతుళ్ల మధ్య లైంగిక సంబంధం ఉందనే అనుమానంతో ఓ తల్లి దారుణానికి పాల్పడింది. కన్నకూతురు అని చూడకుండా 16 ఏళ్ల బాలిక గొంతు నులిమి చంపింది. సంచలనం సృష్టించిన ఈ ఘటన ఈ నెల 4న చోటుచేసుకోగా.. తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న ముంబైలోని ఖరగ్‌పూర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఓ సివిల్ కాంట్రాక్టర్‌కు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వీరిలో ఇద్దరు తల్లిదండ్రులతోనే ఖరగ్‌పూర్‌లో నివాసముంటుండగా.. మరో ఇద్దరూ రాజస్థాన్‌లో నివాసముంటున్నారు. అయితే, తల్లి మాత్రం గత ఆరునెలల నుంచి తండ్రీకూతుళ్ల మధ్య లైంగిక సంబంధం ఉందని అనుమానిస్తూ వస్తోంది. అప్పటి నుంచి కూతుర్ని శారీరకంగా వేధించసాగింది. తల్లి వేధింపులను తాళలేక గతంలో కుమార్తె పినాయిల్ తాగి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. ఈ క్రమంలో ఎలాగైనా కూతుర్ని చంపాలని పథకం వేసిన తల్లి మధ్యాహ్నం తండ్రి లేని సమయం చూసి బెడ్‌రూంలో పడుకొన్న కుమార్తెపై దుప్పటి వేసి గొంతునులిమి చంపేసింది. మధ్యాహ్నం లంచ్‌కు వచ్చిన భర్తకు బాలిక నిద్రపోతుదంటూ నమ్మించింది. అనంతరం భర్తకు ఫోన్ చేసి కుమార్తె స్పృహ తప్పి పడిపోయిందని కట్టుకథ అల్లింది. విషయం తెలిసిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. అయితే.. పోస్టుమార్టం నివేదికలో ఊపిరి ఆడక బాలిక మృతిచెందినట్టు తేలింది. బాలిక మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమె తోటి విద్యార్థులను ఆరా తీయగా తల్లి వేధించే విషయాన్ని వివరించారు. దాంతో పోలీసులు తల్లిని తమదైన శైలిలో విచారించగా తానే హత్య చేసినట్టు అంగీకరించింది. ఈ హత్య కేసులో తండ్రి పాత్ర కూడా ఉందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు మహిళను అరెస్ట్ చేసి గురువారం కోర్టుకు తరలించారు. ఈ నెల 27వరకు ఆమెకు కోర్టు పోలీసు కస్టడీ విధించింది.

కార్తీకి బెయిల్ మంజూరు

- షరతులతో ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు
- రూ. 10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు
- దేశం వదిలి వెళ్లడానికి వీల్లేదు



న్యూఢిల్లీ, మార్చి 23: ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో కార్తీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. కార్తీ ఇంగ్లండ్ నుంచి ఫిబ్రవరి 28న తిరిగి రాగానే ఆయను సీబీఐ అరెస్టుచేసింది. ఆయనకు విధించిన 12 రోజుల జ్యుడీషియల్ కస్టడీ గడువు శనివారంతో ముగుస్తుంది. రూ. 10 లక్షల పూచీకత్తు ఇవ్వడంతో పాటు.. దేశం వదిలి వెళ్లాలంటే సీబీఐ అనుమతి తీసుకోవాలన్న షరతులతో కార్తీకి బెయిల్ ఇస్తున్నట్లు జస్టిస్ ఎస్‌పీ గార్గ్ తెలిపారు. కార్తీ తన పాస్‌పోర్టును ఇప్పటికే అధికారులకు అప్పగించారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు. అలాగే, బెయిల్ మీద బయటకు వెళ్లినపుడు సాక్ష్యాధారాలను ప్రభావితం చేయకూడదని కూడా జడ్జి ఆదేశించారు. కార్తీ చాలా ప్రభావవంతమైన వ్యక్తి కాబట్టి, ఆయన ఇప్పటికే సాక్షా ్యలను నాశనం చేశారు కాబట్టి బెయిల్ ఇవ్వద్దని సీబీఐ కోరింది.

సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయండి

- ఎస్సీ - ఎస్టీ యాక్ట్‌పై రాహుల్ డిమాండ్
- పార్టీ ఎంపీలతో కలిసి ఆందోళన

న్యూఢిల్లీ, మార్చి 23: ఎస్సీ ఎస్టీ యాక్ట్ తీవ్రతను తగ్గించేలా ఉన్న సుప్రీం తీర్పుపై కేంద్రం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి పార్లమెంటులోని గాంధీ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ/ఎస్టీ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటి) యాక్ట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విషయంలో కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. కొంతమంది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, బాధ్యతగల ఉద్యోగులను సైతం ఈ చట్టం సాయంతో వేధించడం సబబు కాదని రాహుల్ పేర్కొన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం ఫిర్యాదు అందితే నిందితులను వెంటనే అరెస్ట్ చేసే అవకాశం పోలీసులకు ఉంది. అయితే, ఈ చట్టం ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. ప్రభుత్వ అధికారులపై ఈ చట్టం కింద కేసు నమోదైనా తక్షణ అరెస్టు కుదరదని తేల్చి చెప్పింది. ఎస్పీ స్థాయి అధికారి ప్రాథమికంగా విచారణ జరిపిన తర్వాతే బాధ్యులను అరెస్టు చేయాలంటూ ఆదేశాలిచ్చింది. దీంతో ఎస్సీ ఎస్టీ యాక్ట్ పదును తగ్గిందని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. చట్టాన్ని నీరుగార్చే చర్యలు జరుగుతున్నాయని, సుప్రీం తీర్పు అట్రాసిటీ చట్టం బలాన్ని తగ్గించేలా ఉందని వారు ఆరోపిస్తూ సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

మరోసారి ప్రజలను ఏమార్చుతోంది

- బీజేపీపై మండిపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 23: సమస్యలపై నుంచి ప్రజల దృష్టి మరల్చడంలో బీజేపీకి ఎవరూ సాటిలేరంటూ రాహుల్ గాంధీ విమర్శించారు. తీవ్రమైన సమస్యల నుంచి ప్రజల ఆలోచనలను తప్పించేందుకు అవలీలగా అబద్ధాలాడుతుందని మండిపడ్డారు. తాజాగా కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ(ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారం దొంగిలించిన సంస్థ)తో కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఉందన్న ఆరోపణ కూడా అందులో భాగమేనని ఆరోపించారు. నిజానికి కేంబ్రిడ్జి అనలిటికాతో అంటకాగి, గత ఎన్నికల్లో లబ్ధి పొందింది బీజేపీనేనని విమర్శించారు. ఈమేరకు శుక్రవారం రాహుల్ ట్వీట్ చేశారు. అబద్ధాలతో నిజాల గొంతు నొక్కే పనిని బీజేపీ కంటే సమర్థవంతంగా ఎవరూ చేయలేరని రాహుల్ ఎద్దేవా చేశారు. తాజాగా ఐసిస్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన 39 మంది భారతీయుల అంశం నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకే అనలిటికా అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి అడ్డగోలుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు.


2017లో పెను నష్టం



ముంచెత్తిన విపత్తులు.. భారీగా ప్రాణ.. ఆస్తి నష్టం

- **ఒక్క ఏడాదే 20 లక్షల కోట్లని అంచనా**
- **అమెరికాను వణికించిన హరికేన్లు**
- **తుపాన్లతో అతలాకుతలం**
- **డబ్ల్యూఎంవో నివేదిక వెల్లడి**

ఐక్యరాజ్య సమితి, మార్చి 23: భారత ఉపఖండాన్ని ముంచెత్తిన వరదలు.. తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో కరువు.. అమెరికాలో వరుస హరికేన్లు.. వెరసి 2017 ఏడాదిలో పకృతి వణికించింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఎన్నడూ లేనంతగా తీవ్రమైన ఆస్తినష్టానికి కారణమైంది. ఒక్క ఏడాదిలోనే ప్రపంచ దేశాలలో ఈ విపత్తుల కారణంగా 320 బిలియన్ డాలర్ల నష్టం(మన రూపాయలలో 20.80 లక్షల కోట్ల పైచిలుకు) సంభవించిందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంవో) పేర్కొంది. ఈమేరకు '2017 స్టేట్ ఆఫ్ క్లైమేట్' పేరుతో విడుదల చేసిన నివేదికలో డబ్ల్యూఎంవో ఈ వివరాలను వెల్లడించింది. డబ్ల్యూఎంవో నివేదిక ప్రకారం ఇప్పటివరకూ ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాల్లో ఇదే అత్యధికమని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



ముంచెత్తిన వరదలు..



2017లో నేపాల్, బంగ్లాదేశ్, భారత్, శ్రీలంకల్లో పలు చోట్లు భారీ వరదలు సంభవించాయి. మేలో మోరా తుపాను కారణంగా ఉత్తరభారతంలో వరదలు వచ్చాయి.. ఆ తర్వాత డిసెంబరులో ఓఖీ తుపాను కారణంగా శ్రీలంక సహా దక్షిణ భారతదేశంలోని కన్యాకుమారి, లక్షద్వీప్ అతలాకుతల మైన విషయం తెలిసిందే. మొత్తంగా గత ఏడాది వర్షాకాలంలో భారత్‌లోని చాలా ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయి. అయితే, ఆయా ప్రాంతాల్లో సగటు వర్షాపాతమే నమోదు కావడం గమనార్హం. అటు ఆగస్టులో భారీ వర్షాల కారణంగా నేపాల్, బంగ్లాదేశ్‌లలో భారీ వరదలు సంభవించాయి. ఈ వరదల వల్ల భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌లలో 1200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులుగా మారగా.. మూడు దేశాల్లోని నాలుగు కోట్లమందిపై వరదల ప్రభావం పడింది. వరదలు తొందర్లోనే తగ్గినా ప్రభావం మాత్రం అంత సులభంగా తొలగిపోలేదు. ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఈ వరదల కారణంగా 13 వేల మంది వివిధ రోగాల బారిన పడ్డారని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది.

వణికించిన హరికేన్లు

అమెరికాలో వరుస హరికేన్లు చోటుచేసుకుని విపరీతమైన ఆస్తినష్టం సంభవించిన విషయం తెలిసిందే. హరికేన్ హర్వీ, ఇర్మా, మరియా కారణంగా గతేడాది అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ హరికేన్ల వల్ల 2017 జూన్ నుంచి నవంబరు వరకు అమెరికాలో 17 తుపానులు సంభవించాయి. వీటి వల్ల అగ్రరాజ్యానికి దాదాపు 202.6 బిలియన్ల ఆస్తి నష్టం సంభవించింది. 2005 తర్వాత అమెరికాలో మళ్లీ అంతటి నష్టం జరగడం 2017లోనే. ఇక ఇదే సమయంలో తూర్పు ఆఫ్రికాలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొన్నారు.

ఆప్‌కు ఢిల్లీ హైకోర్టు ఊరట

20 మంది ఎమ్మెల్యేలమీద అనర్హత వేటుపై స్టే
తాజా విచారణ ప్రారంభించాలని ఈసీకి ఆదేశం



న్యూఢిల్లీ, మార్చి 23: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. ఈ మేరకు లాభదాయక పదవుల కేసులో 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత ఆదేశాలను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చంద్రశేఖర్‌ల ధర్మాసనం నిలుపుదల చేసింది. దీనిపై కేంద్ర జారీచేసిన నోటిఫికేషన్ చట్టానికి అనుగుణంగా లేదంటూ... ఎమ్మెల్యేల అభ్యర్థనమీద తాజా విచారణ చేపట్టాల్సిందిగా ఆదేశించింది. శాసనసభ్యులపై అనర్హత వేటుకు సిఫారసు చేయడంద్వారా సహజ న్యాయాన్ని పాటించడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని స్పష్టం చేసింది. చర్యకు సిఫారసు చేసేముందు కనీసం వారి వాదనను వినకపోవడం చట్టాన్ని భ్రష్టుపట్టించడమేనని వ్యాఖ్యానించింది. హైకోర్టు ఆదేశాలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో హర్షం ప్రకటించారు. సత్యం సదా విజయం సాధిస్తుందని ఆయన వ్యాఖ్యానించగా, అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ బల్లలు చరుస్తూ 'భారత్ మాతాకీ జై' అని నినదించారు.

ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా వారితో చేయి కలిపి హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కాగా, ''ప్రజలెన్నుకున్న ప్రతినిధులపై అనర్హత వేటు అక్రమం. ఢిల్లీ హైకోర్టు తన నిర్ణయంద్వారా ప్రజల తీర్పునకు న్యాయం చేసింది. ఈ సందర్భంగా ఢిల్లీ పౌరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'' అని కేజ్రీవాల్ ట్విట్టర్‌లోనూ వ్యాఖ్యానించారు.

'లోకాయుక్త' ఏర్పాటు చేయలేదేం?

- ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పండి
- తెలంగాణసహా 12 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ



న్యూఢిల్లీ, మార్చి 23: దేశంలోని 12 రాష్ట్రాల్లో లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంపై సుప్రీం కోర్టు నిలదీసింది. ఈ ప్రక్రియను ఎందుకు చేపట్టలేదో వివరించడంతోపాటు ఎప్పుడు పూర్తిచేస్తారో కూడా చెప్పాలని ప్రభుత్వాలను కోరింది. ఈ మేరకు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ భానుమతిల ధర్మాసనం శుక్రవారంనాడు ఆయా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. ఈ జాబితాలో తెలంగాణతోపాటు ఢిల్లీ, తమిళనాడు, పుదుచ్చేరి, జమ్ముకశ్మీర్, మణిపూర్, త్రిపుర, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలున్నాయి. 'లోక్‌పాల్, లోకాయుక్త చట్టం-2013' ప్రకారం ప్రతి రాష్ట్రంలో లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేయడం తప్పనిసరి. అయితే, ఈ చట్టాన్ని కొన్ని రాష్ట్రాలు తుంగలో తొక్కాయంటూ ఢిల్లీ బీజేపీ నేత, న్యాయవాది అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ సుప్రీం కోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. లోకాయుక్త కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపుసహా మౌలిక వసతులు కల్పించేలా రాష్ట్రాలను ఆదేశించాలని తన వ్యాజ్యంలో అభ్యర్థించారు. 'లోక్‌పాల్, లోకాయుక్త చట్టం-2013'కు అప్పటి రాష్ట్రపతి 2014 జనవరి 1న ఆమోదముద్ర వేశారని కోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ వివరించారు. ఆ మేరకు సదరు చట్టం 2014 జనవరి 16 నుంచి అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. అయితే, కేంద్రంలో నేటికీ 'లోక్‌పాల్'ను ఏర్పాటు చేయకపోగా కొన్ని రాష్ట్రాల్లో లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటును పట్టించుకోవడం లేదని తెలిపారు. మరికొన్ని రాష్ట్రాలు లోకాయుక్తను ఏర్పాటు చేసినా బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. అలాగే మౌలిక వసతులు కల్పించకపోవడంతోపాటు సిబ్బందిని నియమించకుండా ఆ వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా నీరుగారుస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం తగురీతిలో స్పందించి, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. మరోవైపు ఒడిసాలో లోకాయుక్త వ్యవస్థ ప్రస్తుత పరిస్థితిపై ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించింది. అంతేకాకుండా అవినీతి నిరోధానికి సంబంధించి రాష్ట్రంలో స్వతంత్ర న్యాయాధికారి (అంబుడ్స్‌మన్) ఉన్నారో.. లేదో కూడా తమకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



తీరానికి కొట్టుకొచ్చిన 150 తిమింగలాలు

పెర్త్, మార్చి 23: ఆస్ట్రేలియాలో 150 తిమింగలాలు సముద్ర తీరానికి కొట్టుకువచ్చాయి. దీంతో స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పెర్త్ సమీపంలో ఉన్న హమాలిన్ బే దగ్గర తిమింగలాలు నిలిచిపోయాయి. వీటిలో సగం చనిపోయినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రాణాలతో ఉన్న తిమింగలాలను సముద్రంలోకి వదిలేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఒడ్డున పడి ఉన్న వాటిని షార్ట్ ఫిన్నిడ్ పైలట్ వేల్స్‌గా గుర్తించారు.

ట్రంప్ భద్రతా సలహాదారు ఔట్

- మెక్ మాస్టర్‌ను తొలగించిన ట్రంప్
- ఆ స్థానంలో జాన్ బోల్టన్ నియామకం

వాషింగ్టన్, మార్చి 23: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో మరో వికెట్ పడింది. జాతీయ భద్రతా సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ హెచ్ఆర్ మెక్‌మాస్టర్‌ను పదవి నుంచి తొలగించినట్లు శుక్రవారం వెల్లడించారు. ఆయన స్థానంలో ఐరాస మాజీ రాయబారి జాన్ బోల్టన్‌ను నియమించారు. తాజాగా వైట్‌హౌస్‌లో జరిగిన కీలక పరిణామమిది. ఇప్పటికే ట్రంప్ యంత్రాంగం నుంచి పలువురు ఉన్నతస్థాయి అధికారులు తప్పుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరొకరు ఆ జాబితాలో చేరారు. మెక్‌మాస్టర్‌ను తొలగించినట్లు గత వారమే వార్తలు వెలువడ్డాయి. అయితే అప్పుడు వైట్‌హౌస్ ఆ వార్తలను ఖండించింది.



ఎయిర్ 'ఇండియా' టూ ఇజ్రాయెల్

- **సౌదీ గగనతలం మీదుగా తొలి విమానం**
- **దశాబ్దాల నిషేధం ఎత్తేసిన సౌదీ సర్కార్**
- **ఈ మార్గంలో వెళ్లిన తొలి దేశంగా భారత్**
- **రెండు గంటల ప్రయాణ సమయం ఆదా**

టెల్ అవీవ్, మార్చి 23: భారత్-ఇజ్రాయెల్ మధ్య బంధాన్ని మరింత పటిష్టపరిచే దిశగా ఎయిరిండియా చరిత్ర సృష్టించింది. తొలిసారిగా సౌదీ గగనతలం మీదుగా ఇజ్రాయెల్‌కు విమాన ప్రయాణం సాగించింది. తన గగనతలం మీదుగా ఇజ్రాయెల్ ప్రయాణంపై ఉన్న దశాబ్దాలుగా నిషే. దాన్ని సౌదీ అరేబియా ఎత్తివేయడంతో తొలిసారి న్యూఢిల్లీ నుంచి నేరుగా ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు ఎయిరిండియా ప్రయాణం కట్టింది. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరిన ఏఐ139 విమానం అర్ధరాత్రి 1.15 గంటలకు (భారత కాలమానం ప్రకారం) టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయంలో దిగింది. సౌదీ అరేబియా గగనతలం మీదుగా ఇజ్రాయెల్ చేరిన తొలి దేశంగా ప్రపంచంలోనే భారత్ రికార్డు సృష్టించింది. కొన్ని దశాబ్దాలుగా సౌదీ సహా అరబ్ దేశాలేవీ ఇజ్రాయెల్‌ను దేశంగా గుర్తించేవి కాదు. దీంతో తమ గగనతలం పైనుంచి ఇజ్రాయెల్‌కు విమాన సర్వీసులపై నిషేధం విధించాయి. భారత్ సహా పలు దేశాల దౌత్యంతో ఎట్టకేలకు సౌదీ నిషేధం తొలగించింది. దీంతో ఇక ఎర్ర సముద్రం చుట్టూ తిరిగి ఇజ్రాయెల్‌కు వెళ్లే కష్టం తప్పింది. వారి గగనతలం మీదుగా వెళ్లేందుకు సౌదీ అరేబియా అనుమతివ్వడంతో దూరం చాలా తగ్గినట్టయింది. ఈ మార్గం గుండా ప్రయాణించిన తొలి విమానయాన సంస్థగా ఎయిరిండియా చరిత్ర సృష్టించింది. దీంతో భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్లే సమయంలో 2 గంటల 10 నిమిషాలు ఆదా అయింది. కాగా, సౌదీ అరేబియా అనుమతివ్వడంపై ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి లెవిన్ హర్షం వ్యక్తం చేశారు. సౌదీ అరేబియా తీసుకున్న ఈ నిర్ణయం చాలా ముఖ్యమైనదని, కాలంతో పాటు అన్ని మారుతుంటాయని, పొరుగు దేశంతో సంబంధాలను బలపరచుకుంటామని, అందుకు సౌదీ గగనతలం మీదుగా ప్రయాణించి భారత్ వారధిగా నిలిచిందని అన్నారు. ''నిజంగా ఇది ఓ చరిత్రాత్మక సమయం. మేం ఓ కొత్త శకంలోకి అడుగుపెట్టాం. ఇజ్రాయెల్‌కు భారత పర్యాటకులు మరింత మంది వస్తారన్న నమ్మకం నాకుంది. ఇలాంటి డైరెక్ట్ ఫ్లైట్ ద్వారా ఇరు దేశాల సంబంధాలు మరింత బలపడతాయి'' అని ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి లెవిన్ అన్నారు. ఇరుదేశాల ప్రధానులు రెండేళ్లుగా సత్సంబంధాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని, అవి సత్ఫలితాలనిస్తున్నాయని ఇజ్రాయెల్‌లో భారత రాయబారి పవన్ కపూర్ అన్నారు. ఇకపై ప్రతి మంగళ, గురు, ఆది వారాల్లో భారత్ నుంచి నేరుగా ఇజ్రాయెల్‌కు విమానాలు ఉంటాయని ఎయిరిండియా వెల్లడించింది.

ఇద్దరు చంద్రుల సమక్షంలో...


బాలకృష్ణ

కీ।।శే।। నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర ఆధారంగా తేజ దర్శకత్వంలో 'యన్.టి.ఆర్' బయోపిక్ రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని మార్చి 29న పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లోని రామకృష్ణా సినీ స్టూడియోస్‌లో ప్రారంభిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ జూన్‌లోగానీ, జూలైలోగానీ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. తండ్రి సొంత ఊరైన నిమ్మకూరు, తల్లి కొమరవోలు నుండి అభిమానులను ప్రత్యేకంగా ఆహ్వానించారు బాలకృష్ణ. అంతేకాదు ఈ ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అతిథులుగా హాజరవుతున్నారు. ఈ చిత్రాన్ని నందమూరి బాలకృష్ణ, సాయి కొర్రపాటి, విష్ణు ఇందుకూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 2019 సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని తెలుస్తోంది.

ప్రపంచంలో రెండో స్థానం


మహేష్

మహేశ్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'భరత్ అనే నేను'. కైరా అద్వాని హీరోయిన్. 'ది విజన్ ఆఫ్ భరత్' పేరుతో విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. టాలీవుడ్‌లోనే అత్యధిక లైక్స్ సాధించిన టీజర్‌గా రికార్డు సృష్టించిన ఈ టీజర్ ఇప్పుడు మరో రికార్డు సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది లైక్ చేసిన టీజర్లలో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ టీజర్‌ను 6,40,000 మంది లైక్ చేశారు. తొలి స్థానంలో హాలీవుడ్ చిత్రం 'కెప్టెన్ అమెరికా 'సివిల్ వార్' ఉంది. 6,58,000 మంది ఈ టీజర్‌ను లైక్ చేశారు. డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య డి.వి.వి. ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

లండన్‌లో 'బాహుబలి'


ప్రభాస్

ప్రభాస్ టైటిల్ పాత్రలో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి' ఎంతటి సెన్సేషనల్ హిట్ అయ్యిందో మనకు తెలిసిందే. తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిన చిత్రమిది. ఇప్పుడు ప్రభాస్‌కు మరో అరుదైన ఘనత దక్కనుంది. ఈ సినిమా సమయంలో బ్యాంకాక్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ప్రభాస్ మైనపు బొమ్మను ప్రతిష్ఠించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు లండన్‌లోని ఈ మ్యూజియం ప్రధాన శాఖలో కూడా ప్రభాస్ మైనపు బొమ్మను ప్రతిష్టిస్తున్నారు. మరో వైపు కట్టప్ప సత్యరాజ్ మైనపు బొమ్మను మేడమ్ టుస్సాడ్స్‌లో ఉంచనున్న సంగతిని రీసెంట్‌గా ఆయన తనయుడు శిబిరాజ్ తెలియజేశారు. ఒకే సినిమాకు చెందిన ఇద్దరు నటుల బొమ్మలు ఓ మ్యూజియంలో ఉండటం అరుదైన విషయమే కదా!.

ముహూర్తం కుదిరింది


ఎన్టీఆర్, త్రివిక్రమ్

ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ భారీ సినిమా రూపుదిద్దుకోనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మొదటి కలయికలో రూపొందనున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం కోసం ఎన్టీఆర్ ఇప్పటి నుంచే తన కొత్త లుక్ కోసం బాడీ బిల్డప్ చేస్తున్నారు. ఏప్రిల్ 12న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాను దసరాకు విడుదల చేయాలని నిర్మాత ప్లాన్ చేస్తున్నారు. ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, థమన్ సంగీతాన్ని అందిస్తారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



'మహానటి' షూటింగ్ పూర్తి

కీర్తి సురేష్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'మహానటి'. అలనాటి మహానటి సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగఅశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకొంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. బుధవారం సెట్‌లో గుమ్మడికాయ కొట్టారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ప్రియాంక దత్ మాట్లాడుతూ ''మా టెక్నికల్ టీమ్ ఎంతో నేర్పుతో క్రియేట్ చేసిన బ్లాక్ అండ్ వైట్ ఎరా ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురి చేయడమే కాక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. ఏ విషయంలోనూ రాజీపడకుండా 'మహానటి' లాంటి అద్భుతమైన చిత్రాన్ని నిర్మించినందుకు గర్వపడుతున్నాం. కీర్తి సురేష్, సమంత, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, ప్రకాష్ రాజ్, షాలిని పాండే, మాళవిక నాయర్, భానుప్రియ, దివ్యవాణి, శ్రీనివాస్ అవసరాల, దర్శకులు క్రిష్, తరుణ్ భాస్కర్ వంటి వారితో కలిసి మా బ్యానర్‌లో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఏయన్నార్ పాత్రలో నటించిన అక్కినేని నాగచైతన్యకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మోహన్‌బాబుగారు, రాజేంద్రప్రసాద్‌గారు మాకెంతోఅండగా నిలబడ్డారు. మే 9న విడుదలవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మరపురాని అనుభూతిని మిగుల్చుతుంది'' అన్నారు.


మెహరీన్

మరో మంచి ఛాన్స్

'ఛలో' మంచి విజయాన్ని అందుకున్న హీరో నాగశౌర్య తదుపరి చిత్రం ఇటీవల ప్రారంభమైంది. 'నర్తనశాల' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా చక్రవర్తి దర్శకుడుగా పరిచయమవుతున్నారు. నాగశౌర్య సొంత బేనర్ అయిన ఐరా క్రియేషన్స్‌లో 'ఛలో' తర్వాత నిర్మాణం జరుపుకుంటున్న చిత్రమిది. ఏప్రిల్ 12 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. కాగా, ఈ సినిమాలో నాగశౌర్య సరసన మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తుందని వార్తలు వస్తున్నాయి. కేరాఫ్ సూర్య, జవాన్ చిత్రాలు పరాజయం పాలైన విషయం తెలిసిందే. 'నర్తనశాల' తనకు డెఫినెట్‌గా సూపర్‌హిట్ అవుతుందని ఎంతో కాన్ఫిడెన్స్‌తో ఉందట మెహరీన్.

వై.ఎస్.జగన్ పాత్రలో..



కీ।।శే।। వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జీవిత కథ ఆధారంగా మహి వి.రాఘవ్ దర్శకత్వంలో ఓ బయోపిక్ రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం పులివెందుల ప్రాంతంలో లొకేషన్స్‌ను చూస్తున్నారు దర్శకుడు. ఈ చిత్రం మే లో సెట్స్‌పైకి వెళ్ళనుంది. కె.. ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. సత్యన్, సూర్యన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఈ చిత్రం వై.ఎస్.జగన్ పాత్రలో నటిస్తారని కొంతమంది పేర్లు వినిపించినప్పటికీ ఫైనల్‌గా తమిళ హీరో సూర్యను ఎంపిక చేసుకు న్నారని తెలుస్తోంది. సూర్య సరసన కీర్తి సురేష్ నటించనుందని సమాచారం. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో వై.ఎస్. ఆర్. సతీమణి విజయమ్మ పాత్రలో నయనతార నటించే అవకాశం ఉంది. ఇక వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాత్రను మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి పోషిస్తున్న విషయం తెలిసిందే.


నివేదా థామస్



ఆర్.పి.పట్నాయక్

రాముడి కోసం పాట

సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ శ్రీరామ నవమి సందర్భంగా ఓ పాటను విడుదల చేయడానికి రెడీ అయ్యారు. అమ్మపల్లి సీతారామ కల్యాణం పేరుతో అహ్వానం కూడా ఇస్తున్నారట. రాముడిపై ప్రత్యేకమైన గీతం కంపోజ్ చేయడం నా అదృష్టం. ఈ అవకాశాన్ని దేవుడు ఇచ్చినట్లుగానే భావిస్తున్నానని అన్నారు ఆర్.పి.పట్నాయక్. శంషాబాద్‌కు సమీపంలో ఉండే అమ్మపల్లిలో పురాతనమైన శ్రీరాముని ఆలయం ఉంది. ఆ ఆలయంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు ఈ పాటను విడుదల చేస్తారు. అర్జున్ కొండవీటి ఈ సాంగ్‌ను డైరెక్ట్ చేస్తున్నారు. ఆర్.పి.పట్నాయక్ మ్యూజిక్ డైరెక్షన్ నుండి డైరెక్షన్‌కు మారిన సంగతి విదితమే. త్వరలోనే తాను డైరెక్ట్ చేయబోయే సినిమాకు ఆర్.పి.పట్నాయక్ సన్నాహాలు చేసకుంటున్నారు.

నారా రోహిత్ సరసన...

ప్రారంభం నుండి విలక్షణమైన సినిమాలు చేసే హీరోల్లో నారా రోహిత్ ఒకరు. ఈయన కథానాయకుడిగా .. పి.బి.మంజునాథ్ దర్శకత్వంలో 'శబ్ధం' అనే సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో నారా రోహిత్ పక్కన నటించేందుకు దర్శక నిర్మాతలు హీరోయిన్‌ను అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా నారా రోహిత్‌తో మలయాళ ముద్దుగుమ్మ నివేదా థామస్‌ను నటింపచేసేందుకు ప్రయత్నాలు చేస్తుంది చిత్ర యూనిట్. 'జెంటిల్ మన్', 'నిన్ను కోరి', 'జై లవకుశ' సినిమాల్లో మంచి పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్న నివేదా థామస్ చేయబోయే పాత్ర ఎలా ఉండబోతుందో మరి. ఈ చిత్రంలో నారా రోహిత్ మాటలు రాని వ్యక్తి పాత్రలో నటిస్తున్నారు.



రాజ్‌తరుణ్, అమైరా దస్తూర్

మే 11న 'రాజుగాడు'

రాజ్ తరుణ్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'రాజుగాడు' ఎ.కె.ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. సంజనా రెడ్డి దర్శకురాలు. అమైరా దస్తూర్ హీరోయిన్. ఈ సినిమా మే 11న విడుదలవుతుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రామబ్రహ్మం సుంకర మాట్లాడుతూ.. ''రాజ్ తరుణ్ మా బ్యానర్‌లో చేస్తున్న నాలుగో చిత్రమిది. సంజనా రెడ్డి చాలా చక్కగా తెరకెక్కించారు. హీరో క్యారెక్టరైజేషన్, రాజేంద్రప్రసాద్‌గారి కామెడీ ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. విడుదలైన టీజర్ మరియు పోస్టర్స్‌కి మంచి స్పందన లభించింది. మే 11న చిత్రాన్ని విడుదల చేయాలనుకొంటున్నాం. త్వరలోనే ఆడియోను విడుదల చేస్తాం'' అన్నారు.

బాబు చాణక్యం

- ప్రతిపక్షాలను ఒంటరిని చేసే వ్యూహం
- బీజేపీకి వైసీపీ.. జనసేన దూరమైనట్లే?
- పొత్తుపెట్టుకుంటామని చెప్పలేని స్థితి
- కేంద్రాన్ని దోషిగా చేసి చూపే ప్రయత్నం
- మహానాడులో కీలక రాజకీయ నిర్ణయాలు
- ప్రాంతీయ పార్టీలతో కూటమికి యత్నాలు



(మనం – అమరావతి)

టీడీపీ అధినేత చంద్రబాబు చాణక్యం ప్రదర్శిస్తున్నారు. దాదాపు నెల రోజుల క్రితం వరకు ఆత్మరక్షణలో పడిపోయిన టీడీపీతోపాటు.. వ్యక్తిగతంగా తన ఇమేజిని పెంచుకోడానికి పలు వ్యూహాలు రచిస్తున్నారు. సమస్యల పరిష్కారంలో వైఫల్యం, పనుల నత్తనడకలు ఇటీవలి కాలంలో పార్టీని, ప్రభుత్వాన్ని కాస్త ఇబ్బందుల్లోకి నెట్టాయి. ఈ నెల మొదటి వారంలో కేంద్ర మంత్రి వర్గం నుంచి బయటకు రావడం, ఎన్డీయేకు కూడా గుడ్‌బై చెప్పడంతో ఒక్కసారి దేశవ్యాప్తంగా పలు ప్రాంతీయ పార్టీల మద్దతును పొందారు. దానికితోడు ప్రతిచోటా భావోద్వేగంతో ఉపన్యాసాలు ఇవ్వడంతో పార్టీ తిరిగి కాస్త గాడిలో పడ్డట్లయింది. ప్రత్యేక హోదా గురించి విపక్షాలు చా లాకాలంగా చేస్తున్న ఉద్యమాన్ని ఒక్కసారిగా ఆయన హైజాక్ చేయగలిగారు.

బీజేపీపై వ్యూహం సక్సెస్..

బీజేపీని ప్రజల ముందు దోషిగా నిలబెట్టడంలో బాబు విజయం సాధించారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. 2014లో కాంగ్రెస్ పార్టీపై ఎలాంటి ఆగ్రహంతో ప్రజలున్నారో.. ఇప్పుడు బీజేపీపైనా అలాగే ఉన్నారని టీడీపీ వర్గాల అంచనా. అటు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కానీ, ఇటు పవన్ కల్యాణ్ కానీ బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళదామని చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఎవరికి వారే...

మరోవైపు పవన్ వామపక్షాలతో కలిసి పనిచేస్తున్నా, బీజేపీతో పవన్ కల్యాణ్‌కు అంతర్గత సంబంధాలున్నాయని ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో వామపక్షాలతో పవన్ ప్రయాణం ఎంతకాలం సాగుతుందనేది ప్రశ్నార్థకంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ రాజకీయాల్లో ఒంటరి అయిన కాంగ్రెస్ మరోసారి ఒంటరిగానే తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ప్రస్తుత సమీకరణల ప్రకారం వైసీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు, కాంగ్రెస్ ఎవరికి వారే విడివిడిగా అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగే అవకాశముంది. చంద్రబాబుకు కావల్సింది ఇదే. బహుముఖ పోటీ జరిగితే తనకు మేలని ఆయన అంచనా వేస్తున్నారు. అప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందన్నది ఒక లెక్క.

మహానాడులో కీలక నిర్ణయాలు

మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో మే నెలలో జరిగే మహానాడులో కీలకమైన రాజకీయ నిర్ణయాలు వెలువరించాలని కూడా చంద్రబాబు భావిస్తున్నట్లు చెబుతున్నారు. పార్లమెంటు వాయిదా పడ్డాక అన్ని జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతి రాజు అభినందన సభగా విజయనగరం సభ జరగనుంది. తర్వాత అన్ని నగర, పట్టణ, మండల కేంద్రాల్లో కూడా సభలు నిర్వహించి ఏపీ ప్రజలకు జరుగుతున్న కష్టనష్టాలను వివరించాలని కూడా చంద్రబాబు భావిస్తున్నారు.

కూటమిగా ఏర్పడేందుకు కసరత్తు

స్థానికంగా ప్రతిపక్షాలపై సవాళ్లు విసురుతున్న చంద్రబాబు.. మరోవెపు జాతీయస్థాయిలో ప్రాంతీయ పార్టీ నేతలందరితో కూటమిని ఏర్పాటచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న పలువురు చంద్రబాబుతో నిరంతరం మంతనాలు జరుపుతున్నారని సమాచారం పార్టీ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇటీవల కాలంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం కలిగిస్తున్న ఆపరేషన్ ద్రవిడ, ఆపరేషన్ గరుడ వంటి బీజేపీ వ్యూహాలను ఎప్పటికప్పుడు జనంలోకి తీసుకెళ్లడానికి టీడీపీ సోషల్ మీడియా విభాగం గట్టిగా పనిచేస్తోంది.

సత్యసాయి మహా సమాధిని దర్శించిన గవర్నర్



అనంతపురం, మార్చి 23 (మనం న్యూస్): తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్.. పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శుక్రవారం బెంగళూరు నుంచి రోడ్డు మార్గం గుండా గవర్నర్ పుట్టపర్తికి విచ్చేశారు. ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ వద్ద గవర్నర్‌కు కలెక్టర్ వీరపాండ్యన్, ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్, సత్యసాయి ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి, ప్రసాద్‌రావు స్వాగతం పలికారు. సాయికుల్వంత్ హాలుకు వెళ్లి సత్యసాయి బాబా మహా సమాధిని గవర్నర్ దర్శించుకున్నారు. అనంతరం తమ సమీప బంధువైన ప్రహ్లాదరావు ఇంటికి వెళ్లి కాసేపు గడిపారు. తర్వాత రోడ్డు మార్గం గుండా బెంగళూరుకు వెళ్లారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంధ్ర సరిహద్దు నుంచి పుట్టపర్తి వరకు రహదారిలో పోలీసులు భద్రతను పర్యవేక్షించారు. పుట్టపర్తి డీఎస్పీ రామవర్మ, సీఐ ఆంజినేయులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

26న శ్రీరామనవమి సెలవు

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, మార్చి 23 (మనం ప్రతినిధి): శ్రీరామనవమి పండగ సెలవు దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26కు మార్చింది. ఈ నెల 25 (ఆదివారం)గా ఉన్న సెలవు దినాన్ని మారుస్తూ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఈ మార్పుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. కాగా షెడ్యూల్ ప్రకారం సోమవారం పదో తరగతి పరీక్ష జరగనుంది.



ఏపీకి 10 'స్వచ్ఛ' అవార్డులు

- మెప్మా మహిళా సమాఖ్యలకు ప్రదానం
- ఢిల్లీలో కేంద్ర మంత్రుల నుంచి స్వీకరణ

అమరావతి, మార్చి 23: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పది స్వచ్ఛ ఎక్స్‌లెన్స్ అవార్డులను ఆంధ్రప్రదేశ్ మెప్మా మహిళా సమాఖ్య ప్రతినిధులు స్వీకరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ఈ పురస్కారాలను అందజేశారు. కేంద్రం మొత్తం 57 అవార్డులు ప్రకటించగా, అందులో పదింటిని రాష్ట్ర మెప్మా మహిళా సమాఖ్యలు గెల్చుకోవడం విశేషం. గుంటూరు 1, 2, నరసారావు పేట, తెనాలి, సత్తెనపల్లి, చీరాల, చీమకుర్తి, సామర్లకోట, నెలిమర్ల, సాలూరు పట్టణ మహిళా సమాఖ్యలకు అవార్డులు దక్కాయి. అవార్డులు అందుకున్న సంఘాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ అభినందించారు. తమను ప్రోత్సహించిన ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి మెప్మా మహిళా సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

వర్సిటీ ర్యాంకింగ్‌లపై వర్క్‌షాపు

- ఏప్రిల్ 4న నాగార్జున వర్సిటీలో నిర్వహణ

అమరావతి, మార్చి 23: యూనివర్శిటీ ర్యాంకింగ్ పద్ధతులను సులభతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, టైమ్స్ హైయర్ ఎడ్యుకేషన్‌తో కలిసి ప్రపంచ స్థాయి విశ్వ విద్యాలయాల ర్యాంకింగ్ టీమ్ స్టేట్ లెవల్ వర్క్‌షాపును నిర్వహించనున్నారు. ఏప్రిల్ 4న గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో సంబంధిత భాగస్వాములు, అనుభవజ్ఞులు పాల్గొంటారు. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల ప్రమాణాలు పెంచేందుకు, ర్యాంకింగ్ మెరుగుపరిచేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉద్యోగస్థుల సలహాలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయరాజు తెలిపారు. ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల మాదిరిగా మన ప్రాంతీయ విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్దేందుకు ఇటువంటి వర్క్‌షాపులు దోహదపడతాయి. బోధనలోనూ, ప్రయోగాలలోనూ, జ్ఞానాన్ని మెరుగుపరుచుకునే అవకాశాలు పెరుగుతాయి. ఈ వర్క్‌షాపు కన్వీనర్ ప్రొఫెసర్ వి.వల్లీ కుమారి మాట్లాడుతూ.. ఉన్నత విద్యా సంస్థలలో అనుభవజ్ఞులతో మమేకమవ్వడానికి ఇటువంటి వర్క్‌షాపులు ఉపయుక్తం అవుతాయని తెలిపారు. అన్ని యూనివర్శిటీలు, కళాశాలలు తప్పనిసరిగా ఈ వర్క్ షాపులో భాగస్వాములు కావాలని కోరారు.

రంగంలోకి కాంగ్రెస్

- 27న కేంద్రంపై అవిశ్వాస తీర్మానం
- లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు
- అందజేసిన విపక్ష నేత మల్లికార్జున ఖర్గే
- ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై నోటీసు



న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 23: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌కు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నేరుగా రంగంలోకి దిగింది. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో విఫలమైనందుకు కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను కలిసి నోటీసు ఇచ్చారు. ఈ నెల 27న కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీ జేడీ శీలం, తదితరులు ఉన్నారు. కేంద్రానికి టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు నేరుగా నోటీసు ఇవ్వడం కీలక పరిణామం. జేడీ శీలం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చాలా మంది ఎంపీలు మద్దతు ఇచ్చారని, ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చకు అవకాశం కల్పించాల్సిందేనని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా వచ్చేదాకా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే అంశంలో వైసీపీ, టీడీపీలు విడివిడిగా ఇచ్చిన నోటీసులు చర్చకు వచ్చినా తాము మద్దతుగా నిలబడతామని తెలిపారు.

హోదాపై రాజీలేని పోరాటం: రఘువీరా

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ రాజీలేని పోరాటం చేస్తుందని ఏపీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి అన్నారు. పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం పెడుతోందని చెప్పారు. 2014 మే 26న ప్రధానిగా మోదీ ప్రమాణం చేయగా, అదే ఏడాది జూన్ 1న ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీతో కలసి ఏపీకి ప్రత్యేక హోదా, చట్టంలోని హామీలు అమలయ్యేలా పార్టీ పనిచేయాలని కోరామని చెప్పారు. ఆ మరుసటి రోజే ప్రధానికి ఈ అంశాలపై సోనియా లేఖ రాశారని వెల్లడించారు. నాటి నుంచి ఏపీ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పోరాడుతోందని చెప్పారు. కోటి సంతకాల సేకరణ, మట్టి సత్యాగ్రహం, ప్రజా బాలెట్, ధర్నాలు, దీక్షలు చేశామని గుర్తు చేశారు. గుంటూరులో హోదా భరోసా సభ నిర్వహించామని, ఇందులో రాహుల్ గాంధీ, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారని, ఢిల్లీలో ఆత్మగౌరవ దీక్షలు చేపట్టామని రఘువీరా రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఏపికి ప్రత్యేక హోదా అమలు చేస్తామని రాహుల్ చెప్పారని తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి యూపీఏ భాగస్వామ్య పక్షాల సాయం కోరుతామని చెప్పారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు శైలజానాథ్, సూర్యనాయక్, జంగా గౌతమ్, సుందర రామ శర్మ, జీవీ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


సభ ఆర్డర్‌లో ఉంటేనే 'అవిశ్వాసం': స్పీకర్

- లోక్‌సభ 27కు, రాజ్యసభ 26కు వాయిదా

పార్లమెంటులో వరుసగా 5వ రోజు కూడా అదే పరిస్థితి. నాలుగు రోజులుగా ఉభయ సభల్లో కనిపించిన దృశ్యాలే శుక్రవారం కూడా చోటు చేసుకున్నాయి. టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు మరోసారి చర్చకు రాలేదు. లోక్‌సభలో ఎంపీలు ఆందోళన కొనసాగించడంతో సభ ఆర్డర్‌లో లేనందున తీర్మానానికి మద్దతు ఇస్తున్న ఎంపీలను లెక్కించడం సాధ్యంకాదని స్పీకర్ సుమిత్రా మహాజన్ మరోసారి ప్రకటించారు. సభ ఆర్డర్‌లో ఉంటేనే నోటీసు పరిశీలనకు వీలువుతుందని అన్నారు. ఆయా అంశాలపై వివిధ పార్టీల ఎంపీలు నిరసన చేపట్టడం, వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సభ్యులు ఆందోళనతో సభ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది. ఉభయ సభల్లో స్వాతంత్ర్యోద్యమ నాయకులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి అర్పించారు. సరిగ్గా 87 ఏళ్ల క్రితం బ్రిటీష్ ప్రభుత్వం వారిని ఉరి తీయించింది. కాగా గత 15 రోజులుగా ఆయా డిమాండ్లపై పలు పార్టీల ఎంపీలు ఆందోళన చేస్తుండటంతో పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి కార్యక్రమాలు, చర్చలు లేకుండా వాయిదాల పర్వం కొనసాగుతోంది.

చంద్రబాబుకు ఉల్లంఘన నోటీసిస్తా

- పీఎంవోపై కించపరిచేలా వ్యాఖ్యానించారు
- బీజేపీకి మళ్లీ దగ్గరయ్యేందుకు ప్రయత్నం
- సీఎంది డబుల్, ట్రిపుల్ యాక్షన్: విజయసాయి



న్యూఢిల్లీ, మార్చి 23: ప్రధాని కార్యాలయం (పీఎంవో) నేరస్తుల అడ్డాగా మారిందంటూ కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై సభ హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్లు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. ఎంపీలు ప్రజా సమస్యలపై పీఎంవోకు వెళ్లడం తప్పేమీకాదని అన్నారు. చంద్రబాబు సంప్రదాయాలకు విరుద్ధంగా పీఎంవోపై విమర్శలు చేయడం గర్హనీయమని, ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు, కూటములకు విడాకులు ఇవ్వడం, మళ్లీ కలిసిపోవడం చంద్రబాబుకు అలవాటేనని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. నాలుగేళ్ల పాలనలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే బీజేపీకి మళ్లీ దగ్గరయ్యేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. సినిమాల్లో మాదిరి ఆయన చేస్తోన్న డబుల్, ట్రిపుల్ యాక్షన్లను ప్రజలు గమనిస్తున్నారన్నారు. స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెట్టిన చంద్రబాబుకు జనం బుద్ధి చెప్పే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు.

సోనియాకు తీవ్ర అస్వస్థత

సిమ్లా పర్యటనలో అనారోగ్యం.. అంబులెన్స్‌లో చండీగఢ్‌కు..

ప్రత్యేక విమానంలో ఢిల్లీకి



న్యూఢిల్లీ, మార్చి 23: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సిమ్లా పర్యటనలో ఉన్న ఆమె గురువారం రాత్రి తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. తన కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి సిమ్లా సమీపంలోని ఛరబ్రాలో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించేందుకు వెళ్లిన ఆమె ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యారు. అయితే సిమ్లాలో చికిత్స తీసుకునేందుకు సోనియా గాంధీ నిరాకరించడంతో వెంటనే చండీగఢ్‌కు తరలించారు. వెంటనే అంబులెన్సును ఏర్పాటు చేయాల్సిందిగా.. స్థానిక ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ చంద్‌ను ఆమె వ్యక్తిగత వైద్యుడు కోరారు. దీంతో ప్రత్యేక వైద్యుల బృందం సిమ్లా చేరుకుని ఆమెను అంబులెన్సులో చండీగఢ్‌కు తరలించారు. రాత్రి అక్కడే చికిత్స తీసుకున్న ఆమెను శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించారు. సిమ్లాలో గురువారం రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 8 డిగ్రీలకు పడిపోవడంతో ఆమె శ్వాసకోస సమస్యను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే గురువారం సోనియాకు చికిత్స అందించిన డాక్టర్ రమేశ్ చంద్... ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

యూపీలో బీజేపీ ఊపు

- రాజ్యసభ ఎన్నికల్లో కమలదళం హవా
- 27 సీట్లతో అగ్రస్థానం.. కాంగ్రెస్‌కు 10
- అమిత్ షా ఎత్తుకు మాయావతి చిత్తు
- తొమ్మిదో స్థానం కైవసం.. ఎస్పీకి ఒకటి



న్యూఢిల్లీ, మార్చి 23: పార్లమెంటు ఎగువ సభకు శుక్రవారం నిర్వహించిన ఎన్నికలలో ప్రధాన జాతీయ పక్షాలైన బీజేపీ 27, కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోగా టీడీపీ 2, టీఆర్ఎస్ 3, జేడీయూ (శరద్‌వర్గం) 1, ఎస్పీ 1, ఎన్సీపీ 1, టీఎంసీ 4, వైఎస్ఆర్‌సీపీ 1 వంతున మొత్తం ఇతరులు 20 స్థానాలు గెలుచుకున్నారు. అందరూ అత్యంత కీలకంగా పరిగణించిన ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ 10 సీట్లకుగాను 9 కైవసం చేసుకుంది. మిగిలిన ఒక్క స్థానం సమాజ్‌వాదీ పార్టీకి దక్కింది. ఆ రాష్ట్రం నుంచి తెలుగువారైన జీవీఎల్ నరసింహారావు బీజేపీ తరఫున విజయం సాధించారు. వివిధ రాష్ట్రాల పరిధిలో మొత్తం 59 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించిన నేపథ్యంలో 10 రాష్ట్రాల్లో 33 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో రవిశంకర్ ప్రసాద్, ప్రకాష్ జావడేకర్‌సహా ఏడుగురు కేంద్రమంత్రులు కూడా ఉన్నారు. మిగిలిన 26 స్థానాలకు పోలింగ్ పూర్తయిన అనంతరం ఓట్ల లెక్కింపు సందర్భంగా కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలో కొంత ప్రతిష్టంభన నెలకొంది. అయితే, ఈ రెండు రాష్ట్రాల్లో లెక్కింపునకు ఎన్నికల కమిషన్ అనుమతించడంతో ఈ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. ఇక ఝార్ఖండ్ అసెంబ్లీలో అధికార బీజేపీకి రెండో స్థానంలో గెలవగల బలం లేకపోయినా క్రాస్ ఓటింగ్‌పై ఆశతో అభ్యర్థిని బరిలో నిలిపింది. అయితే, కాంగ్రెస్ అభ్యర్థి ధీరజ్ సాహు ఆ స్థానాన్ని దక్కించుకోగలిగారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ అభ్యర్థి సీఎం రమేశ్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణలోనూ అధికార పార్టీ టీఆర్ఎస్ అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధించారు.

ఉత్తరప్రదేశ్, కర్ణాటకలలో ఓట్ల లెక్కింపు మొదలైనప్పటికీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుల నేపథ్యంలో కొంతసేపు ఆగి, తర్వాత కమిషన్ అనుమతితో తిరిగి మొదలైంది. అంతకుముందు కర్ణాటకలో రిటర్నింగ్ అధికారి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ జేడీఎస్ ఈ ఎన్నికలను బహిష్కరించింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అభ్యర్థి నితిన్ అగర్వాల్, బీఎస్పీ అభ్యర్థి అనిల్ సింగ్ తమ బ్యాలెట్ పేపర్లను పోలింగ్ ఏజెంట్లకు చూపని కారణంగా వారి ఓట్లను చెల్లనివిగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్‌ను ఎస్పీ, బీఎస్పీ డిమాండ్ చేశాయి.

బీజేపీ రాజ్యసభ సమీకరణాలు ఎలా ఉంటాయి!

లోక్‌సభలో సంపూర్ణ ఆధిక్యంతో అన్నివిధాలా నెగ్గుకొస్తున్న అధికార బీజేపీకి ఎగువ సభలో బలం చాలకపోవడంతో కీలకాంశాలకు మద్దతు కరవవుతోంది. ప్రస్తుతం 58 స్థానాలతో రాజ్యసభలో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకి మిత్రపక్షాలకు చెందిన 11 మంది సభ్యుల మద్దతుంది. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికల ఫలితాల తర్వాత 00 సీట్లు సాధించి బలం పెంచుకున్నా ఆధిపత్యం ప్రదర్శించగల అవకాశం మాత్రం లేదు. అయితే, వివిధ రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికలలో గణనీయ విజయాలు రాజ్యసభలో 126 స్థానాల మ్యాజిక్ మార్కును చేరుకోవడంలో తోడ్పడతాయనడంలో సందేహం లేదు.

వివిధ రాష్ట్రాల్లో విజేతలు వీరే

ఉత్తరప్రదేశ్: అరుణ్ జైట్లీ, అనిల్ జైన్, జీవీఎల్ నరసింహారావు, విజయ్ పాల్ తోమర్, కంటా కర్దామ్, అశోక్ బాజ్‌పాయ్, హర్‌నాథ్‌యాదవ్, సకల్‌దీప్ రాజ్‌భర్ (బీజేపీ); జయాబచ్చన్ (సమాజ్‌వాదీ)

మహారాష్ట్ర: ప్రకాష్ జావడేకర్, నారాయణ్ రాణే, మురళీధరన్ (బీజేపీ); కుమార్ కేత్కర్ (కాంగ్రెస్), ఐల్ దేశాయ్ (శివసేన), వందనా చవాన్ (ఎన్సీపీ);

పశ్చిమ బెంగాల్: అబిర్ రంజన్ విశ్వాస్, శుభాశీష్ చక్రవర్తి, నదీముల్ హక్, శంతను సేన్ (టీఎంసీ), అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్);

కర్ణాటక: నసీర్ హుసేన్, డాక్టర్ ఎల్.హనుమంతయ్య, జి.సి.చంద్రశేఖర్ (కాంగ్రెస్), రాజీవ్ చంద్రశేఖర్ (బీజేపీ);

ఝార్ఖండ్: సమీర్ ఓరాన్ (బీజేపీ), ధీరజ్ సాహు (కాంగ్రెస్);

తెలంగాణ: బి.ప్రకాష్, జె.సంతోష్‌కుమార్, ఎ.బి.లింగయ్య (టీఆర్ఎస్)

కేరళ: ఎం.పి.వీరేంద్రకుమార్ (జేడీయూ రాష్ట్రశాఖ అధ్యక్షుడు–శరద్ యాదవ్ వర్గం);

ఛత్తీస్‌గఢ్: సరోజ్ పాండే (బీజేపీ);

ఆంధ్రప్రదేశ్: సీఎం రమేశ్ (టీడీపీ); కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ); వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి (వైఎస్ఆర్‌సీపీ)

టాప్ లూజర్స్ 32,596.54		23 మార్చి
286.70	యస్ బ్యాంకు	-3.87%
501.00	యాక్సిస్ బ్యాంకు	-3.34%
234.60	ఎస్‌బిఐ	-2.90%
275.80	ఐసిఐసిఐ బ్యాంకు	-2.73%
566.60	టాటా స్టీల్	-2.40%
331.10	టాటా మోటార్స్	-2.10%
1267.75	లార్సెన్ టూబ్రో	-2.07%
2068.00	డాక్టర్ రెడ్డీస్	-1.88%
2789.75	బజాజ్ ఆటో	-1.84%
892.85	రిలయన్స్	-1.59%
పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
-409.73		

బులియన్ | గత 7 రోజులు



మదుపరులు లబోదిబో



- వాణిజ్య యుద్ధ భయాలతో భారీ నష్టాలను చూసిన మార్కెట్లు
- 33 వేల దిగువకు సెన్సెక్స్, 10 వేల దిగువకు నిఫ్టీ పతనం

ముంబయి: ఒక్క మాటలో చెప్పాలంటే, అమెరికా, చైనాల నిర్ణయాలు శుక్రవారంనాడు స్టాక్ మార్కెట్లను ఒక కుదుపు కుదిపాయి. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' సుమారు 410 పాయింట్లు నష్టపోయి, గత ఐదు నెలల కనిష్ఠ స్థాయిలో ముగిసింది. విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజి (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' ఈ ఏడాదిలో మొదటిసారిగా 10,000 పాయింట్ల దిగువకు పతనమైంది. చైనా వస్తువులపై సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, చైనా కూడా అదే రీతిలో అమెరికన్ వస్తువులపై ఉన్న సుంకాలలో రాయితీలను సస్పెండ్ చేసింది.

'సెన్సెక్స్' 409.73 పాయింట్లు కోల్పోయి, ఐదు నెలల కనిష్ఠ స్థాయి 32,596.54 పాయింట్ల వద్ద ముగిసింది. అది గత ఏడాది అక్టోబరు 23న అంత తక్కువ స్థాయిని చూసింది. ఇక 'నిఫ్టీ' 116.70 పాయింట్లు కోల్పోయి 10,000 పాయింట్ల స్థాయి దిగువకు పడిపోయింది. అది మదుపరులకు మానసికంగా స్థయిర్యాన్ని ఇచ్చే 10 వేల పాయింట్ల స్థితిని చేజార్చుకుని ఐదు నెలల కనిష్ఠ స్థాయి 9,998.05 పాయింట్ల వద్ద ముగిసింది. 'నిఫ్టీ' చివరిసారి గత ఏడాది అక్టోబరు 11న 9,984.80 పాయింట్ల కనిష్ఠ స్థితి వద్ద ముగిసింది.



ప్రపంచ మార్కెట్లు కుదేలు

వాల్ స్ట్రీట్, ఆసియన్, యూరోపియన్ మార్కెట్లలోని తీవ్ర నష్టాలకు అనుగుణంగా దేశీయ స్టాక్ మార్కెట్లలోను మదుపరుల సెంటిమెంట్ తీవ్ర 'బేరిష్' రూపం దాల్చింది. అమెరికా చర్య, చైనా ప్రతి చర్యలతో ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలు పెరగడమే దానికి కారణమని బ్రోకర్లు చెప్పారు.

కరిగిన మెటల్ షేర్లు

తీవ్ర అమ్మకాల ఒత్తిడికి సెయిల్, జిందాల్ స్టీల్, వేదాంత, హిందాల్కో ఇండ్, నేషనల్ అల్యూమినియం, హిందూస్థాన్ జింక్, టాటా స్టీల్, ఎం.ఎం.డి.సి, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్ల ధరలు 6.58 శాతం వరకు పతనాన్ని చూశాయి.

మరో బ్యాంకు బాగోతం

యూనియన్ బ్యాంక్ నేతృత్వంలోని ఎనిమిది బ్యాంకుల కన్సార్టియంను రూ. 1394 కోట్ల మేర మోసం చేసిందనే ఆరోపణలపై టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) కేసు నమోదు చేయడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు విలవిలలాడాయి. 'నిఫ్టీ' బ్యాంకింగ్ రంగ సూచి 471.10 పాయింట్లు కోల్పోయి, ఇంచుమించుగా ఎనిమిది నెలల కనిష్ఠ స్థితి 23,67.40 పాయింట్ల వద్ద ముగిసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 8.29 శాతం క్షీణించి రూ. 86.85కి పడిపోయింది.

రూ. 1.57 లక్షల కోట్లు హుష్ కాకి

మదుపరులు శుక్రవారంనాడు మార్కెట్ విలువలో దాదాపు రూ. 1.57 లక్షల కోట్లను కోల్పోయారు. 'సెన్సెక్స్' వరుసగా నాల్గవ వారంలోనూ 579.46 పాయింట్ల పతనాన్ని నమోదు చేసింది. 'నిఫ్టీ' ఈ వారం మొత్తంమీద 197.10 పాయింట్లను నష్టపోయింది. రియల్టీ, మెటల్, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, ఆరోగ్య రక్షణ, పి.ఎస్.యు, ఆటో, ఆయిల్, గ్యాస్ రంగాల షేర్లు విస్తృత నష్టాలను రికార్డు చేశాయి.

కళ తప్పని ఐ.టి, మీడియా షేర్లు

సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి), సమాచార సాధనాల రంగ షేర్లు మాత్రం లాభాలను నమోదు చేశాయి. అలాగే, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, ఎం అండ్ ఎం, కోల్ ఇండియా, ఏసియన్ పెయింట్స్ షేర్లు 0.99 శాతం వరకు లాభపడ్డాయి.

స్వల్పంగా తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబయి: భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు వరుసగా రెండు వారాలు పెరుగుదలను కనబరచిన మీదట మార్చి 16తో ముగిసిన వారంలో స్వల్పంగా 152.4 మిలియన్ డాలర్లు తగ్గి, 421.334 బిలియన్ల డాలర్ల వద్ద నిలిచాయి. విదేశీ కరెన్సీ ఆస్తులలో పతనం దానికి కారణమని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారంనాడు వెల్లడించింది. ఇంతకుముందు వారంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు 728.9 మిలియన్ డాలర్లు పెరిగి, 421.487 బిలియన్ డాలర్లుగా నిలిచాయి. విదేశీ మారక ద్రవ్య




నిల్వలు ఈ ఏడాది ఫిబ్రవరి 9న 421.914 బిలియన్ డాలర్ల జీవిత కాల గరిష్ఠ స్థితిని తాకాయి. అవి 2017 సెప్టెంబరు 8న మొదటిసారి 400 బిలియన్ డాలర్ల స్థాయిని దాటాయి. అప్పటి నుంచి విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరుగుతూ తగ్గుతూ వస్తున్నాయి. యూరో, పౌండ్, యెన్ నిల్వల విలువను కూడా డాలర్లలోకి మార్చి విదేశీ కరెన్సీ ఆస్తులను లెక్కిస్తారు. పసిడి నిల్వలు 13.2 మిలియన్ డాలర్లు పెరిగి, 21.562 బిలియన్ డాలర్ల విలువైనవి ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ నుంచి ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు 4.1 మిలియన్ డాలర్ల పెరుగుదలను చూసి, 1.538 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ ఫండ్ దగ్గర దేశ రిజర్వ్ స్థితి 2.077 బిలియన్ డాలర్లుగా ఉంది.

'ఇండియా పెద్దన్న పాత్ర వహించాలి'

వాణిజ్య యుద్ధ భయాలను సడలింపజేసే పనికి భారత్ నడుంబిగించాలంటున్న ఫిక్కీ

న్యూఢిల్లీ: తెరపైకి వస్తున్న అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ అవకాశాలను సడలింపజేసేందుకు ఇండియా క్రియాశీల పాత్ర వహించాలని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ప్రపంచ వర్తకంలో ఉన్న సానుకూల దృక్పథం గాడి తప్పుతుందని భారతీయ వాణిజ్య, పారిశ్రామిక మండలుల సమాఖ్య (ఫిక్కీ) శుక్రవారంనాడు పేర్కొంది. అమెరికా చేపడుతున్న సంరక్షణ చర్యలు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి సంబంధించి తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ) ప్రక్రియ చెక్కుచెదరకుండా చూసుకోవలసిన అగత్యాన్ని, ఆ బహుళ దేశీయ సంస్థను పటిష్టపరచవలసిన అవసరాన్ని చాటుతున్నాయని ఫిక్కీ వ్యాఖ్యానించింది.

ఈ వారం ప్రారంభంలో న్యూఢిల్లీలో సాగిన రెండు రోజుల మినీ-మినిస్టీరియల్ సమావేశంలో ఈ అంశంపై డబ్ల్యు.టి.ఓ డైరెక్టర్-జనరల్ రాబర్టో అజిజుడు ప్రమాద ఘంటికను మోగించారు. అమెరికా ఇటీవల డబ్ల్యు.టి.ఓ.ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం, సుంకాలను ఏకపక్షంగా పెంచడం వల్ల తలెత్తుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు ప్రపంచంలోని వివిధ దేశాలు ప్రతీకార చర్యలకు అతీతంగా ఆలోచించవలసిన సమయం ఆసన్నమైందని ఫిక్కీ పేర్కొంది. ''ప్రపంచ వాణిజ్యంలో ఉన్న సానుకూల దృక్పథాన్ని గాడి తప్పించేట్లుగా కనిపిస్తున్న, తెరపైకి వస్తున్న ప్రపంచ వాణిజ్య యుద్ధ అవకాశాలను సడలింపజేసే ఈ ప్రక్రియకు మార్గదర్శకత్వం నెరపడంలో ఇండియా గణనీయమైన పాత్ర పోషించేందుకు అవకాశం ఉంది'' అని ఫిక్కీ అధ్యక్షుడు రసేశ్ షా అన్నారు.



డబ్ల్యు.టి.ఓ.ను పటిష్టపరచాలి

మినీ-మినిస్టీరియల్ సమావేశాన్ని 'భావాల వినిమయ' వేదికగా మార్చడం ద్వారా, వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు అన్ని దేశాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చే పనికి ఇండియా నేతృత్వం వహించగలదని నిరూపించారని షా పేర్కొన్నారు. అమెరికా చర్యల వల్ల వాణిజ్య యుద్ధం రగులుకోకుండా నివారించడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు ప్రయత్నం జరిగిందని అన్నారు. డబ్ల్యు.టి.ఓ ప్రక్రియ ఇలా కొనసాగేటట్లుగా చూడడం ముఖ్యం. ఆ బహుళ దేశీయ సంస్థను పటిష్టపరచాలి. దాని వల్ల నియమ ఆధారిత గ్లోబల్ వర్తకం సాధ్యమవుతుంది. ద్వైపాక్షిక సమస్యల పరిష్కారానికి ఒక ప్రభావశీలమైన వేదిక చెక్కుచెదరకుండా ఉన్నట్లవుతుందని షా అన్నారు. ''భిన్న ప్రయోజనాలు కలిగిన దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలకు వీలు కల్పించడంలో ఒక ముఖ్యమైన దేశంగా ఇండియాకు పెరుగుతున్న ఆమోద యోగ్యతను డబ్ల్యు.టి.ఓ.ను పటిష్టపరచడానికి ఉపయోగించుకుని తీరాలి'' అని ఆయన అన్నారు.

అమెరికన్ మేధా ఆస్తిని ''అనుచితం''గా చేజిక్కించుకున్నందుకు చైనాను శిక్షించేందుకు చైనా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారంనాడు 60 బిలియన్ల డాలర్ల సుంకాలను విధించడంతో ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలు మళ్ళీ తెరపైకి వచ్చాయి. ప్రపంచంలోని ఆ రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వర్తక సంబంధాలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సమయంలో, అమెరికా తాజా చర్య వాటిని మరింత తీవ్రతరం చేస్తుందని భావిస్తున్నారు.

ట్రంప్ చర్యకు స్పందనగా, చైనా కూడా 3 బిలియన్ల డాలర్ల విలువైన అమెరికన్ (పంది మాంసం, పైపులతో సహా) వస్తువులపై శుక్రవారంనాడు అధిక సుంకాలు విధించింది. బీజింగ్ నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతిగా చైనా ఆ నిర్ణయం తీసుకుంది. సుంకాలపై రాయితీలను సస్పెండ్ చేస్తున్న ఈ చర్యలు పంది మాంసం, వైనులు, సీమ్‌లెస్ స్టీల్ ట్యూబులతో సహా128 అమెరికన్ వస్తువులపై ప్రభావం చూపుతాయని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.


పట్టు వస్త్రాల పరిశ్రమల అభివృద్ధికి ఊతం

న్యూఢిల్లీ: వస్త్రాల రంగంలో పరిశోధన, అభివృద్ధి, టెక్నాలజీ బదలీ, శిక్షణకు ఒక అంతర్-మంత్రిత్వ శాఖల కమిటీని ఏర్పాటు చేసి, దానికి రూ. 1,000 కోట్లు కేటాయించనున్నట్లు టెక్స్‌టైల్ శాఖ మంత్రి స్మృతి ఇరానీ మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. రూ. 2,161.68 కోట్ల 'పట్టు పరిశ్రమ అభివృద్ధి సమీకృత పథకం' బుధవారంనాడు కేంద్ర మంత్రివర్గ ఆమోదం పొందింది. దీన్ని 2017-18 నుంచి 2019-20 వరకు మూడేళ్ళపాటు అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దానిలో భాగంగానే మంత్రిత్వ శాఖల కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ''పరిశోధన, అభివృద్ధి కృషి టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖకే పరిమితం కాకూడదని మేం భావిస్తున్నాం. అందుకే టెక్స్‌టైల్ కార్యదర్శి చైర్మన్‌గా మొదటిసారిగా ఇతర మంత్రిత్వ శాఖల సహాయంతో ఒక అంతర్-మంత్రిత్వ శాఖల కమిటీని ఏర్పాటు చేస్తాం. పరిశోధన, అభివృద్ధి, టెక్నాలజీ బదలీ, శిక్షణకు సుమారు రూ. 1,000 కోట్లు అందుబాటులో ఉంచుతాం'' అని స్మృతి ఇరానీ చెప్పారు. పథకంలోని నాలుగు అంశాల్లో పరిశోధన, అభివృద్ధి ఒకటి. ఆమోదం పొందిన ప్రణాళిక ప్రకారం, ఆర్ అండ్ డి ప్రాజెక్టులు వ్యాధులను తట్టుకోగల పట్టుపురుగులు, ఆతిథేయ ప్లాంట్ మెరుగుదలలు, ఉత్పాదకతను పెంచే సాధనాలు, నూలు తీయడం, నేయడం వంటి వాటి



ఉపకరణాలకు సంబంధినవై ఉంటాయి. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన, వ్యవసాయ, మానవ వనరుల అభివృద్ధి వంటి ఇతర మంత్రిత్వ శాఖల సహకారంతో ఆ పనులు నిర్వహిస్తారు. పరిశోధన, అభివృద్ధి కింద, శిక్షణ, టెక్నాలజీ బదలీ, ఐటీ ఇనీషియేటివ్‌లపై కూడా ఎక్కువ దృష్టి పెడతారని మంత్రి తెలియజేశారు. ''టెక్నాలజీ బదలీకే, మేం 50,000 మందికి తర్ఫీదు ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం'' అని స్మృతి అన్నారు. పథకంలోని ఇతర అంశాల్లో, సీడ్ ఆర్గనైజేషన్ల ఏర్పాటు, రైతుల ఎక్స్‌టెన్షన్ సెంటర్లు, సీడ్ కోఆర్డినేషన్, మార్కెట్ అభివృద్ధి, నూలు, పట్టు ఉత్పత్తులు, మన్నిక ధ్రువీకరణ వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. క్వాలిటీ సర్టిఫికేషన్ సిస్టంకి పట్టు పరీక్ష సదుపాయాలను చాలా చోట్ల ఏర్పాటు చేయవలసి ఉంటుంది. వ్యవసాయ క్షేత్ర ఆధారిత పట్టుపురుగుల పెంపక కేంద్రాల టెక్నాలజీ అప్-గ్రెడేషన్, ఎగుమతి బ్రాండ్ ప్రమోషన్ వంటివి కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. పట్టు ఉత్పత్తిలో 2022 నాటికి స్వయం సమృద్ధిని సాధించాలని ఈ పథకం లక్ష్యంగా పెట్టుకుంది. దాన్ని సాధించేందుకు, ఇండియాలో హైగ్రేడ్ సిల్కు ఉత్పత్తి దిగుమతుల అవసరం లేకుండా 2022 నాటికి 20,650 టన్నులకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం అది 11,326 టన్నులుగా ఉంది.

బొగ్గు నిర్వహణలో కొత్త రికార్డు



తూత్తుకుడి: మార్చి 20న ఒకే రోజున 48,701 టన్నుల థర్మల్ బొగ్గుతో వ్యవహరించడం ద్వారా కొత్త రికార్డు సృష్టించినట్లు వి.ఓ. చిదంబరనార్ పోర్ట్ ట్రస్టు శుక్రవారం వెల్లడించింది. ఇంతకుముందు జనవరి 14న ఒకే రోజులో 42,508 టన్నులతో వ్యవహరించి నెలకొల్పిన రికార్డును చెరిపేసినట్లయింది. నైవేలి థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా 2016-17 ఆర్థిక సంవత్సరంలో 3.28 మిలియన్ టన్నులతో వ్యవహరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 3.11 మిలియన్ టన్నులతో వ్యవహరించింది. కొత్త రికార్డు సాధించినందుకు సిబ్బందిని, దీనితో ప్రమేయమున్న ఇతరులను పోర్ట్ ట్రస్టు చైర్మన్ ఐ. జయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మరింత పరిమాణాలలో ట్రాఫిక్‌ను ఆకర్షించేందుకు పనితీరు, ఉత్పాదకతలో మెరుగుదల సాధించేందుకు పోర్టు నిరంతరం శ్రమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెరిగిన విద్యుదుత్పాదన

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లోని 2800 మెగావాట్ల లారా సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ మొదటి యూనిట్ విద్యుదుత్పాదనను ప్రారంభించి, గ్రూపునకు చెందిన మొత్తం ఉత్పాదక సామర్థ్యాన్ని 52,991 మెగావాట్లకు చేర్చిందని ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ దిగ్గజం ఎన్.టి.పి.సి శుక్రవారంనాడు తెలిపింది. ఎన్.టి.పి.సికి 21 బొగ్గు ఆధారిత, 7 గ్యాస్ ఆధారిత, 11 సౌర శక్తి పి.వి, రెండు జల విద్యుత్, ఒక పవన విద్యుత్, 8 అనుబంధ సంస్థలు/సంయుక్త రంగ విద్యుత్ స్టేషన్లు ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అదనంగా 19,000 మెగావాట్లకు పైగా విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని నెలకొల్పడంలో కంపెనీ నిమగ్నమై ఉంది. లారా ప్లాంట్ మొదటి యూనిట్ విద్యుదుత్పాదన ప్రారంభించడంతో, మొదలైన ఎన్.టి.పి.సి ఉత్పాదక సామర్థ్యం 46,100 మెగావాట్లుగా, ఎన్.టి.పి.సి. గ్రూప్ ఉత్పాదక సామర్థ్యం 52,991 మెగావాట్లుగా ఉందని సంస్థ తెలిపింది. రాజ్‌గఢ్‌లోని మొదటి యూనిట్ వేసవి సీజనుకు కొద్ది ముందు ఉత్పాదన ప్రారంభించడం, ఛత్తీస్‌గఢ్‌తో సహా పశ్చిమ ప్రాంతంలోని రాష్ట్రాల అదనపు విద్యుత్ డిమాండ్ తీర్చడంలో తోడ్పడవచ్చు. కర్ణాటకలో 800 మెగావాట్ల కడ్గీ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ 2018 మార్చి 12న పని చేయడం ప్రారంభించడంతో ఎన్.టి.పి.సి ఇటీవల 52,000 మెగావాట్ల విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని దాటింది.

టాటా చేతికి భూషణ్ స్టీల్

న్యూఢిల్లీ: రుణాల ఊబిలో కూరుకున్న భూషణ్ స్టీల్ దివాలా వేలం పాటలో టాటా స్టీల్ విజేతగా నిలిచింది. భూషణ్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన రుణ దాతల కమిటీ విజయవంతమైన పరిష్కార దరఖాస్తుదారుగా టాటా స్టీల్ లిమిటెడ్‌ను 2018 మార్చి 22న ప్రకటించింది. అయితే, దీనికి ''ఎన్.సి.ఎల్.టి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదంతో సహా, అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు పొందవలసి ఉంది'' అని టాటా స్టీల్ లిమిటెడ్ శుక్రవారంనాడొక ప్రకటనలో తెలిపింది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ కోడ్ 2016 ప్రకారం కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ కింద బి.ఎస్.ఎల్ స్వాధీనానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ)ను అంగీకరించినట్లు టాటా స్టీల్ తెలిపింది.

చమురు బిడ్డింగ్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: రికార్డు స్థాయిలో చమురు, గ్యాస్ బ్లాకుల బిడ్డింగ్‌కు చివరి తేదీని ప్రభుత్వం గురువారం నాడు మరో నెలకి పొడిగించింది. ఓపెన్ యాకరేజ్ లైసెన్సింగ్ పాలసీ (ఓఏఎల్‌పి) కింద చమురు వెలికితీసేందుకు అవకాశమున్న 55 అన్వేషణ బ్లాకుల వేలంలో బిడ్డింగ్ ముందు అనుకున్న ప్రకారం ఏప్రిల్ 3న ముగియవలసి ఉంది. ''ఓఏఎల్‌పి బిడ్ రౌండ్-1కి బిడ్ల సమర్పణ తేదీని 2018 మే 2 వరకు పొడిగించడమైనది'' అని డెరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్ (డి.జి.హెచ్) ట్వీట్ చేసింది. పొడిగింపునకు అది కారణాలు వెల్లడించలేదు. పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖకు చెందిన అప్‌స్ట్రీమ్ టెక్నికల్ విభాగం డి.జి.హెచ్ ప్రస్తుతం నూతన హైడ్రోకార్బన్ అన్వేషణ లైసెన్సింగ్ విధానం (హెచ్.ఇ.ఎల్.పి) కింద నిర్వహిస్తున్న ఓఏఎల్‌పి బిడ్ రౌండ్‌కి పెట్టుబడిదార్లను ఆకర్షించేందుకు రోడ్ షోలు నిర్వహిస్తోంది. దేశంలో సుమారు 2.8 మిలియన్ చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని అన్వేషణ కిందకు తీసుకువచ్చే ఉద్దేశంతో ఇండియా గత ఏడాది జూలైలో వాటి అభిమతానికి అనుగుణంగా బ్లాకులు రూపొందించుకునేందుకు కంపెనీలను అనుమతించింది. ప్రస్తుతం ఉత్పత్తి లేదా అన్వేషణ లైసెన్సు కింద లేని ఏ ప్రాంతంలోనైనా సరే చమురు, గ్యాస్ వెలికి తీసేందుకు ఆసక్తిని వ్యక్తపరుస్తూ లేఖ (ఇ.ఓ.ఐ) సమర్పించేందుకు ఈ విధానం కింద కంపెనీలను అనుమతిస్తున్నారు. ఏడాదిలో ఏ సమయంలోనైనా ఇ.ఓ.ఐ.లను పెట్టవచ్చు. కానీ, వాటిని ఏడాదికి రెండుసార్లు మాత్రమే లెక్కిస్తారు. చమురు, సహజ వాయువు వెలికి తీసేందుకు బిడ్ చేసిన సంస్థలు దాదాపు 55 బ్లాకులను కోరాయి. వాటిలో 2017 నవంబరు 15న మొదటి ఇ.ఓ.ఐ సైకిల్ ముగిసేనాటికి అత్యధికంగా ప్రభుత్వ యాజమాన్యంలోని ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓ.ఎన్.జి.సి), ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓ.ఐ.ఎల్), ప్రైవేటు రంగ కైర్న్ ఇండియా వంటివి ఉన్నాయని అధికారులు చెప్పారు. ఒక సైకిల్ ముగిసేనాటికి వచ్చిన ఇ.ఓ.ఐల బ్లాకులు లేదా ప్రాంతాలను వేలానికి పెడతారు. మొదటగా ఆ ప్రాంతాన్ని ఎంచుకున్న ఒరిజనేటర్ లేదా సంస్థకు 5 మార్కుల అడ్వాంటేజి లభిస్తుంది. 55 బ్లాకుల మొత్తం ప్రాంతం 59,282 చదరపు కిలోమీటర్ల మేరకు ఉంటుంది. ప్రస్తుతం సుమారు 1,02,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో అన్వేషణ సాగుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి చమురు, సహజ వాయువులో అధిక వాటా ఇవ్వజూపుతున్న, 2డి, 3డి సీసిమిక్ సర్వే ద్వారా గరిష్ఠ అన్వేషణ పనులు నిర్వహించి, అన్వేషణ బావులు తవ్వడానికి మాట ఇచ్చిన కంపెనీకి బ్లాకులను ప్రదానం చేసే అవకాశముంది.

దిగుమతులు తగ్గించడమే ధ్యేయం

చమురు దిగుమతి బిల్లును 10 శాతం తగ్గించి 2022 నాటికి 67 శాతానికి, 2030 నాటికి 50 శాతానికి తీసుకురావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టారు. మోదీ ఈ లక్ష్యాన్ని నిర్దేశించిన తర్వాత, 2015 నుంచి దిగుమతులపై ఆధారపడడం పెరిగింది. భారతదేశం ప్రస్తుతం తన చమురు అవసరాలలో 80 శాతానికి దిగుమతులపైనే ఆధారపడుతోంది. గత ఏడాది నవంబరులో అందిన 57 బిడ్లలో 41 యూనిట్లు వేదాంత లిమిటెడ్‌కు చెందిన యూనిట్ కైర్న్ ఇండియా, ఓ.ఎన్.జి.సిల నుంచి వచ్చాయని అధికారులు తెలిపారు. ఒక రౌండ్‌లో ప్రైవేటు సంస్థ హిందూస్థాన్ ఆయిల్ ఎక్స్‌ప్లొరేషన్ కంపెనీ ఒక ప్రాంతానికి బిడ్ చేసింది. వచ్చిన 57 ఇ.ఓ.ఐ.లలో 55 బ్లాకులకు మాత్రమే బిడ్డింగ్‌కు అనుమతించారు. నో-గో జోన్‌లో ఉన్న ప్రాంతాలను తొలగించారు. ఇప్పటికే తవ్వకాలకు లీజు ఉన్న చోట కోరిన ప్రాంతాలను కూడా తొలగించారు.

ఇంతకుముందు ప్రభుత్వమే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసి, వాటికి బిడ్డింగ్ నిర్వహించేది. ఇప్పుడు దాని స్థానంలో నూతన విధానం వచ్చింది. ఇది మార్కెటింగ్, ధరల స్వేచ్ఛను కల్పిస్తోంది. ఉత్పత్తిని పంచుకునే ఇంతకు ముందరి రౌండ్ల నుంచి మారి రాబడిని పంచుకునే మోడల్‌కు వచ్చింది. చమురు, సహజ వాయువులో గరిష్ఠ వాటాను ప్రభుత్వానికి ఇవ్వజూపే కంపెనీలకు బ్లాకులను ప్రదానం చేస్తారు. ఇంతవరకు ప్రభుత్వం అన్వేషణ లైసెన్సింగ్ రౌండ్‌లో కొన్ని ప్రాంతాలను ప్రభుత్వమే ఎంపిక చేసి, బిడ్డింగ్‌కు ఆఫరు చేయతగ్గ వాటిని గుర్తించి ఇచ్చేది. అన్వేషణకు, ఉత్పత్తికి 2000 నుంచి ఇంతవరకు 256 బ్లాకులను ఆఫరు చేశారు. కడపటి బిడ్ రౌండ్ 2010లో సంభవించింది. వీటిలో 254 బ్లాకులను ప్రదానం చేశారు. కానీ, చమురు, సహజ వాయువు లభించే అవకాశాలు పేలవంగా ఉండడంతో వాటిలో దాదాపు 156 బ్లాకుల్లో అన్వేషణకు స్వస్తి పలికారు.



మనం రియల్
శనివారం, 24 మార్చి 2018
www.manamnews.com

సొంతిల్లు కొనుగోలు చేయడం ఒక కల. జీవితకాలంలో ఇదే ఈ అతిపెద్ద పెట్టుబడి కోసం ఎన్నాళ్లో శ్రమించాలి. రుణం తీసుకుంటే దీర్ఘకాలం పాటు నెలసరి వాయిదాల భారం మోయాలి. గతంలోలాగా కాకుండా.. ఇప్పుడు 30ఏళ్లలోపు వారే ఇల్లు కొనాలనే ఆలోచనకు వస్తున్నారు. ప్రభుత్వం కూడా సొంతిల్లు కొనుగోలు చేసే వారికి పలు ఆకర్షణీయమైన పథకాలు ప్రవేశ పెడుతోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో గృహరుణాల మార్కెట్ దాదాపు 30శాతం మేరకు పెరుగుతుందని అంచనా. చిన్న వయసులోనే సొంతిల్లు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నా.. బడ్జెట్ పరంగా దీనివల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయా? రుణ వాయిదాలు పోను మిగిలే మొత్తంతో రోజువారీ ఖర్చులను ఎలా తట్టుకోవాలి? ఈ సందేహం చాలామందికి వస్తోంది. కాబట్టి, ముందుగానే పక్కా ప్రణాళికతో ఉండి, ఈఎంఐ భారం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇంటి ఈఎంఐ!

దీర్ఘకాల వ్యవధి

గృహరుణానికి వాయిదా చెల్లించిన తర్వాత వచ్చిన ఆదాయంలో ఏమీ మిగలడం లేదు.. ఇలా మీకూ అనిపిస్తోందా.. మీరు ఒక్కరే కాదు. ఇలాంటివారు ఎంతోమంది ఉంటారు. గ హరుణానికి సంబంధించిన వాయిదా.. నెల తొలినాళ్లలోనే వెళ్లిపోతుంది. మిగిలిన దాంతోనే నెలంతా వెళ్లదీయాలి. ద్రవ్యోల్బణానికీ, వేతన పెరుగుదలకూ మధ్య ఎంతో అంతరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్నది పెద్ద చిక్కు ప్రశ్నే. ఇంటి బడ్జెట్‌ను కచ్చితంగా అమలు చేసినా.. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఇలాంటప్పుడు మీ దగ్గరున్న ఏకైక ప్రత్యామ్నాయం గృహరుణ వ్యవధిని పెంచుకోవడమే. దీనివల్ల ఆర్థికంగా కొంత వూపిరి పీల్చుకునే పరిస్థితి వస్తుంది. ఉదాహరణకు.. రూ.60లక్షల గ హరుణానికి 9శాతం వడ్డీ రేటుతో 20ఏళ్ల వ్యవధికి తీసుకున్నారనుకుంటే.. ఈఎంఐ రూ.53,984 చెల్లించాలి. దీన్ని 30 ఏళ్లకు మార్చుకుంటే.. ఈఎంఐ నెలకు రూ.48,277 అవుతుంది. మీ ఆదాయంలో కొంత వృద్ధి వచ్చేవరకైనా ఈ వెసులుబాటును ఉపయోగించుకోండి. మున్ముందు మీ ఆదాయం పెరిగితే.. అప్పుడు మళ్లీ ఈఎంఐను పెంచుకోవచ్చు.

రుణదాతను మార్చండి

మీరు రుణం తీసుకున్న బ్యాంకు మీకు అన్నివిధాలా అనుకూలంగా ఉండకపోవచ్చు. ఇతర రుణ సంస్థల్లోని నిబంధనలు మీకు నచ్చవచ్చు. ఇలాంటప్పుడు రుణాన్ని మీకు నచ్చిన చోటకు మార్చుకునే వెసులుబాటు ఉంది. దీన్ని బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ అంటారు. అయితే, దీన్ని ఎంచుకునేప్పుడు రుసుముల గురించి ఆలోచించాలి. మీకు మిగిలేదానికన్నా, ఖర్చులు ఎక్కువగా ఉంటే ఇబ్బందే. ఒకవేళ మీకు ప్రయోజనం ఉంటుంది అనుకుంటే.. అప్పుడు మార్చుకునేందుకు ఏ ఇబ్బందీ ఉండదు. ఉదాహరణకు మీరు ప్రస్తుతం 9.75శాతం వడ్డీ చెల్లిస్తున్నారు.. కొత్త బ్యాంకులో 8.35శాతం వడ్డీ ఉందనుకోండి. అప్పుడు మీ ఈఎంఐలో 10-12శాతం వరకూ తేడా వస్తుంది.



కొత్త రుణాలు రావాలంటే పాత అప్పులను మొత్తం చెల్లించారా? వాయిదాలు కట్టకుండా తప్పించుకుంటున్నారా? అనేదే ప్రధానం. ఆర్థిక లక్ష్యాలు ఏమైనా వాటిని సాధించాలంటే.. ఎంతో కొంత ఆర్థిక చేయూత అవసరం. ఇది బ్యాంకుల నుంచి తీసుకునే అప్పులు కావచ్చు.. క్రెడిట్ కార్డు కావచ్చు. అప్పులు తీసుకోవాలన్నా.. కార్డులు కావాలన్నా.. సిబిల్ ట్రాన్స్‌యూనియన్ స్కోరు బాగుండాలి. రుణ చరిత్రలో ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులూ ఉండకూడదు. కొన్ని సర్వేల ప్రకారం చూస్తే.. క్రెడిట్ స్కోరు 750 అంతకన్నా ఎక్కువ ఉన్నవారికే 79శాతం వరకూ రుణాలు సులభంగా లభిస్తున్నాయి. అందుకే, కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా మంచి క్రెడిట్ స్కోరు సాధించేందుకు ప్రయత్నించాల్సిందే. మంచి క్రెడిట్ స్కోరు కోసం.. ముందుగా సిబిల్ నివేదికలో ఉండే ప్రధానమైన అంశాల గురించి తెలుసుకోవాలి. ఇందులో ముఖ్యంగా 'అకౌంట్స్' విభాగం గురించి. ఇందులో ఇప్పటికే తీసుకున్న రుణాలు, క్రెడిట్ కార్డులు, రుణ సంస్థల వివరాలు ఉంటాయి. ఇంటి రుణమా, వాహన రుణమా, వ్యక్తిగత రుణం, ఓవర్‌డ్రాఫ్ట్ ఇలా ఏ తరహా రుణం తీసుకున్నారన్న అంశాలూ ఉంటాయి. ఖాతాల సంఖ్య, రుణం ఎంత? ఎప్పుడు తీసుకున్నారు, చివరిసారిగా వాయిదాలు ఎప్పుడు చెల్లించారు. ఇంకా ఎంత చెల్లించాలి.. అనే వివరాలు ఉంటాయి. నెలవారీ చెల్లింపులకు సంబంధించి దాదాపు మూడేళ్ల వరకూ పేర్కొంటారు. ప్రతి రుణ ఖాతాకు ఎదురుగా 'స్టేటస్' అనే అంశమూ ఉంటుంది. మీ రుణ చెల్లింపులు సరిగా ఉన్నాయా లేదా తెలిపేది ఈ అంశమే.



చెల్లింపులు పూర్తయితే: మీరు తీసుకున్న అప్పును రూపాయితో సహా తీర్చేస్తే.. మీ అప్పు స్థితి (స్టేటస్) ముందు పూర్తిగా తీర్చేశారని పేర్కొంటూ 'క్లోజ్డ్' అని పేర్కొంటారు. అంటే బ్యాంకు పూర్తిగా మీ ఖాతాను రద్దు చేసిందని అర్థం. రుణ నివేదికలో ఇలా ఉండటమే సరైంది. రుణం తీసుకొని, దానిని పూర్తిగా చెల్లించిన తర్వాత.. బ్యాంకు నుంచి ఎలాంటి బాకీలు లేవని ఒక ధ్రువీకరణ పత్రాన్ని (నో డ్యూస్ సర్టిఫికెట్) తీసుకోవడం మర్చిపోవద్దు. దీనిని తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఏమైనా అనుకోని నోటీసులు వచ్చినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. సిబిల్ నివేదికలోనూ 'క్లోజ్డ్' అని నమోదయ్యిందా లేదా చూసుకోవాలి.



కొత్త ఇల్లు కొన్న తర్వాత..!

కొత్తగా ఇల్లు కొన్నారా? రుణ వాయిదాలు ప్రారంభమయ్యాయా? అయితే, జీతంలో సింహభాగం.. ఈ రుణ వాయిదాకే వెళ్లి పోతోంది.. ఇప్పటి వరకూ ఉన్న మిగులు కనిపించదు.. ఆర్థికంగా ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదుర్కోవాల్సి రావచ్చు.. మరి, వీటిని తట్టుకోవడం ఎలా? సొంతిల్లు.. సొంతంగా పెట్టుబడి పెట్టిన డబ్బు.. గృహరుణం కలిస్తేనే ఈ కల నెరవేరేది. ఇప్పటి వరకూ ఆర్జించిన మొత్తం చేతిలో నుంచి కరిగిపోవడంతోపాటు, కొత్తగా గృహరుణం రూపంలో ఓ దీర్ఘకాలిక అప్పు మన తలపైకి వచ్చి చేరుతుంది. ఇప్పటివరకూ ఏ ఇబ్బందీ లేకుండా సాగిన బడ్జెట్ జీవితం.. కాస్త ఆటుపోట్లకు గురికావడం సహజమే కదా. తాత్కాలికంగా ఏర్పడే నగదు ఇబ్బందిని క్రెడిట్ కార్డుతో అధిగమించవచ్చు. కానీ, దీర్ఘకాలంలో ఇది సాధ్యం కాదు కదా! అందుకే, ఇతర మార్గాలను అన్వేషించాలి. బంగారం తాకట్టు పెట్టి, నగదును పొందడానికి ప్రయత్నించవచ్చు. ఇతర అప్పులతో పోలిస్తే.. ఇది కాస్త తక్కువ వడ్డీకే వస్తుంది. పని చేస్తున్న సంస్థ నుంచి వేతన అడ్వాన్సు పొందేందుకు ఏదైనా అవకాశం ఉందా చూసుకోండి. సాధారణంగా దీనికి వడ్డీ ఉండదు. గృహరుణం ఈఎంఐ అధికంగా ఉందా చూసుకోండి.. దాన్ని తగ్గించుకునేందుకు అవకాశం ఉందా పరిశీలించండి. బ్యాంకును అడిగి, వ్యవధి పెంచుకోవడం చేసుకోవచ్చు. 20 ఏళ్లకు బదులు.. 25 ఏళ్లకు వ్యవధిని పెంచుకోవచ్చు. దీనివల్ల కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది. రుణ మార్పిడి చేసుకోవచ్చు. కానీ, దీనికి చాలా లెక్కలు చూసుకోవాల్సి ఉంటుంది. ఎండోమెంట్ పాలసీల్లాంటివి ఉంటే వాటిని తాకట్టు పెట్టి, రుణం తీసుకోవచ్చు. ఐదేళ్లకు మంచి ఉన్న యూనిట్ ఆధారిత పాలసీల నుంచి పాక్షికంగా కొంత మొత్తం వెనక్కి తీసుకోవచ్చు.అవసరానికి డబ్బు ఇచ్చే స్నేహితులు ఉండే ఉంటారు. వారికి మీ వాస్తవ పరిస్థితిని వివరించి, కొన్ని రోజులపాటు కొద్దిగా డబ్బు సర్దుబాటు చేయాల్సిందిగా అడగండి. సాధ్యమైనంత తొందరగా తీర్చాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుంచుకోండి. ఇక మీ దగ్గర్నుంచి వెళ్తున్న ప్రతి రూపాయినీ కట్టడి చేయడం ప్రారంభించండి. ఇంటి ఖర్చులో 10శాతం తగ్గించుకునేందుకు ప్రయత్నించండి. మీ ప్రయత్నాన్ని మీ కుటుంబ సభ్యులు అపార్థం చేసుకోకుండా చూసుకోండి.అధికంగా ఖర్చవుతున్న అంశాలేమిటో గుర్తించండి. వాటిని ఎంత మేరకు వాయిదా వేసుకోవచ్చన్నది గమనించండి.

బోనస్‌లను వాడుకోండి

చాలా కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులకు బోనస్‌లను ప్రకటిస్తుంటాయి. ఈ మొత్తంతో చాలామంది నచ్చిన వస్తువులను కొనడం లేదా విదేశీ యాత్రలకు వెళ్లడం చేస్తుంటారు. అయితే.. దీనిని గృహరుణానికి అదనపు వాయిదాగా చెల్లించే వీలును పరిశీలించాలి. వీలైనంత వరకూ చెల్లిస్తూ ఉంటే.. రుణ వ్యవధి తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. ఫలితంగా ఈఎంఐ మొత్తం తగ్గుతుంది. అదనపు ఈఎంఐ చెల్లింపు అనేది చూడ్డానికి చిన్నదిగానే అనిపించినా.. దీర్ఘకాలంలో దీనివల్ల మంచి



ఫలితాలు అందుతాయి. ప్రస్తుతం అన్ని గృహరుణ సంస్థలూ, బ్యాంకులూ చలన వడ్డీ రేటుకు రుణాలు తీసుకున్న వారు ముందస్తు చేసే చెల్లింపులకు ఎలాంటి రుసుములూ విధించడం లేదు. ముందస్తు ఈఎంఐలు చెల్లించడం వల్ల మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరూ బాగుంటుంది.

అప్పుడప్పుడూ అసలు చెల్లించండి

కొన్నిసార్లు అనుకోకుండా కొంత సొమ్ము చేతికి రావచ్చు.. ఏదైనా ఆస్తి అమ్మినప్పుడు, మనీ బ్యాక్ పాలసీల నుంచి డబ్బు రావచ్చు. ఇలాంటప్పుడు మీ కోరికలను అదుపు చేసుకొని, గృహరుణంలో అసలు మొత్తానికి ఆ డబ్బును జమ చేయండి. ఇలా అనుకోకుండా వచ్చిన డబ్బును తెలివిగా ఉపయోగించుకోవడం ద్వారా ఎంతో భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు రుణం తీసుకున్న మూడేళ్ల తర్వాత.. రూ.లక్షను మీరు అసలుకు జమ చేశారనుకుందాం.. 9శాతం వడ్డీకి 15ఏళ్లపాటు తీసుకున్న రూ.50లక్షల రుణంలో రూ.1.88లక్షల వరకూ భారం తగ్గుతుంది. 6 నెలల ముందుగానే రుణం తీరిపోతుంది. ఇలా మీరు అప్పుడప్పుడూ చెల్లిస్తూ ఉన్నారనుకోండి.. వ్యవధి లేదా ఈఎంఐ తగ్గి, మీకు పెద్ద మొత్తంలో ప్రయోజనం లభిస్తుంది. రుణం తీసుకున్న తొలినాళ్లలో ఇలా అప్పుడప్పుడూ అసలు మొత్తాన్ని చెల్లించడం ఆచరణీయం. ఎందుకంటే.. రుణం తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో అసలు మొత్తం తక్కువగా ఉంటుంది. వడ్డీ కోసం మినహాయించుకునేదే అధికంగా ఉంటుంది.




కొనుగోలుదార్లకు కొండంత రక్ష!



సొంతిల్లు... ప్రతి ఒక్కరి కల.. ఇది నెరవేర్చుకునే దశలో ఎన్నో ఇబ్బందులు.. స్థలం/ఫ్లాటు ఎంపిక చేసుకునే దగ్గర్నుంచి.. గృహ ప్రవేశం దాకా అనేక చికాకులు. స్థలం విషయంలోనూ.. నిర్మాణ దశలోనో మోసాలు జరిగితే ఎవరిని సంప్రదించాలో.. ఏం చేయాలో కూడా తెలియని పరిస్థితి. అదో పెద్ద స్థిరాస్తి వ్యాపార సంస్థ. అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలున్నాయి. వారో సుందర స్వప్నాన్ని సృజించారు. ఆ వెంటనే దాన్ని అమ్మకానికి పెట్టేశారు. ప్రపంచ ప్రమాణాలతో హైదరాబాద్ శివారుల్లో 160 ఎకరాల ఆర్థిక, ఆవాస అద్భుతాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించారు. ఇంకేముంది కుటీర భవంతులు (విల్లాలు), వాటాల (ఫ్లాట్ల) కోసం ఎంతోమంది వరుస కట్టారు. 900 మంది రూ. 830 కోట్లను బయానాల రూపంలో చెల్లించారు. ఆ సంస్థ అనేక అవకతవకలకు పాల్పడిందన్న అభియోగంతో కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది చాలదన్నట్లు ఆ కంపెనీకి భూమిని అమ్మిన వారికి హక్కులే లేవంటూ మరో కేసు పడింది. హైకోర్టు, కంపెనీ లా బోర్డుల జోక్యంతో నిర్మాణ బాధ్యత మరో కంపెనీకి అప్పగించి, పూర్తి చేయించడానికి అనేక సంవత్సరాలు పట్టింది. ఇబ్బందులు వచ్చాక... తప్పుల విచారణ, ఎవరో ఒకర్ని బలి పశువుని చేయటం, నాలుగు రోజులు చర్చించుకోవడం.. ఆ తర్వాత మర్చిపోవడం.. చాలా సాధారణంగా జరిగేవివే. ఏళ్ల తరబడి పరిష్కారం దొరకక నష్టపోయిన వారెందరో! అసలు పొరపాట్లు లేకుండా చెయ్యలేమా? తప్పులకు అవకాశం లేకుండా చేస్తే? ఒకవేళ జరిగినా వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టగలిగే ప్రక్రియ ఉండాలి.. ఎప్పటికప్పుడు జరుగుతున్న ప్రతి విషయాన్ని బహిరంగపర్చే అవకాశం కల్పించాలి.. కొనుగోలుదార్లను సంపూర్ణ సమాచారంతో అప్రమత్తం చేయాలి.. చెప్పిందే చేయాలి.. చేసేదే చెప్పాలి! కొనుగోలుదారు డబ్బుకు, స్థల యాజమాన్య హక్కులు, నిర్మాణానికీ భద్రతా, బీమా కల్పించాలి. అమ్మకాల నుంచి ఆస్తి అప్పచెప్పే వరకూ పర్యవేక్షణ కోసం నిపుణులతో నియంత్రణా సంస్థను ఏర్పాటు చేయాలి. ఆ సంస్థ ఎప్పటికప్పుడు సూచనలు, ఉత్తర్వులు ఇస్తూ చర్యలు చేపట్టేలా ఉండాలి. ఇదే స్థిరాస్తి నియంత్రణ చట్టం ప్రధాన లక్ష్యం.



ఇంటి రుణం పెరిగే మార్గం!



సొంతింటి కోసం కలగనడం.. అది వాస్తవ రూపంలోకి రావడం.. ఈ రెండింటికీ మధ్య ఎన్నో ఆలోచనలు.. అవసరాలు.. బరువులు ఉంటాయి. ముఖ్యంగా మన సంపాదనలో సింహభాగాన్ని కొన్నేళ్లపాటు ఈ అప్పు తీర్చేందుకే కేటాయించాలి. ఎంత వరకూ రుణం తీసుకోవాలి.. ఎక్కడ నుంచి తీసుకోవాలి. ఆయా రుణ సంస్థ సేవలు ఎలా ఉంటాయి.. స్థిర, చలన వడ్డీ రేట్లలో దేన్ని ఎంచుకోవాలి. మీ ఆదాయం ఎంత? రుణాన్ని చెల్లించే సామర్థ్యం ఏ మేరకు ఉంది.. గృహరుణ మొత్తాన్ని సాధారణంగా ఈ రెండు అంశాలే నిర్ణయిస్తాయి. దీంతోపాటు.. మీరు ఎంచుకున్న వ్యవధి, వడ్డీ రేట్లు కూడా మీకు వచ్చే రుణానికి కీలకమే. రుణ సంస్థలు మొత్తం ఆదాయంలో 60శాతానికి మించి ఈఎంఐ లేకుండా ఉండేలా చూస్తుంటాయి. ఇందులో ఏ ఇతర అప్పులూ ఉండకూడదు అని భావిస్తాయి. ఇల్లు కొన్న తర్వాత అతని రోజువారీ జీవితానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందీ ఎదురవ్వకూడదనే ఆలోచనతో రుణ సంస్థలు ఇలా వ్యవహరిస్తాయి. రుణ గ్రహీత వయసు, ఇప్పటికే ఉన్న రుణాలు, రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు, గతంలో తీసుకున్న రుణాల చెల్లింపులు, ప్రస్తుతం ఉన్న ఇతర రుణాలు.. పదవీ విరమణ వయసు ఇలా అనేక అంశాల ఆధారంగా ఎంత గృహరుణం ఇవ్వాలనే విషయాన్ని రుణ సంస్థలు నిర్ణయిస్తాయి. అధిక మొత్తంలో గృహరుణం కావాలనుకున్నప్పుడు.. ఒక్కరు కాకుండా.. ఇద్దరు కలిసి ఉమ్మడిగా రుణానికి దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. జీవిత భాగస్వామి, కొడుకు/కూతురును సహ దరఖాస్తుదారులుగా పేర్కొనడం ద్వారా రుణ మొత్తం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మీకు వ్యక్తిగత, వాహన రుణాల్లాంటివి ఉంటే వాటిని వీలైనంత వరకూ ముగించేయడానికి ప్రయత్నించండి. దీనివల్ల గృహరుణ మొత్తం పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ఇల్లు ఒకేసారి కొంటాం.. స్వల్పకాలిక రుణాల వల్ల మీ జీవిత కాల లక్ష్యానికి ఇబ్బంది కలగకూడదు. రుణ మొత్తం తగ్గితే.. మీరు ఇంటి విషయంలోనూ రాజీ పడాల్సి వస్తుంది. ఇలా జరక్కుండా వీలైనంత వరకూ రుణాలను ముగించేయడమే మంచిది. గృహరుణం దాదాపు 25 ఏళ్ల వరకూ ఉండే దీర్ఘకాలిక అప్పు. మీ ఆదాయం పెరిగినప్పుడు.. మిగులు మొత్తం ఉన్నప్పుడు.. గృహరుణానికి దాన్ని జమ చేస్తే.. భారం తగ్గుతుంది. గతంలో తీసుకున్న రుణాల తాలూకు కొంత మొత్తం బాకీ పడిపోతుంటాం. వీటి గురించి పట్టించుకోం. కానీ, కొత్త రుణాలు కావాల్సి వచ్చి.. రుణ చరిత్ర నివేదికలను పరిశీలనలో ఈ విషయాలు బయటపడతాయి. అప్పుడు మీకు రుణం వచ్చే అవకాశాలు తగ్గిపోవడంతోపాటు, రుణ మొత్తంలోనూ కోత పడొచ్చు. మీ చెల్లింపు సామర్థ్యం, క్రమశిక్షణను అంచనా వేయడానికి రుణ చరిత్ర కీలకమనే విషయాన్ని విస్మరించకూడదు.

ఆస్తులు కొందాం...

స్థిరాస్తి అంటే.. కదలకుండా స్థిరంగా ఉంటుందని మన నమ్మకం.. బంగారంలా దొంగలు ఎత్తుకెళ్లలేరు. డబ్బులా కరిగిపోదు.. జీవితాంతం తోడునీడలా ఉంటూ.. అవసరానికి ఆదుకుంటుంది. అందుకే, అందరూ తమ స్థాయి, స్తోమత బట్టి భూముల్నీ, ప్లాట్లనూ.. కనీసం ఇల్లు, ఫ్లాటును కొనేస్తుంటారు. ఇలా కొన్న ఆస్తులకు ఏమైనా చిక్కులు వస్తే? మానసికంగా ఎంతో ఆవేదన.. అలాంటి పరిస్థితి మీకు ఎదురవ్వకూడదు అనుకుంటే.. కొనేప్పుడు ఏం చూడాలి. వ్యవసాయ భూమి.. పరిశ్రమలకు, వ్యాపార భవంతులకు పనికొచ్చే పట్టణ భూమి.. నివాస స్థలం (ప్లాటు), ఇల్లు, ఫ్లాటు.. ఏదైనా సరే.. ఇవన్నీ భూమిలో భాగమే. మీరు కొనబోయే భూమికి దారి ఉందా? నీటి వసతి ఉందా? నేల ఎలాంటిది అనే విషయాలు తెలుసుకుంటారు. ఇవి ఎంత అవసరమో.. భూమికి నిజమైన యజమాని ఎవరు.. మనకు అమ్మే వారి హక్కులు ఏమిటి? అతడు యజామానా? యజమాని నుంచి హక్కులు, అధికారాలేమైనా పొందాడా? ఆ హక్కులు, అధికారాలు ఇంకా అమల్లో ఉన్నాయా? అనేవీ అంతే ప్రధానం. ఇవన్నీ తెల్సుకోవాలంటే... అతని వద్ద ఉన్న పత్రాల్ని అడగాలి. వాటిని పరిశీలించాలి. మనకు అర్థం కాకపోయినా, అనుమానం వచ్చినా అంత సమయం, అనుభవం లేకపోయినా మనకు నమ్మకమైన అనుభవజ్ఞులైన స్థిరాస్తి న్యాయవాదుల్ని సంప్రదించాలి. ఎందుకంటే.. స్థిరాస్తి పత్రాలు అర్థం కావాలంటే వాటికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, ఎప్పటికప్పుడు మారుతూ ఉండే భాష్యాలు, పరిపాలనా విధివిధానాలు, సాంకేతిక మార్పులు తదితరాలపైన పూర్తి అవగాహన ఉండాలి. చట్టాలు అవే ఉన్నా.. వాటి అమలు, తీరును బట్టి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మారుతూ ఉంటాయి. భూ యాజమాన్య హక్కుల్ని తెలుసుకోవడం చాలా సులువని చాలామంది అనుకుంటూ ఉంటారు.



మనం స్పోర్ట్స్
శనివారం 24 మార్చి 2018
www.manamnews.com

ఐపీఎల్ టిక్కెట్ల అమ్మకాలు షురూ..

హైదరాబాద్: వచ్చే నెలలో ప్రారంభ మయ్యే ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ప్రారంభించింది. టిక్కెట్ల కోసం.. sunrisershyderabad.in వెబ్‌సైట్‌ను ఆశ్రయించాలని నిర్వాహకులు తెలిపారు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఏప్రిల్ 9 నుంచి మే 19 వరకు జరిగే ఏడు మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాలను ఈ సైట్‌లో అందు బాటులో ఉంచారు. రూ.500, రూ.781.25, రూ.1.171.88, రూ.2,734.38, రూ.3,906.56, ధరలతో టిక్కెట్లను అమ్ముతున్నారు. అభిమానుల కోసం ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించారు. ఐపీఎల్‌తో తొలి మ్యాచ్‌ను హైదరాబాద్ జట్టు ఏప్రిల్ 9న రాజస్తాన్ రాయల్స్‌తో ఆడుతుంది.

హాట్‌కేకుల్లా నైట్‌రైడర్స్ మ్యాచ్ టిక్కెట్లు

ఐపీఎల్‌లో హాట్‌ఫేవరిట్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఆడే మ్యాచ్ టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఏప్రిల్ 8న నైట్‌రైడర్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తొలి మ్యాచ్ ఆడుతుంది. ఆ మ్యాచ్‌కు ఇప్పటికే సగం టిక్కెట్లు అమ్ముడు పోయానని నిర్వాహకులు తెలిపారు. రూ.400 నుంచి 26 వేల రూపాయల వరకు వివిధ కేటగిరిల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్వాహకులు టిక్కెట్లు అమ్ముతున్నారు.

దీపికతో నటించను : కోహ్లీ



బెంగళూరు: భారత్‌లో మెగా ఐపీఎల్ టోర్నీ సందడి మొదలైంది. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీ కోసం ఇప్పటి నుంచి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జట్టుకు 'గోఐబిబో' రూ.11 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. 2017లో బాలీవుడ్ భామ దీపిక పదుకొణెని గోఐబిబో బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. తాజాగా ఆర్‌సీబీతో ఒప్పందం కుదుర్చుకున్న గోఐబిబో విరాట్ కోహ్లీ-దీపిక పదుకొణె మీద ఐపీఎల్ కోసం ఓ యాడ్ తీద్దామనుకున్నారు. ఇదే విషయాన్ని కోహ్లీకి తెలపగా.. దీనికి అతడు నో చెప్పినట్లు సమాచారం. దీంతో గోఐబిబో ఆర్‌సీబీతో ఒప్పందాన్ని రద్దు చేసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 'మా యాడ్‌లో నటించనని కోహ్లీ నో చెప్పలేదు. ప్రచార కార్యక్రమాల్లో మరో సెలబ్రెటీతో నటించనని మాత్రమే చెప్పాడు' అని గోఐబిబో నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఒప్పో మొబైల్స్‌కి కోహ్లీ, దీపికలు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టీమ్‌కు కెప్టెన్ విరాట్ కోహ్లీ వల్ల పెద్ద నష్టమే వచ్చింది. కోహ్లీ లేకుండా ఇంకా డీల్ ఎందుకులే అనుకున్న గోఐబిబో దానిని రద్దు చేసుకుంది. దీనివల్ల ఆర్సీబీకి రూ.11 కోట్ల నష్టం వాటిల్లింది. అయితే దీపికాతో నటించను అని కోహ్లీ అన్నాడంటే దానికి ఇంకా ఏవేవో కారణాలు ఊహించుకోకండి. దానికీ ఆర్సీబీ కాంట్రాక్టే కారణం. ఈ కాంట్రాక్ట్‌లోని ఓ క్లాజ్ ప్రకారం.. విరాట్ మరే ఇతర సెలబ్రిటీతో కలిసి నటించకూడదు. గోఐబిబో మాత్రం కోహ్లీ కచ్చితంగా దీపికాతో కలిసి నటించాలని డిమాండ్ చేసింది. అది కాంట్రాక్టు నిబంధనలకు విరుద్ధం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో డీల్ రద్దు చేసుకోవాల్సి వచ్చింది.



ప్రపంచ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్

వివాన్ కపూర్‌కు రెండు కాంస్యాలు

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియనషిప్‌లో టీనేజ్ షూటర్ వివాన్ కపూర్ రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో వివాన్ కపూర్ పురుషుల ట్రాప్ ఈవెంట్‌లోనూ, టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు కాంస్యాలు అందించాడు. తొలి సారి ఈ పోటీల్లో పాల్గొంటున్న కపూర్ మెన్స్ ట్రాప్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. టీమ్ ఈవెంట్‌లో లక్ష్య షెరోన్, అలి ఎమన్ ఎలాహిలతో కలసి కపూర్ మూడో స్థానంలో నిలిచి భారత్‌కు మరో కాంస్యం అందించాడు. ఈ పోటీల్లో ఇప్పటి వరకూ భారత్ నాలుగు పతకాలు గెలుచుకుంది.



హాకీ స్వర్ణం అందేనా?



గతం ఘనం.. వర్తమానం శూన్యం అన్నట్టు తయారైంది భారత హాకీ. ఎప్పుడో ఒలింపిక్స్‌లో ఓ వెలుగు వెలిగిన భారత హాకీ కళ తప్పింది. కారణం ఏదైనా కావచ్చు ... ప్రస్తుతం మన జాతీయ క్రీడ హాకీ అప్పుడప్పుడూ గుర్తుకొచ్చే ఆటగా మారిపోయింది. ఎన్నో ఆటుపోట్లు, అడ్డంకులు అధిగమించి ఆసియా స్థాయిని దాటి ప్రస్తుతం ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి చేరుకుంది. ఇప్పడిప్పడే ఐరోపా దేశాల ఆధిపత్యాన్ని అడ్డుకుంటోంది. కామన్‌వెల్త్ క్రీడల్లో భారత హాకీ బృందం ఆట ఆసక్తి రేపుతోంది.

ఒలింపిక్స్ తర్వాత అతిపెద్ద క్రీడా పండుగగా పిలిచే కామన్‌వెల్త్ క్రీడల్లో భారత హాకీ జట్టును స్వర్ణం ఊరిస్తోంది. ఘన చరిత్ర ఉన్న ఈ కామన్‌వెల్త్ పోటీల్లో భారత హాకీ జట్టు ఇప్పటిదాకా ఒక్క స్వర్ణం కూడా గెలుచుకోలేదు. ఈ నేపథ్యంలో కోటి ఆశలతో భారత హాకీ జట్టు కామన్‌వెల్త్ క్రీడలకు బయల్దేరింది. కామన్‌వెల్త్ క్రీడల్లో మిగతా ఈవెంట్లలో భారత్ ఆధిపత్యం ప్రదర్శించటం ఖాయంగా కనిపిస్తోంది. బ్యాడ్మింటన్, బాక్సింగ్, కుస్తీ, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, షూటింగ్ క్రీడాంశాల్లో సత్తా చూపెట్టేందుకు భారత క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారు. అయితే హాకీలో పరిస్థితేమిటన్నదే అభిమానులకు అంతుచిక్కటం లేదు.

రెండు సార్లు రజతాలు

1998 కామన్‌వెల్త్ క్రీడల నుంచి భారత పురుషుల హాకీ జట్టు పోటీలో ఉంది. అయితే ఇప్పటి దాకా భారత్ రెండు సార్లు ఫైనల్ దాకా చేరుకున్నా రజతం మాత్రమే గెలుచుకుంది. ఢిల్లీలో జరిగిన 2010 కామన్‌వెల్త్ క్రీడల ఫైనల్లో ఆస్ట్రేలియా 8-0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించి స్వర్ణ పతకం గెలుచుకోగా, ఆ తర్వాత 2014 గ్లాస్గోలో జరిగిన పోటీల్లో అదే ఆస్ట్రేలియా జట్టు 4-0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ పోటీల్లో ఇప్పటిదాకా ఇదే భారత పురుషుల హాకీ జట్టు అత్యుత్తమ ప్రదర్శన.

తొలి మ్యాచ్ నుంచే గండం

ఏప్రిల్ 4 నుంచి 15 వరకు జరిగే ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు పూల్-బిలో బలమైన జట్లతో పోటీపడుతుంది. భారత్‌తో పాటు ఈ పూల్‌లో ఇంగ్లండ్, మలేసియా, పాకిస్తాన్, వేల్స్ జట్లున్నాయి. ఈ చాంపియన్‌షిప్ తొలి మ్యాచ్‌ను భారత్ పాకిస్తాన్‌తో ఆడుతుంది. పూల్ -ఏలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్ ఆడుతున్నాయి. పూల్‌బిలో భారత్‌కు ఇంగ్లండ్, మలేసియా, పాకిస్తాన్ నుంచి గట్టిపోటీ ఎదురవ్వొచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా భారత్ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ గెలిస్తే భారత్ గండం గట్టెక్కినట్టే. పూల్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు అర్హత పొందుతాయి.

నిరాశపరచిన సన్నాహాలు

హాకీ జట్టుకు పునర్వైభవం తెచ్చే దిశగా అడుగులేస్తున్న భారత ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. పలు శిక్షణ శిబిరాలు నిర్వహించింది.

కామన్‌వెల్త్‌లో భారత హాకీ ప్రతిభ

ఏడాది	వేదిక	స్థానం
1998	కౌలాలంపూర్	4
2010	ఢిల్లీ	2
2014	గ్లాస్గో	2

కామన్‌వెల్త్ క్రీడల భారత హాకీ షెడ్యూల్

- ఏప్రిల్ 7 : భారత్ X పాకిస్తాన్
- ఏప్రిల్ 8 : భారత్ X వేల్స్
- ఏప్రిల్ 10: భారత్ X మలేసియా
- ఏప్రిల్ 11: భారత్ X ఇంగ్లండ్

విదేశీ మంత్రం ఫలించేనా...

కామన్‌వెల్త్ క్రీడల్లో భారత హాకీ జట్టు కొత్త ప్రయోగాలతో బరిలోకి దిగుతోంది. ఈ పోటీల కోసం నెదర్లాండ్స్ కోచ్ మారిజెన్ అన్ని విభాగాల్లోనూ భారత ఆటగాళ్లను రాటుదేల్చాడు. బంతిని ఎక్కువ సేపు అదుపులో ఉంచుకోవద్దని మారిజెన్ ఆటగాళ్ల సూచించాడని కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ చెబుతున్నాడు. బంతిని అదుపులో ఉంచుకుని డ్రిబ్లింగ్‌కు ప్రయత్నించకుండా ప్రత్యర్థిపై దాడి చేయటమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌లో బరిలోకి దిగుతున్నామని మన్‌ప్రీత్ చెప్పాడు. ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థిపై దూకుడుగా ఆడబోతున్నామని అన్నాడు. పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మరల్చలేకపోవటం భారత్‌కు పెద్ద లోటుగా మారిందని, అయితే డ్రాగ్ ఫ్లిక్ స్పెషలిస్ట్‌లు రఘునాథ్, రూపిందర్ సింగ్‌లు ఈ విభాగంలో మెరుగైన ఆటతీరును కనబరుసున్నారని మన్‌ప్రీత్ ఆశాభావం వ్యక్తం చేశాడు. నలుగురు డ్రాగ్ ఫ్లిక్ స్పెషలిస్ట్‌లు భారత జట్టులో ఉన్నారని అన్నాడు.

ఒడిశా ప్రభుత్వం భారత హాకీ జట్టుకు స్పాన్సరర్‌గా ముందుకొచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన కోచ్ సెజోర్డ్ మారిజెన్‌కు తోడుగా అనలిటికల్ కోచ్‌గా ఆస్ట్రేలియా ఒలింపిక్ ప్లేయర్ క్రిస్ సెలెరియోను నియమించించి ఆటగాళ్లకు అన్ని విభాగాల్లోనూ శిక్షణ ఇప్పించింది. ఇక ఈ చాంపియన్‌షిప్ సన్నాహాల్లో భాగంగా భారత్ మలేసియాలో జరిగిన అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. ఆ తర్వాత భారత హాకీ జటు కొరియాతో మ్యాచ్‌లు ఆడినా అక్కడా అనుకున్న తీరిలో రాణించలేకపోయింది. కొత్త కుర్రాళ్లతో ఈ రెండు సిరీస్‌లో భారత హాకీ సమాఖ్య అధికారులు చేసిన ప్రయోగాలు అనుకున్న రీతిలో ఫలితాన్నివ్వలేదు. దీంతో మరో సారి మిడ్‌ఫీల్డర్ భారత్ మన్‌ప్రీత్ సింగ్‌పై పతకం తెచ్చేభారం మోపింది. పలువురు సీనియర్లతో పాటు యువరక్తాన్ని జట్టులో నింపింది.

ఆస్ట్రేలియాకు ఇంగ్లండ్ షాక్



ముంబాయి: మూడు దేశాల మహిళల టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టుకు ఇంగ్లండ్ షాకిచ్చింది. ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్‌లో భారత్‌ను ఓడించి దూకుడు మీదున్న ఆస్ట్రేలియా రెండో మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చేతిలో చిత్తయింది. ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి 8 వికెట్లు నష్టపోయి 149 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా జట్టులో రేచల్ హెయాన్స్ 45 బంతుల్లో 65 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఇంగ్లండ్ మీడియం పేస్ బౌలర్లు జానీ మూడు, స్కివర్ రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ మరో మూడో ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌ఉమెన్ స్కివర్ (43 బంతుల్లో 68 రన్స్), బేమోంట్ 44 బంతుల్లో 58) అజేయంగా అర్థ సెంచరీలు సాధించి మూడో వికెట్‌కు 73 బంతుల్లో 116 రన్స్ పార్ట్‌నర్‌షిప్ అందించి జట్టుకు సునాయాసంగా విజయాన్నందించారు.

సంక్షిప్త స్కోర్లు : ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 159/8 , హేన్స్ 65, హీలే 31, గన్ 3/26), ఇంగ్లండ్ 17 ఓవర్లలో 150/2 (స్కివిర్ 68 నాటౌట్, బేమౌంట్ 58 నాటౌట్).

వార్నర్ వర్సెస్ రబాడా



కేప్‌టౌన్ : ఆస్ట్రేలియా -దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న మూడో టెస్ట్‌లో ఆటగాళ్ల మధ్య పరుగుల యుద్ధం జరి గింది. అతిగా ప్రవర్తించినా నిషేధం నుంచి తప్పిం చుకున్న దక్షిణాఫ్రికా బౌలర్ రబాడాపై వార్నర్ చెలరేగిపోయాడు. రబడా బౌలింగ్‌లో వరుసగా ఐదు ఫోర్లు బాదాడు. ఒక ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన వార్నర్ ఆ తర్వాతి ఓవర్‌లో ఒక సిక్స్ ఒక ఫోర్ బాదాడు. అయితే వార్నర్ దూకుడుకు రబాడా కళ్లెం వేశాడు. ఆ తర్వాతి బంతికే క్లీన్ బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు.

ఎక్కడైనా ఆడతా

హైదరాబాద్ ఆటగాడు వృద్ధిమాన్ సాహా



కోల్‌కతా: ఏ స్థానంలో అయినా ఆడేందుకు రెడీగా ఉన్నానని ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-11 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరా బాద్ ఆటగాడు వృద్ధిమాన్ సాహా చెబుతున్నాడు. హైదరాబాద్ కోరితే ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ సేవలు అందించేందుకు సిద్ధం ఉన్నట్లు తెలిపాడు. కేవలం టాపార్డర్‌లోనే కాకుండా, లోయర్ ఆర్డర్‌లో కూడా బ్యాటింగ్ చేస్తానని ఈ సందర్భంగా సాహా స్పష్టం చేశాడు. 'నేను ఇప్పుడు సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నా. ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. పొట్టి ఫార్మాట్‌లో పరిస్థితులకు తగ్గట్టు ఆడాల్సిన అవసరం ఉంటుంది. నాకు అప్పజెప్పే బాధ్యతల్ని నిర్వర్తించడానికి రెడీగా ఉన్నా. ఆ క్రమంలో ఎక్కడ బ్యాటింగ్ చేయాల్సిన వచ్చినా అది సమస్యగా భావించను' అని సాహా తెలిపాడు. మరోవైపు ఆగస్టు 1వ తేదీ నుంచి ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌పై కూడా సాహా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌తో కఠినమైన సవాల్ ఉంటుందని పేర్కొన్న సాహా.. అక్కడ పరిస్థితులకు తగ్గట్టు ఆడితే అది కచ్చితంగా మన జట్టుకు లాభిస్తుందన్నాడు. కాగా, ఇంగ్లండ్‌లో వికెట్ల వెనుక కీపింగ్ చేయడం అంత ఈజీ కాదని సాహా పేర్కొన్నాడు.

వరల్డ్‌కప్‌కు ఆఫ్ఘనిస్తాన్



హరారే: వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరిగే వన్డే ప్రపంచ కప్‌కు ఆఫ్ఘనిస్తాన్ అర్హత సాధించింది. ప్రపంచ కప్‌లో ఆడే చివరి రెండు జట్ల కోసం జరిగిన క్వాలిఫైయింగ్ టోర్నీ చివరి లీగ్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఐర్లండ్‌ను ఐదువికెట్ల తేడాతో ఓడించి ప్రపంచ కప్‌కు అర్హత సంపాదించింది. ఈ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిన ఆఫ్ఘనిస్తాన్ ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి ప్రపంచ కప్ బెర్త్ కొట్టేసింది. ఇంతకు ముందే స్కాట్లాండ్‌పై విజయం సాధించిన వెస్టిండీస్ ప్రపంచ కప్‌కు అర్హత సంపాదించింది. చివరి సూపర్ సిక్స్ లీగ్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ జట్టు 50 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 209 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ మరో ఐదు బంతులు మిగిలిఉండగానే 49.1 ఓవర్లలో ఐదువికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని సాధించింది.

విలియమ్‌సన్ సెంచరీ



ఆక్లాండ్ : న్యూజిలాండ్‌తో ఇక్కడ జరుగుతున్న తొలి డే అండ్ నై టెస్ట్‌లో కివీస్ ఆధిపత్యం కొనసాగుతోంది. మొదటి రోజు ఇంగ్లండ్‌ను 58 పరుగులకు ఆలౌట్ చేసిన న్యూజిలాండ్ జట్టులో రెండో రోజు కెప్టెన్ విలియమ్‌సన్ సెంచరీ చేశాడు. విలియమ్‌సన్‌కు ఇది టెస్టుల్లో 18వ సెంచరీ. దీంతో న్యూజిలాండ్ తరపున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో విలియమ్‌సన్ మొదటి స్థానంలో నిలిచాడు. ఇంతకు ముందు న్యూజిలాండ్ జట్టులో మార్టిన్ క్రో, రాస్ టేలర్‌లు మాత్రమే 17 సెంచరీలు చేశారు. 2010లో భారత్‌పై అహ్మదాబాద్‌లో తొలి టెస్ట్ ఆడిన విలియమ్‌సన్ మొదటి మ్యాచ్‌లోనే సెంచరీ చేశాడు. ఇప్పటి దాకా 64 టెస్టులు ఆడిన విలియమ్‌సన్ ఈ మ్యాచ్‌లో 220 బంతుల్లో 102 పరుగులు చేసి అవుటయ్యాడు. మొదటి రోజు 91 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ జట్టులో విలియమ్‌సన్ 202 బంతుల్లో 11 ఫోర్లు ఓ సిక్స్‌తో సెంచరీ పూర్తి చేశాక అండర్సన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ నాలుగు వికెట్లు నష్టపోయి 229 పరుగులు చేసింది. మొత్తంగా 117 పరుగుల ఆధిక్యతలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్ అండర్సన్ మూడు వికెట్ల పడగొట్టాడు.

సంక్షిప్త స్కోర్లు : ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ : 58 ఆలౌట్, న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్ :229/4 (విలియమ్‌సన్ 102, నికోలస్ 49 నాటౌట్, వాటింగ్ 17 నాటౌట్, అండర్సన్ 3/53).

నిజం అందరికీ తెలుసు

టీమిండియా పేస్ బౌలర్ షమి





ముంబాయి : ఎవరెన్ని ఆరోపణలు చేసినా వాస్తమం ఏమిటో అందరికీ తెలుసని టీమిండియా పేస్ బౌలర్ షమి అన్నాడు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొని భారత క్రికెట్ బోర్డు నుంచి క్లీన్‌చిట్ పొందటంతో ఊపిరి పీల్చుకున్న షమి వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానున్న ఐపీఎల్ సీజన్‌పై దృష్టి పెట్టాడు. షమి మ్యాచ్ ఫిక్సింగ్ చేశాడని, దుబాయిలో ఓ మహిళ నుంచి డబ్బులు తీసుకున్నాడని భార్య జహాన్ ఆరోపించటంతో రంగంలోకి దిగిన బీసీసీఐ విచారణ కు ఆదేశించింది. అవినీతి నిరోధక విభాగం అధికారి నీరజ్ కుమార్ ఈ వ్యవహారంపై విచారణ జరిపి షమి ఎలాంటి ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేల్చడంతో బీసీసీఐ కంట్రాక్టు ప్లేయర్ల జాబితాలో చేర్చింది. ఐపీఎల్‌లో ఆడేందుకు కూడా షమికి లైన్ క్లియర్ అయింది. తన కెరీర్‌లోనే పెద్ద ఎదురుదెబ్బని అయితే ఈ ఆరోపణల నుంచి తాను బయటపడతానని ముందే ఊహించానని షమి ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. కష్ట సమయంలో అండగా నిలిచిన అభిమానులకు, స్నేహితులకు థ్యాంక్స్ చెప్పిన షమి, దేశం కోసం ఆడటంపైనే దృష్టి పెడతానని చెప్పాడు. జహాన్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని తానే ముందు కోరానని షమి గుర్తు చేశాడు. 'మిగతా ఆరోపణల నుంచీ త్వరలో బయటపడతానని అన్నాడు. తాజాగా బీసీసీఐ నిర్ణయంతో చిక్కుల్లో నుంచి బయటపడ్డ షమి వచ్చే ఐపీఎల్ సీజన్‌పై దృష్టి పెట్టాడు. ఐపీఎల వేలంలో మూడు కోట్లు పెట్టి ఢిల్లీ డేర్‌డెవిల్స్ కొనుగోలు చేసింది. ఏప్రిల్ 8న ఢిల్లీ డేర్‌డెవిల్స్ తొలి మ్యాచ్‌లో కింగ్స్ లెవెన్ పంజాబ్‌తో ఆడుతుంది. ఈ సీజన్ కోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ మొదలుపెట్టిన షమీ తన ఫామ్‌ను కంటిన్యూ చేస్తానని చెప్పాడు.

మమతతో జహాన్ భేటీ

తనకు న్యాయం చేయాలంటూ క్రికెటర్ మహ్మద్ షమి భార్య హసీన్ జహాన్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కోరారు. షమి కుటుంబ సభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలున్నాయని ఆరోపించి పోలీసులకు ఫిర్యాదు చేసిన జహాన్ శుక్రవారం అసెంబ్లీలో మమతా బెనర్జీని కలిసింది. పది నిమిషాల సేపు మమతా బెనర్జీతో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడకుండా జహాన్ వెళ్లిపోయింది. జహాన్ చెప్పిందంతా విన్న మమత ఈ విషయంపై పోలీసు అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు సమాచారం. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై విచారణ జరిపిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం గురువారం షమికి క్లీన్ చిట్ ఇచ్చింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.